# పెళ్ళంటే చేదా?

ఎన్.ఎస్.మణ్యమ్



కోడి కూసింది శుబ్బారాయుడి గదిలో.

మామూలు కోళ్ళన్నీ కంఠం పోయేలా అరిచి విశ్రాంతి తీసుకొని.

అప్పుడే నాలుగు గంటలు కావొస్తుంది.

శుబ్బారాయుడి గదిలో కోడి మామూలు కోడి కాదు.

సీమ టైంపీస్‌లో 'అలారం' కోడి అది.

ఆ గదిలో ఆ కోడి టైంపీస్‌లోంచి బయటకు తొంగి చూస్తి కూసి తిరిగి లోపలకి పోయింది. అంటే పది గంటలు అయిందని అర్థం.

శుబ్బారాయుడు లేచి బద్ధకంగా ఆవలించి హెచ్. ఎమ్. టి. చేతి గడియారం చూశాడు.

అది కూడా పది గంటలే చూపిస్తోంది.

దేశీయ వస్తువుల నాణ్యత పరీక్ష చెయ్యడం శుబ్బారాయుడికున్న ముఖ్యమైన 'హాబీ'లలో ఒకటి

శుబ్బారాయుడి జీవిత ధ్యేయాలు రెండు.

మొదటిది- ఎవడి కింద ఉద్యోగం చెయ్యకుండా ఉండడం.

రెండోది- సంసార బాదరబందీ లేకుండా బ్రహ్మచారిగా వుండడం.

ఉద్యోగం లేదుకదా అని శుబ్బారాయుడు వట్టి సోమరి అనుకుంటే పొరపాటు.

ప్రొద్దున పది గంటల నుంచి రాత్రి పన్నెండు గంటలకి 'నైట్‌కేప్' వేసుకొనేదాకా అతను ఎన్నో పనులు చేస్తాడు. అతనంటే గిట్టనివాళ్ళు శుబ్బారాయుడి దైనికకార్యక్రమాన్ని

స్వర్గీయ పి. జి. ఉడ్‌హౌస్ జన్మించి వంద సంవత్సరాలయింది.

ఆయన శైలిలో తెలుగులో ఒక రచన చెయ్యాలన్న సత్సంకల్పమే ఈ రచన ('గగనానికీ ఇలకూ బహు దూరం' అని తెలిసి కూడా) ః ఈ రచన కేవలం కల్పితం- అనీ, ఇందులో పాత్రలను చూసి ఎవరయినా భుజాలు తడుముకుంటే ఆ బాధ్యత వారిదేననీ మనవి.

—రచయిత

ఒక్క వాక్యంతో నిర్వచిస్తారు.

'క్షణం తీరిక లేదు దమ్మిడీ ఆదాయం లేదు' అని.

కాని అతనంటే గిట్టనివాళ్ళు చాలా తక్కువ మంది.

సన్నగా, పొడుగ్గా, తెల్లగా వుండే విగ్రహం. నొక్కు నొక్కుల నల్లని జుత్తు. వెనక దువ్వబడి సైడ్‌బర్న్స్, సన్నని మీసం, మడత నలగని పేంట్, దాని మీద కూడా మడతనలగని పొడుగు చేతుల 'స్లేక్'లతో ఆకర్షణీయంగా ఉంటాడు శుబ్బారాయుడు.

'తన చుట్టుప్రక్కల పరిసరాల్ని ఆహ్లాదకరంగా చెయ్యడమే' తన ఉద్దేశం అంటాడు.

'పరిసరాలు' అంటే కేవలం అతనుండే మూడు గదుల ఇల్లు, దాని చుట్టూ వుండే చిన్నతోట అని అర్థం కాదు.

'దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుష్యులోయ్' అన్నాడు మహాకవి.

'మనిషి ఉండే వాతావరణాన్ని మారిస్తే మనుష్యులే మారతారు' అంటాడు మార్క్స్.

'పరిసరాలు' అంటే శుబ్బారాయుడి ఉద్దేశంలో ఇవన్నీ.

'మరి జీవనోపాధి సంగతి ఏమిటి' అని ఎవరయినా అడగొచ్చు.

శుబ్బరాయుడి అమ్మా, నాన్నలు వాడు స్కూల్ చదువు ముగిసేలోపులోనే పోయారు.


సోదర, సోదరీమణులు ఎవ్వరూ కూడా లేరు అతనికి.

అతని నాన్న చనిపోతూ ఆస్తికంతా శుబ్బారాయుడి బాబాయిని 'ట్రస్టీ'గా పెట్టాడు.

ఆస్తి అంతా శుబ్బారాయుడికి పెళ్ళి అయిన తర్వాత మాత్రమే ఇవ్వాలనీ విల్లులో రాశాడు.

వాళ్ళ బాబాయి శుబ్బారాయుడికి నెల నెలా వెయ్యి రూపాయలు పంపుతాడు.

ఆయనకి 'ఇన్‌ఫ్లేషన్' అంటే అర్థం తెలియదు.




అయినా ఈ రోజుల్లో కూడా ఆ డబ్బు మామూలుగా ఒకడికి చాలు, ఉండేది విజయవాడలోనయినా.

కాని, శుబ్బారాయుడు ఒకడే కాదు,

అతనితోపాటు అతని సేవకుడు కమ్ కుక్ వెంకన్న ఉంటాడు.

'డిక్లయిన్ అండ్ ఫాల్ ఆఫ్ ఇండియన్ సినిమా' అనే అంశంమీద ఒక ఉద్గ్రంథం రాసే ఉద్దేశం అతనికుంది.

'రిసెర్చి మెటీరియల్' కోసం వచ్చిన ప్రతి హిందీ, తెలుగు సినిమా చూస్తాడు.

ఎంత దిగజారుతున్నామో 'కంపేరిజన్' కోసం ఇంగ్లీషు సినిమాలుకూడా చూస్తాడు.

పైగా 'ఫిల్మ్ సొసైటీ'లో సభ్యుడు. మిగతా భాషల సినిమాలు చూడడంకోసం.

'సార్త్రే టు పోపు సాహిత్యం'అనే ఇంకో అంశంమీద పరిశోధన కోసం అన్ని ఇంగ్లీష్, తెలుగు నవలలు చదువుతాడు. పైగా కొని చదువుతాడు అవన్నీ. తెలుగు, ఇంగ్లీష్‌లలో మంచి వక్త కాబట్టి, విజయవాడ చుట్టుప్రక్కల ఊళ్ళలోని క్లబ్స్, అసోషియేషన్స్ శుబ్బారాయుడిని ఉపన్యాసకుడుగా తరచు ఆహ్వానిస్తారు.

కాని ఆంధ్రలో ఉపన్యాసాలకు కేవలం ఆహ్వానం మాత్రమే పంపుతారు సాధారణంగా

దారి ఖర్చులు, తిండి ఖర్చుల విషయల ప్రస్తావించకుండా విజయవాడలోనే కాలేజి చదువు సాగించాడు కాబట్టి 'సోషలిస్ట్' సంపర్కాలున్నాయి కూడా అతనికి. ఉదతాభక్తిగా ఆ సంస్థలకు కూడా సాయం చేస్తాడు-మాట సాయమే కాకుండా ధనసహాయం కూడాను. శుబ్బారాయుడే స్థాపించిన 'ఆంధ్ర ప్రోగ్రెసివ్స్ ఎన్ సెంబెల్ క్లబ్' (కురచగా చెప్పాలంటే 'ఏప్ క్లబ్')లో సభ్యత్వానికి, టెన్నిస్ ఆడడానికి, ఒక్కొక్కసారి 'రమ్మీ' 'ఢంకాపలాస్'లు ఆడడానికికూడా డబ్బుకావాలి.

వీటన్నిటికీ వాళ్ళ బాబాయి పంపే నెలకి వెయ్యి రూపాయలు ఒక్కొక్కసారి సరిపోవు.

పైగా ఒక్కొక్కసారి మద్రాస్, బెంగుళూర్‌లు వెళ్ళినపుడు శుబ్బారాయుడు చెప్పినట్లు వినని గుర్రాలు కొంత ఆర్థిక సంక్షోభం కలుగజేస్తూ వుంటాయి అతనికి.

'డెఫిసిట్ ఫైనాన్సింగ్' మీద గడపడానికి శుబ్బారాయుడు భారతప్రభుత్వం కాదు.

అటువంటి పరిస్థితులల్లో కూడా బాబాయిని తిట్టడు అతను. అంతగా అయితే అలాటి పరిస్థితులల్లో బుల్లి బుల్లి ఉద్యోగాలు టెంపరరీగా చెయ్యడానికి అతనికి అభ్యంతరంలేదు.

పదిగంట లయిందని నిర్ధారణ చేసికొన్న తర్వాత ప్రక్కన టీపాయికేసి చూశాడు శుబ్బారాయుడు.

ఆ రోజు పేపర్, దానిమీద ఒక టెలిగ్రాం ఉంది.

టెలిగ్రాం చింపి చదివాడు.

'మేరేజ్ ఫిక్స్‌డ్-మై బ్రైడ్ ఆల్‌రెడీ మేరీడ్-కమ్ ఇమ్మిడియట్లీ. -ఏ.వి. రావ్'



రిప్లయి పెయిడ్ టెలిగ్రాం అది.

శుబ్బారాయుడి మిత్రబృందం నుంచి వచ్చే టెలిగ్రాములమీద చర్య తీసుకోవాలంటే రిప్లయి పెయిడ్ అయి వుండాలన్న విషయం అందరికీ తెలిసిన విషయమే.

రెండోసారి చదివాడు టెలిగ్రాం.

టెలిగ్రాంలో మామూలుగా ఉండే స్పెల్లింగ్ తప్పులు ఒక్కటీ లేకుండా సాక్షాత్తూ షేక్స్‌పియరే ఆ టెలిగ్రాం రాశాడా అన్నట్లుంది.

సిగరెట్ వెలిగించి ఇంకోసారి చదివాడు.

ఈసారి తెలుగు తర్జుమా చేసికొంటూ.

'పెళ్ళి నిశ్చయమయింది'

అంతవరకు బాగానే వుంది.

'నా పెళ్ళికూతురికి ఇది వరకే పెళ్ళి అయింది'

తెలుగులోకూడా అర్థం సరిగ్గా రావడంలేదు.

'వెంటనే బయలుదేరవలెను'

అదీ బాగానే వుంది.

'ఏవీరావ్' తెలుగులో 'ఏమీరావు' అనే అర్థం స్ఫురించిన-అది ఏవీరావ్ ఉరఫ్ అబ్లూరి వెంకట్రావ్ పొరపాటుకాదు.

వెంకట్రావు శుబ్బారాయుడి క్లాస్‌మేట్ బి.ఎ.లో.

'ఎప్ క్లబ్'కి మొదటి కోశాధికారి.

ఆ రోజుల్లో క్లబ్‌కి కోశం అంత లేకపోయినా తన స్వంత కోశం క్లబ్‌కి యిస్తూ వుండడంవల్ల వెంకట్రావ్ కోశాధికారి పదవిని ఎవ్వరూ వ్యతిరేకించేవారు కాదు.

దరిమలా బందరులో అమ్మ, నాన్నల దగ్గర వుంటూ అక్కడే ఓ 'గోల్డ్ కవరింగ్' కంపెనీలో పని చేస్తున్నాడు.

'కామ్రేడ్ వెంకన్నా' అని కేకేశాడు శుబ్బారాయుడు పడకమీద నుంచి.

'ఏం బాబూ లేచారా' అంటూ వేడి కాఫీ కప్పుతో ప్రత్యక్షమయ్యాడు వెంకన్న.

తప్పు మాత్రమే కాకుండా కాఫీ కూడా వేడిగానే వుంది.

'కామ్రేడ్. ఈ టెలిగ్రాం ఎప్పుడు వచ్చింది' అని అడిగాడు శుబ్బారాయుడు కాఫీ చప్పరిస్తూ.

'వచ్చి ఓ గంటయినాదండీ' అన్నాడు వెంకన్న వినయంగా.

'నిన్న రాత్రి ఏదయినా పుచ్చుకొన్నావా' అని ప్రశ్నించాడు శుబ్బారాయుడు.

'అదేటి బాబు అలాగంటారు' అన్నాడు వెంకన్న టెలిగ్రాముకీ, తాను నిన్నరాత్రి వేసికొన్న ఓ గ్లాసుకూ సంబంధం ఏమిటా అని ఆలోచిస్తూ.

'నో కామ్రేడ్. నన్ను అపార్థం చేసికొన్నావు. నీ మెదడు బాలభానుని కిరణాలతో అప్పుడేవిచ్చుకొన్న పుష్పంలా తాజాగా వుందా అని తెలిసికోవడమే నా ఉద్దేశం' అన్నాడు శుబ్బారాయుడు.

'ఇందాకా కోడిగుడ్లవాడు ఆరుగుడ్లు యిచ్చి ఒక్కొక్క గుడ్డు ఇరవై రెండు పైసలన్నాడండీ. నేను రెండు రూపాయల నోటిచ్చి అరవై ఎనిమిది పైసలు ఇమ్మన్నాను మరి' అన్నాడు వెంకన్న విశదపరుస్తూ.

'భేష్: అలా అయితే 'ఫ్రెష్'గానే వున్నావన్న మాట. ఫరవాలేదు. అసలు ప్రశ్న ముందర ఒక బుల్లి ప్రశ్న. బాలభానుని కిరణాలు అంటారు కవులు. ఎలా వుంటాయి అవి' అన్నాడు శుబ్బారాయుడు తెలిసికోవాలన్న సదుద్దేశంతో.

'ఎండ వచ్చేసరికి తోటలో పని పూర్తి చేస్తానండి' అన్నాడు వెంకన్న

'నీ మాటలు వింటే కృష్ణశాస్త్రిగారి ఆత్మక్షోభిస్తుంది. బాలభానుని కిరణాలని 'ఎండ' అని సూటిగా తేల్చివేసినందుకు అయినా మీ 'ప్రోలిటేరియట్'లో నేనిష్టపడేది అదే. పిల్లిని పిల్లే అంటారుకాని మార్జాలము, బిడాలము అని అనరు కదా. సరే అసలు ప్రశ్నకి వద్దాం. 'నా పెళ్ళి కూతురికి ఇదివరకే పెళ్ళి అయింది' అంటే అర్థమేమిటి' అని ప్రశ్నించాడు శుబ్బారాయుడు.

'ఏటి బాబూ. రాత్రి లేటయినా దేటి' అన్నాడు వెంకన్న నవ్వుతూ.

'ఇంటికి రావడం ఆలస్యమయిందా అనే భావమే నీ ప్రశ్నలో వుంటే అది నిజమే. విజయాటాకీస్‌లో కొత్త తెలుగు పిక్చర్ రెండో ఆటకి వెళ్ళిరావటం దానికి కారణం' అన్నాడు

శుబ్బారాయుడు ఓపిగ్గా.

కార్మిక, యజమాని వర్గాల ఘర్షణకి మూలకారణం ఒకరు చెప్పేది ఇంకొకరు పూర్తిగా అర్థం చేసుకోక పోవడమే కారణం అని నమ్మేవాళ్ళలో శుబ్బారాయుడు ఒకడు.

అందుచేత వెంకన్న ఏది అడిగినా వివరంగా జవాబులు యిస్తాడు.

'వెంకట్రావు యిచ్చిన ఈ టెలిగ్రాం సారాంశం అది' అన్నాడు శుబ్బారాయుడు.

'మా కులాల్లో మారు మనువులు ఒప్పుకుంటారుకాని బాబూ....' అన్నాడు వెంకన్న తలగోక్కుంటూ.

.... కాని వెంకట్రావ్ కులం వేరేకదా అంటావు, అంతేగా. బాగా ఎనలైజ్ చేశావు. నువ్వింక ఒక పత్రిక పెట్టుకొని సంపాదకుడవు అవ్వొచ్చు. సరే ఆ పెన్ ఇలా అందుకో' అన్నాడు శుబ్బారాయుడు.

'ఎన్‌జోయ్‌డ్ యువర్ జోక్-సారీ-బిజీ' అని టెలిగ్రాం మీద రాసి 'ఇది వెంటనే పోస్టాఫీస్‌కు వెళ్ళి యిచ్చిరా' అని వెంకన్నని పంపి బ్రష్‌మీద పేస్ట్ వేసికొన్నాడు.

## 2

ఇదే పాతకాలపు అపరాధ పరిశోధక నవలలో అయితే యిలా వ్రాసేవారు. 'చదువరీ! ఒకసారి ఇటురమ్ము మన అపరాధ పరిశోధకోత్తముడు గూర్చి యింకనూ తెలిపికొందము! శుబ్బారాయుడు అసలు పూర్తిపేరు చల్లా సుబ్బారాయుడు.

పేరు మరీ పాత తరహాగా వుందని దరిమిలా 'సి ఎస్. రాయుడు' అని రాసుకొనేవాడు.

'కరిక్యూలర్' యాక్టివిటీస్'కన్న 'ఎక్స్‌ట్రా కరిక్యూలర్' వాటిల్లో ఆసక్తి ఉండడంవల్ల స్కూల్ ఫైనల్ ఒకసారి ఢింకీ కొట్టితే వాడి మాస్టార్లంతరూ 'ఏముంది! వాడి పేరులోనే వుంది జవాబు లేమీ రాయడు' అన్నారు.

కాలేజిలో చేరిన తర్వాత శుబ్బారాయుడుగా మార్చాడు.

అతన్ని ఎవరికయినా పరిచయం చేస్తే అతను మొదట చెప్పేది. 'శుబ్బారాయుడు కుంటి 'స' కాదు మెలిక 'శ' అని.

అలాగే యింగ్లీషులో కూడా పేరు స్పెల్లింగ్ 'ఎస్ డబల్ ద్'గా మార్చాడు 'ఎస్ యు' బదులు.

విజయవాడలో బి.ఎ. చదివి వాల్తేరులో బి.ఎల్. చదివి, పాసయి కనీసం బోర్డు కూడా కట్టని ప్రత్యేకత శుబ్బారాయుడిది.

'విజ్ఞానాన్ని పొట్టకూటి కోసం వినియోగించడమా' అంటాడు అతను ఆటంబాంబునుంచి అగ్గిపెట్టెవరకు, 'సాల్ బెల్లో' నుంచి 'స్కాంద పురాణం' దాకా ఏ విషయం గురించయినా స్పష్టంగా, ధారాళంగా ఇంగ్లీష్, తెలుగులలో మాట్లాడడం, ప్రసంగించడం కూడా అతని ప్రత్యేకత.

పన్నెండు గంటలకి నీటుగా ముస్తాబయి శుబ్బారాయుడు 'ఏవ్ క్లబ్‌లోకి' అడుగుపెట్టాడు.

ఆదివారం అవ్వడం మూలాన క్లబ్ అంతా సందడిగా వుంది.

మెయిన్ హాల్‌లో ఒక మూల 'రమ్మీ', రెండో మూల 'ధంకా ఫలాస్' రంజుగా సాగుతోంది.

శుబ్బారాయుడు 'రమ్మీ' టేబిల్ దగ్గరకెళ్ళాడు.

అప్పటికే ఆరుగురు మూడుపేకలతో ఆడుతున్నారు.

'డీల్' చేసిన ఆసామి అప్పటికే చాలా నష్టాల్లో వున్నాడు.

శుబ్బారాయుడు అతని ప్రక్కనేకూర్చున్నాడు.

శుబ్బారాయుడు వచ్చిన విశేషమేమోకాని ఆ 'డీల్'లో ఒక 'నేచరల్' మూడు జోకర్లు కలిసాయి ఆ ఆసామికి.

ఆట మొదలెట్టగానే మొదట ఆడాల్సిన వాళ్ళిద్దరూ పడేశారు

'డీల్' చేసిన ఆసామికి తిక్కెక్కింది.

'ఆరంభింపరు నీచమానవులు....' అన్న పద్యం ప్రకాశముగా ఎత్తుకొన్నాడు.

'డ్రాప్' చేసిన వాళ్ళిద్దరు కోపంగా చూశారు ఆ ఆసామి కేసి మిగతా ముగ్గురూ ఆడారు.

'డీల్' చేసిన ఆసామికి ఛాన్స్ వచ్చేటది కాని, 'కార్డ్ షో' అలాగే వుండిపోయింది.

రెండో రౌండ్‌లో ఇంకో ఇద్దరు 'మిడిల్ డ్రాప్' చేశారు.

'ఆరంభించి. పరిత్యజింతు రధముల్'అని మళ్ళీ పద్యం ఎత్తుకున్నాడు ఆ ఆసామి.


ఈ సారి ఛాన్సు వచ్చినపుడు 'షో' చూపించాడా ఆసామి.డబ్బు తీసికొంటూ అన్నాడాసామి. 'ప్రొద్దున్న నుంచి కౌంట్‌మీద కౌంట్ తీసుకొన్నార్రా వాళ్ళంతా శుబ్బారాయుడూ! నాకు కాస్త కలిస్తే ఫస్ట్ డ్రాప్ ఇద్దరూ, సెకండ్ డ్రాప్ ఇద్దరూ ఛీ'.

'కామ్రేడ్! పేషన్స్ ఉండాలి. అయినా నీ పద్యాలతో అలా వాళ్ళని హడల కొట్టేస్తే ఎలా ఆడతారనుకున్నావ్?' అన్నాడు శుబ్బారాయుడు అనునయంగా.

శుబ్బారాయుడు కూడా కూర్చున్నాడు ఆటకి.

మొదటి ఆటలోనే డీల్ కొట్టాడు శుబ్బారాయుడు.

'ఫుల్ కౌంట్' చదివించుకొన్నాడు ఆ ఆసామి.



రెండో ఆట కూడా సుబ్బారాయుడే నెగ్గాడు.

మళ్ళీ 'ఫుల్ కౌంట్' అయింది ఆ ఆసామికి.

'సుబ్బారాయుడూ తర్వాత ఇస్తారా.' అంటూ గాత్రం పాడాడు. అదృష్టం మారుతుందేమోనని.

మూడో ఆట ఆ ఆసామే నెగ్గాడు.

ఈ సారి సుబ్బారాయుడు 'ఫుల్ కౌంట్ అయింది.

బాకీ కాపిటల్ అయింది.

నాలుగో ఆట మళ్ళీ ఆ ఆసామే నెగ్గాడు.

'కామ్రేడ్! తర్వాత ఇస్తానోయ్' అన్నాడు సుబ్బారాయుడు సౌమ్యంగా.

'పాడు కాంతా! పాడు....' అన్నాడాసామి వ్యంగ్యంగా 'మురిపించే మువ్వలు' సినిమాలోని పాటని పాడ్తూ.

సుబ్బారాయుడు మొహంలో మందహాసం వెలిసింది నెమ్మదిగా ఆ ఆసామికి జవాబిచ్చాడు.

'నీ దివ్య నాదస్వరం ముందు....' అని. టేబిల్ అంతా ఘొల్లుమని నవ్వారు.

'అంతేరా! నేను నెగ్గుతుంటే ఎవ్వరూ చూడలేరు' అన్నాడాసామి కసిగా.

'నో! కామ్రేడ్! డోంట్ లూజ్ యువర్ షర్ట్. అప్పులు మొదలెట్టింది నువ్వు 'నీవు నేర్పిన విద్యయే నీరజాక్ష' అన్నాడు నవ్వుతూ సుబ్బారాయుడు.

ఒక గంట ఆట అయ్యేటప్పటికి సుబ్బారాయుడు మొదట నెగ్గినదీ అసలు తెచ్చుకున్నదీ అంతా ఖాళీ అయింది. "కామ్రేడ్స్ దటీజ్ ఇనఫ్ ఫర్ ది డే ఫర్ మి. క్షమించాలి అంటూ వెనక గదిలోకి దారితీశాడు.

కొద్దిగా పరిచితుడు ఒకడు కనపడ్డాడు.

ఆ పరిచితుడు రాజకీయాలంటే చెవి కోసుకుంటాడు. 'హలో! కామ్రేడ్! మన ఎయిర్ బస్ మినిస్ట్రీని బోయింగ్ 737గా చేసేస్తున్నారటఅంటూ సుబ్బారాయుడు పలకరించాడు అతని ప్రక్కన వున్న ఈజీ ఛెయిర్ లో కూర్చుంటూ.

'అసలు సంగతి....'

'ఒన్ మినిట్, ఏయ్ అప్పన్నా! ఆరు కోల్డ్ బీర్స్ పట్రా అని' బాయ్‌కి పురామాయించి.

'ఏమంటున్నారూ' అన్నాడు సుబ్బారాయుడు.

'అసలు సంగతి....'

ఆ అసలు సంగతి విశదీకరణ అయ్యేసరికి టైము కూడా రెండు గంటలయింది.

నాలుగు బీరు బాటిల్స్ ఖాళీ అయ్యాయి.

'సారీ సర్! ఐ థింక్ అయామ్ ఫీలింగ్ సిక్. ఐ విల్ హేవ్ ఫ్రెష్ ఎయిర్!' అంటూ క్లబ్ బయటకి వచ్చాడు. ఆ ఆసామి బీర్‌కి డబ్బు అప్పన్న ఇవ్వడం క్రీగంట గమనిస్తూ.

రాఘవయ్య పార్క్ దగ్గర వున్న యింటికి చేరేటప్పటికి రెండున్నర అయింది.

డైనింగ్ టేబిల్ మీద భోజనం అమర్చి వసారాలో నిద్రపోతున్నాడు వెంకన్న.

వెంకన్న 'సియస్తా'ని సుబ్బారాయుడు సాధారణంగా పాడు చెయ్యడు. భోజనానికి కూర్చున్న సుబ్బారాయుడి దృష్టి నెయ్యి గిన్నె క్రింద వున్న టెలిగ్రాం మీద పడింది.

అది ఇంకో రిప్లయి పెయిడ్ టెలిగ్రాం వెంకట్రావ్ నుంచి 'డేమ్ యువర్ బిజీ - కమ్' అని ఉంది అందులో.

వెంకట్రావుకి కోపం రానంతవరకు ఇంగ్లీషులో బాగానే ఆలోచిస్తాడు, రాస్తాడు కూడా.

కాని కోపం వస్తే 'ఏడ్‌వెర్బ్స్'ల సంగతి అలా వుంచి 'వెర్బ్'లకే దిక్కు వుండదు.

'వాట్! సో ఎఫిసియంట్ ఈజ్ అవర్ పి ఎండ్ టి' అని ఆశ్చర్యపోయాడు సుబ్బారాయుడు.

స్వగతంగా కాకుండా ప్రకాశంగా.

ఆ కేకకు వెంకన్న లేచి లోపలకు వచ్చాడు.

'ఆయన బాగున్నారా అండీ' అన్నాడు వెంకన్న బిక్క మొహం వేసి.


'సారీ! కామ్రేడ్. నా అరుపుకి నీ నిద్రాభంగం అయింది.


నా అరుపులో భావం-మన తంతి మరియు తపాలాశాఖ నైపుణ్యానికి నా జోహార్లర్పించడం. వెంకట్రావు కేమీ ఢోకా లేదు. కాని ఏదో కష్టంలో ఉన్నాడు అని తోస్తోంది, నువ్వు వెంటనే ఇది పోస్టాఫీసులో యిచ్చి రా' అంటూ రాశాడు టెలిగ్రాము మీద

'ఎక్స్‌ప్లయిన్ యువర్ బ్రైడ్ ఆల్‌రెడీ మేరీడ్ స్టఫ్-హేవ్ టు గివ్ ఎ స్పీచ్ ఆన్ ఎథీజమ్ అండ్ ట్వెంటీ పోయింట్ ప్రోగ్రాం టుమారో ఎట్ పటమట.'

## 3

మర్నాడు ప్రొద్దున ఆ గదిలో కోడి కూయగానే సుబ్బారాయుడు ఇంకో టెలిగ్రాం ఉందేమోనని టీపాయ్ కేసి చూశాడు.





టెలిగ్రాం ఏమీ లేదు.

టీపాయ్ ప్రక్కన వున్న 'మోడా' మీద కూర్చొన్న వెంకట్రావు కనపడ్డాడు.

'బావా ఎప్పుడు వచ్చితివి' అనబోయి 'టెలిగ్రాం బదులు టెలిగ్రాం పంపిన వాడినే బట్వాడా చేసినట్లున్నరే. సీ హౌ టెక్నాలజీ ఈజ్ ఎడ్వాన్సింగ్' అన్నాడు శుబ్బారాయుడు ఆశ్చర్యపోతూ.

'త్వరగా లేరా. ఇంకో గంటలో బస్ వుంది. బందర్ వెళ్దాం' అన్నాడు వెంకట్రావు.

'మై డియర్ కామ్రేడ్ నీకు అన్నీ తొందరే. అసలు సంగతి ఏమిటి? ఎప్పుడు వచ్చితివి? మాతాపితలు సౌఖ్యమేనా? కామ్రేడ్ వెంకన్నా రెండు కాఫీలు పట్రా' అని కేకేశాడు శుబ్బారాయుడు.

'అది కాదురా శుబ్బారాయుడూ ఇది జీవన్మరణ సమస్య. నువ్వు వెంటనే బందరు వచ్చి మా నాన్నని ఎలా ఒప్పిస్తావో నాకు తెలీదు. నీ మీద కొండంతా ఆశ పెట్టుకొని వచ్చా' అన్నాడు వెంకట్రావు దిగాలుగా.

ఇంతలో వెంకన్న కాఫీలు తెచ్చాడు.

కాఫీలు పూర్తిచేసిన తర్వాత శుబ్బారాయుడు అన్నాడు: 'రైట్ కామ్రేడ్. ఎట్ యువర్ సర్వీస్. టూకీగా నీ కథ చెప్పు. ముఖ్యంగా 'నీ పెళ్ళి కూతురికి ఇది వరకే పెళ్ళి అవడం' సంగతి నువ్వు చదువుకొనేటప్పుడు నీ రచనా పాటవం గురించి తెలుసుగాని ఇంత ఉత్తేజకరంగా టెలిగ్రాములు యిస్తావని నేనూ వూహించ లేదు ఎప్పుడు. కనుక షూట్'

'అదో పెద్ద కథ' అంటూ వెంకట్రావు మొదలుపెట్టబోయాడు.

'కామ్రేడ్! నాకు సీరియల్స్ చదవడంలో అంతగా అభిరుచి లేదు అని నీకు తెలుసు. క్లుప్తంగా ఒక సంచికతోనే పూర్తయిపోయే కథగా చెప్పు. రావిశాస్త్రిగారు రాస్తారే పొట్టి పిట్ట కథలు అని అలాగ' అన్నాడు శుబ్బారాయుడు విసుగు నటిస్తూ.

'నా పెళ్ళి నిశ్చయమయిందిరా' అన్నాడు వెంకట్రావు.

'అది చాలా పాత న్యూస్'

'వచ్చే నెలలోనే నా పెళ్ళి'.

'ఇది తాజా న్యూస్'.

'నేను అనుకున్న పెళ్ళి కూతురికి ఇదివరకే పెళ్ళి అయింది' అన్నాడు వెంకట్రావు.

'తెలుగు దినపత్రిక వాళ్ళయితే 'శిఖరాగ్ర చర్చలలో ప్రతిష్టంభన' అని హెడ్ లైన్స్ తాటికాయలంత అక్షరాలలో పెట్టేవాళ్ళు ఈ పరిస్థితి చూసి. మళ్ళీ మొదటికే వచ్చాం' అన్నాడు శుబ్బారాయుడు.

'అది కాదురా....'

'వన్ మినిట్. లెటజ్ గెట్ దిస్ స్ట్రయిట్' నీకు పెళ్ళి కుదిరింది. ఎస్ ఆర్ నో

'ఎస్'.

'పెళ్ళి కుదిరింది అంటే పెళ్ళి కూతురు ఒక్కర్తె వుండాలి గదా. ఎస్ ఆర్ నో'.

'ఎస్'

'పెళ్ళికుదిరే ముందు పెళ్ళి చూపుల భాగోతం జరిగింది. ఎస్ ఆర్ నో'

'ఎస్'.

'నువ్వు పెళ్ళి కూతురిని చూశావు అప్పుడు. ఎస్. ఆర్. నో?'

'ఎస్ అండ్ నో' అన్నాడు వెంకట్రావు.

'జవాబు అవును లేక కాదు అవ్వాలి. అవును మరియు కాదు అంటే ఎలా?' అన్నాడు శుబ్బారాయుడి నుదుటి మీద పడిన జుట్టుని వెనక్కి తోసుకొంటూ.

'ఇప్పుడు పెళ్ళి కుదిరిన పెళ్ళికూతురుని చూశాను పెళ్ళిచూపులలో. కాని అప్పుడు ఈ అమ్మాయి పెళ్ళి కూతురు అని అనుకోలేము' అన్నాడు వెంకట్రావ్.

'మాయా శశిరేఖలా ఇంకో అమ్మాయిని కూర్చోబెట్టారా' అని ప్రశ్నించాడు శుబ్బారాయుడు.

'అలాకాదు. ఈ పెళ్ళికూతురు ప్రక్కన కూర్చొన్న

ఇంకో అమ్మాయిని పెళ్ళికూతురు అనుకొని పెళ్ళికి ఒప్పుకొన్నాము!

'ఐసీ! వరకట్న నిషేధంలాగే పెళ్ళిచూపులలో ఒక్కతే అమ్మాయి వుండాలని ప్రభుత్వం చట్టం తేవల్సిన అవసరం కనబడుతోంది. వచ్చే ఎన్నికలలో ఆ 'మేనిఫెస్టో'తో బందరు నుంచి నిలబడు- నా అండ దండలుంటాయి' అన్నాడు శుబ్బారాయుడు. 'తర్వాత తెలిసింది నేను పెళ్ళికూతురు అనుకొన్నా అమ్మాయికి అసలు పెళ్ళికూతురి పెద్దనాన్నగారి అమ్మాయి అని. ఆవిడకి ఇదివరకే పెళ్ళి అయిందనీ' అని ఆగాడు వెంకట్రావ్.

'మై గుడ్‌నెస్ నీ భేతాళ ప్రశ్నకి జవాబు చివరికి దొరికింది. 'మై బ్రైడ్ ఈజ్ ఆల్‌రెడీ మేరీడ్' అంటే అర్థం అదన్న మాట. దట్ కాల్స్ ఫర్ సెలబ్రేషన్' అంటూ వెంకన్నని పిలిచాడు. వెంకన్న రాగానే 'కామ్రేడ్ వెంకన్నా! ఒక బడా పెగ్ ఒక డబుల్ సెవెన్ వెంటనే పట్రా' అన్నాడు శుబ్బారాయుడు. వెంకట్రావ్‌కి త్రాగుడు అలవాటు లేదు కాబట్టి.

'నాకీ పెళ్ళి కూతురు అంటే అస్సలు యిష్టం లేదురా' అన్నాడు వెంకట్రావ్.'

'సర్! హేవ్ యువర్ డబుల్‌సెవెన్. ఛీయర్స్'

'ఛీయర్స్‌లాగే వుంది నా జీవితం' అన్నాడు వెంకట్రావ్ ఒక్క గుక్కలో అంతా తాగేసి.

'ఒకె. కామ్రేడ్. మీ నాన్నకి అలా చెప్పేస్తే సరిపోతుందిగదా' అన్నాడు శుబ్బారాయుడు విస్కీ సిప్‌చేస్తూ.

'లాభంలేదు. తోలు తీస్తాడు. అసలే నేనంటే పెద్ద అభిప్రాయం లేదు. పైగా పెళ్ళిచూపులకు వెళ్ళికూడా పెళ్ళికూతురు ఎవరో కనుక్కోలేదని తెలిస్తే పెదవాల్తేరు పంపిస్తాడు తోడు యిచ్చి మరీ' అన్నాడు వెంకట్రావ్.

శుబ్బారాయుడు ఇంకో సిప్ చేశాడు.

'పైగా మా నాన్న సంగతి తెలుసుకదా నీకు- అగ్గిరావుడు.'

'అవును! నువ్వు చెప్పినట్లే పెళ్ళి చూపులకు వెళ్ళి పెళ్ళికూతురు ఎవరో ఎందుకు కనుక్కోలేకపోయావు' అన్నాడు శుబ్బారాయుడు గ్లాస్ ఖాళీచేసి టీపాయ్‌మీద పెడుతూ.

'అదో పెద్ద కథ' అన్నాడు వెంకట్రావ్

'నీ ఈ 'మేనరిజమ్, మార్చుకోవాలి కామ్రేడ్. ఈ రోజుల్లో అన్నీ 'ఫటాఫట్'గా జరిగిపోవాలి. ఇన్‌స్టెంట్ కాఫీ ఇన్‌స్టెంట్ మిల్క్, ఇన్‌స్టెంట్ ఇడ్లీ, ఆఖరికి మహేష్ యోగిగారి ధర్మమా అని ఇన్‌స్టెంట్ నిర్వాణం. ఇలా ప్రపంచం ప్రగతి సాధిస్తుంటే నువ్వు ప్రతీ చిన్న విషయాన్ని 'పెద్ద కథ' చేసేస్తున్నావ్ కొందరు తెలుగు రచయిత్రీ సోదరీమణుల్లాగ. బిఎ మేన్, కామ్రేడ్. పెద్ద కథలన్నీ 'స్కెచ్'లుగా రాయడం నేర్చుకో. కాబట్టి క్లుప్తంగా నీ కథ చెప్పేయి' అన్నాడు శుబ్బారాయుడు.

'మా పెళ్ళి చూపులు గుడివాడ జంక్షన్‌లో జరిగాయి' అన్నాడు వెంకట్రావ్ కథ మొదలుపెడ్తూ

'అంటే గుడివాడ సంధి రైల్వేస్టేషన్‌లోనా.'

'ఇప్పుడు 'సంధి' అని బోర్డ్‌లో రాయడంలేదు.'

'ఇంక తెలుగు మీడియం అని మన నాయకులంతా అఘోరించడం ఎందుకు వేస్ట్ ఆఫ్ బ్రెత్.

సరే స్టేషన్‌లో పెళ్ళిచూపులు జరిగాయన్నమాట' అన్నాడు శుబ్బారాయుడు కథని ముందుకు గెంటుదామన్న ఉద్దేశంతో

'స్టేషన్‌లో కాదు.'

'ఇప్పుడే అన్నావు కదురా.'

'స్టేషన్‌లో ఆగిన ఫస్ట్ క్లాస్ రైల్వే కంపార్ట్‌మెంట్‌లో' అన్నాడు వెంకట్రావ్.

'ఇప్పటికి 'వెన్యూ' తేల్చాం' అన్నాడు శుబ్బారాయుడు స్థిమితపడి.

'పెళ్ళికూతురు ఆ రోజున విజయవాడ నుంచి కాకినాడ దగ్గర దగ్గుపల్లి అనే వాళ్ళ ఊరికి వెళ్తోంది. తండ్రి పెద్దనాన్న గారి కూతురులతో.'

'కామ్రేడ్! వాచ్ యువర్ తెలుగు. ఇందాక ఆ పెద్ద నాన్నగారి కూతురుఅన్నావు. ఇప్పుడు బహువచనం ఉపయోగిస్తున్నావు' అన్నాడు శుబ్బారాయుడు.

'తండ్రి, పెద్దనాన్నగారి కూతురు, పెళ్ళికూతురు వెళ్తున్నారు.'

'ఊ.'



'ఆ రోజు మంచిదట. వాళ్ళ నాన్నగారు, మా నాన్నగారు బాల్యస్నేహితులు. పెళ్ళిచూపుల తతంగం ఆ రోజే ముగిస్తే ఖాయంపరచవచ్చు అని నన్ను మా నాన్నగారు బందర్ నుంచి తీసికొని వెళ్ళారు. మా నాన్నగారు వాళ్ళందరినీ బందరు రమ్మన్నారు. కాని పిల్లతండ్రి 'అది సంప్రదాయం కాదు' అన్నారట' అని ఆగాడు వెంకట్రావ్

'రైలు పెట్టెలో పెళ్ళి చూపులు ఆ కుటుంబ సంప్రదాయమా' అని ప్రశ్నించాడు సుబ్బారాయుడు.

'ఆ విషయం నాకు తెలియదుకాని సర్కార్ విజయవాడ నుంచి వచ్చిన తర్వాత నన్ను వాళ్ళు కూర్చొన్న ఫస్ట్ క్లాస్ కంపార్ట్ మెంట్ లో కూర్చోబెట్టి మా నాన్నగారు, పెళ్ళికూతురు తండ్రి బయటికి వెళ్ళారు. 'తతంగమంతా కుర్రకారుకి వదిలి వేద్దాం' అని జోక్ వేసి మరీ.'

'అంటే కంపార్ట్ మెంట్ లో నువ్వు. నీ ఎదురుగ్గా ఇద్దరమ్మాయి లున్నారన్నమాట.ఇంకెవరూ లేరా?'

'ఇంకెవరూ లేరు.'

'ఆ యిద్దరు అమ్మాయిలలో పెళ్ళికూతురు ఎవ్వరో నువ్వు కనిపెట్టలేదన్నమాట' అన్నాడు సుబ్బారాయుడు.

'అప్పుడు పెళ్ళికూతురు కిటికీ దగ్గర కూర్చొన్న అమ్మాయి అని అనుకొన్నాను'అన్నాడు వెంకట్రావ్.


'పెళ్ళికూతురు కిటికీ దగ్గరే కూర్చోవాలని నీ సిద్ధాంతమా' అని అడిగాడు సుబ్బారాయుడు.'

'అలాక్కాదు, కిటికీ దగ్గర కూర్చొన్న అమ్మాయి సిగ్గుపడుతూ తల వంచుకొంది. ఆ అమ్మాయి ప్రక్కన కూర్చొన్న అమ్మాయి. అంటే అసలు పెళ్ళికూతురు, ఫేన్ కేసి చూస్తోంది మొహంలో ఏం భావం లేకుండా.'

'క్రామేడ్! చిన్నప్పుడు పెద్ద బాలశిక్ష భట్టీవేశావేమిటి'

'ఏం' అని ప్రశ్నించాడు వెంకట్రావు.

'ఏం లేదూ. అందులో ఉంటాయి కథా సూక్తులు, ధర్మరాజు శాంతమూర్తి హనుమంతుడు నమ్మినబంటు అని. అలాగే పెళ్ళికూతురు సిగ్గుపడుతుంది అని కూడా అందులో వుందేమో అని.'




'అప్పుడు అలా అన్పించిందిరా.'

'పోనీ. పేరడగకపోయావా నువ్వనుకొన్న పెళ్ళికూతురినే.'

'అడుగుదామనుకొని గొంతు సవరించుకొనబోతుంటే కిటికీ అవతలినుంచి ఒక ముసలిది 'బాబూ ధర్మం' అంటూ జోరీగ ధ్వని మొదలుపెట్టింది.

'ఓ పదిపైసలు పడేయలేకపోయావా?'

'ఆ పని నేను చేసే లోపులో కిటికీ దగ్గర కూర్చొన్న అమ్మాయి హేండ్ బేగ్ లోంచి పదిపైసలు ఆ ముసలిదానికి వేసి నాకేసి చూసి నవ్వింది.'

'ఫేన్ అమ్మాయి ఏంచేసింది.'

'ఫేన్ నుంచి తలుపుమీదికి దృష్టి మార్చింది. అయినా నేను ఆ అమ్మాయిని అంతగా పట్టించుకోలేదు.కిటికీ అమ్మాయి నవ్వు నన్ను ముగ్ధుణ్ణి చేసింది.'

'నీ ప్రశ్నమాత్రం నీ నోట్లోనే వుందన్నమాట'

'లేదు. వెంటనే అడిగాను ఆ అమ్మాయి పేరు. కాని అలా అడుగుతుంటే నా కంఠధ్వనిని ఇంకో బొంగురు కంఠం మింగేసింది.'

'ఎవరిదా బొంగురు కంఠం!' అన్నాడు సుబ్బారాయుడు విసుగ్గా కథలో పాత్రలు ఎక్కువయి పోతున్నందుకు.

'ఇందాక ముసలిదాని కొడుకు అనుకుంటాను. ఒక కన్ను లేదు 'బాబూ ధర్మం' అంటూ డీసిల్ ఇంజన్ లా అరవడం మొదలుపెట్టాడు.'

'అంటే ఆవిడ నీ ప్రశ్న వినలేదన్నమాట.'

'ఎలా వింటుంది. సరే! ఈ సారి నేనే పదిపైసలు వాడికి పడేశాను. అప్పుడు కిటికీ అమ్మాయి ఇంకోసారి నాకేసి చూసి నవ్వింది.'

'క్రామేడ్. నీ 'పెద్దకథ' అంతా ఎప్పుడూ నవ్వుతూ ఉండే కిటికీ అమ్మాయి, ఫేన్, తలుపులకేసి చూసే ఇంకో అమ్మాయితప్ప ఇంకేమీ జరగలేదా. సరే సర్కారు పది నిమిషాలు ఆగుతుందికదా అక్కడ. మీ నాన్నగారు వాళ్ళని కలవడం రెండు నిమిషాలు, జోక్ వేసి వాళ్ళిద్దరూ వెళ్ళిపోవడం ఇంకో నిమిషం, ముసలిది, దాని కొడుకులతో మీ సమావేశం ఇంకో రెండు నిమిషాలు, ఇంకో ఐదు నిమిషాలున్నాయికదా, ఇంకేమీ మాట్లాడలేదా' అన్నాడు సుబ్బారాయుడు.

'మాటలు జరిగాయి'.

'అమ్మయ్య. దటీజ్ సమ్‌థింగ్. ఏం ప్రశ్న వేశావు? మళ్ళీ మీ పేరేమిటనా?'

'ప్రశ్నలు అడిగింది నేను కాదు. ఆ తలుపులకేసి చూస్తున్న అమ్మాయి' అన్నాడు వెంకట్రావ్.

'ఏమని అడిగింది?'

'యద్దనపూడి పుస్తకాలంటే మీ కిష్టమా? చంద్రమోహన్ నటన గురించి మీ అభిప్రాయమేమిటి ? చేతబడిలో మీకు నమ్మకముందా ? అంటూ కొన్ని ప్రశ్నలు వేసింది'.

'తర్వాత.'

'ఏముంది అన్నిటికీ జవాబులిచ్చాను. కాని ఈ 'అర

గంది-చెప్పుతా' శీర్షిక జరుగుతుంటే కిటికీ దగ్గర అమ్మాయి మాత్రం తెగ సిగ్గుపడిపోయింది. తలొంచుకొని నవ్వుతూనే ఉంది'.

'ఆ తలుపుల అమ్మాయి పెళ్ళి కూతురన్న అనుమానం రాలేదా నీకు.'

'పెళ్ళి కూతురికి సిగ్గేమో! వాళ్ళ అక్కయ్య అన్నీ అడుగుతోంది అనుకున్నా. పైగా 'సూర్యకాంతం'లా సూటి ప్రశ్నలు ఝమాయించి వేస్తుంటే పెళ్ళి కూతురు అనుకోవ డానికి ఆస్కారమేముంది.'

'సరే! తర్వాత.'

'తర్వాత ఇంకేముంది? ఇంతలో పెద్ద వాళ్ళు తిరిగి వచ్చారు కిళ్ళీలు నములుతూ. రైలు వెళ్తుంటే ఆ కిటికీ అమ్మాయి చెయ్యి ఊపింది.'

'తర్వాత మీ నాన్నగారు నీ అభిప్రాయం లాంఛనం కోసం అడిగితే నచ్చింది అన్నావన్న మాట.'

'పై వారంలో మా నాన్నగారు, అమ్మగారు వాళ్ళింటికి వెళ్ళి తాంబూలాలు పుచ్చుకొన్నారు.'

'అవును కాని, ఆ కిటికీ అమ్మాయి మెడలో నల్లపూస లయినా చూడలేదా నువ్వు.'

'చలికాలం కదా. మెడ మీదుగా చీర కొంగు కప్పు కుంది.'

'ఓ. కె అసలు పెళ్ళి కూతురు విషయం నీకు ఎప్పుడు తెలిసింది.'

'తాంబూలాలు అయిన తర్వాత నా పేరన ఉత్తరం రాసింది. నా సౌమ్యత ఆమెని ఆకర్షించిందిట. వాళ్ళక్కయ్య అంటే కిటికీ అమ్మాయి తర్వాత అందిట. 'పెళ్ళి కొడుకు వినయం చూసి నవ్వొచ్చింది'అని. తన ఫొటో కూడా పంపింది ఆ ఉత్తరంతో'

'కిటికీ అమ్మాయి నవ్వు 'మిస్టరీ' కూడా విడిపోయిం దన్నమాట. సరే! ఎలాగయితేనేం ఈ అమ్మాయి నిన్ను యిష్ట పడింది గదా. పెళ్ళి చేసుకుంటే పోలా' అన్నాడు శుబ్బా రాయుడు.

'అది కాదురా 'సూర్యకాంతం'లా మాట్లాడింది అని ఇందాక చెప్పాను కదా. సూర్యకాంతం చిన్నప్పుడు ఎలా ఉండేదో నాకు తెలియదు కాని, ఈవిడ 'మాయాబజారు'లో సూర్యకాంతం వేసిన వేషంలా ఉంటుంది. నీకు తెలుసుగదా నాకు సన్నటి అమ్మాయిలే యిష్టమని. ఈ పెళ్ళి తప్పేటట్లు చెయ్యరా. ప్లీజ్' అంటూ వెంకట్రావు కళ్ళ నీళ్ళు పెట్టు కున్నాడు.

శుబ్బారాయుడు మంచం మీంచి లేచి గదిలో పచార్లు చేస్తూ అన్నాడు:

'హంతకుడు తెలివైనవాడు.'

వెంకట్రావు అర్థం కానట్లు చూశాడు.

'హంతకుడు తెలివైనవాడు' అన్నాడు మళ్ళీ శుబ్బా రాయుడు-వెంకట్రావు సరిగ్గా వినలేదేమో అని.

'నీకు అంతా వేళాకోళంగా వుందిరా' అన్నాడు వెంక ట్రావు బాధగా.

'కామ్రేడ్. నువ్వు నన్ను పూర్తిగా అపార్థం చేసు కున్నావు. ఇప్పుడు నా మెదడంతా నీ సమస్యతోనే నిండి పోయింది. ఇందాకా ఇది నీ జీవన్మరణ సమస్య అన్నావు. అంటే ఈ పెళ్ళి అయితే నువ్వు ఛస్తావ్ అనే అర్థం కదా. ఒక వేళ అలా జరిగితే అది ఒక విధంగా హత్యే కదా. హత్య అయితే హంతకుడు వుండాలి కదా. అయినా నువ్వు తెలుగు డిటెక్టివ్ నవలలు ఏమీ చదవలేదా?'

'ఇదివరకు కొన్ని చదివాను' అన్నాడు వెంకట్రావు.

'రైట్. ప్రఖ్యాత డిటెక్టివ్ లంతా ఆ నవలల్లో హత్య జరిగిన తర్వాత వివరాలన్నీ సేకరించి పతాక సన్నివేశంలో హంతకుడు ఎవరో చెప్పేటప్పుడు ఉపన్యాసం ఇస్తారు కదా. ఆ ఉపన్యాసంలో మొదటి వాక్యం ఏమిటి?'

వెంకట్రావు జవాబు ఇవ్వలేదు.

'మొదటి వాక్యం హంతకుడు తెలివైనవాడు అని. హంతకుడు తెలివైనవాడు అవ్వాలి. వాణ్ణి కనుక్కోలేనందుకు ఈ డిటెక్టివ్ శాల్తీ తను ఇంకా తెలివైనవాడు అని అర్థం స్ఫురింపచేస్తాడన్న మాట. అలా కాకపోతే కేవలం హంత కుడు 'హత్య చెయ్యటం ఎలా' అనే అంశం మీద కరస్పాం డెన్స్ కోర్స్ మాత్రం తీసుకుని హత్య చేశాడన్న మాట. అప్పుడు డిటెక్టివ్ గొప్పతనం ఏముంటుంది? ఎనీ వే లెట్ ఇట్ గో. ఏదో 'ఎఫెక్ట్'కి అలా మొదలుపెట్టాను. ఇప్పుడు నీ సమస్య ఆలోచిస్తే స్థూలంగా రెండే మార్గాలున్నాయి. అందులో మొదటిది....' అని ఆగాడు శుబ్బారాయుడు.


సిగరెట్టు వెలిగించి పొగ బయటకు వదిలి దానికేసే చూస్తున్నాడు.

వెంకట్రావు ఆశగా చూస్తున్నాడు.

పొగవైపు కాదు, శుబ్బారాయుడి మొఖం కేసి చూసి.

'మొదటిది-నువ్వు అసలు పెళ్ళి కూతురిని పెళ్ళాడే యడం.'

'నీ మొహంలా వుంది' అన్నాడు వెంకట్రావు



విసుగ్గా.

'అంటే ఆ మార్గం సమంజసం అంటావు' అన్నాడు సుబ్బారాయుడు నిలువటద్దంలో ప్రతిబింబం చూసుకుంటూ.

'నువ్వందగాడివే అని ఒప్పుకొంటాగాని ఆ రెండో మార్గమేమిటో చెప్పరా నాయనా' అన్నాడు వెంకట్రావు.

'ఈ రెండో మార్గానికి మూడు ప్రక్కతోవలున్నాయి. రెండు (ఎ) మీ నాన్న....'

'అది క్లోజ్డ్ ఫర్ ట్రాఫిక్.లాభం లేదు.'

'సరే. రెండు (బి). పెళ్ళి కూతురు. ఆవిడకు ముఖాముఖినో, పత్ర రూపంలోనో అసలు సంగతి తెల్లియచేయడం. ముఖాముఖినయితే చుట్టు ప్రక్కల ఎవరూ లేకుండా చూసి ఎంత హిడింబి కాళ్ళయినా ఒకసారి పట్టుకుంటే ఫరవాలేదు. మన పూర్వీకులు చాలా మంది చేశారు క్లిష్ట పరిస్థితుల్లో అలా. ఈవెన్ డాంకీస్ లెగ్స్.'

'లేదురా. అదీ లాభం లేదు. వాళ్ళ నాన్నగారంటే ఆవిడకు ఎంతో గురి ఆయన ఏం చెప్పితే అది చేస్తుంది. ఆయన ఈ పెళ్ళి నిశ్చయించారు కాబట్టి జవదాటదు.




'మరి నీ సౌమ్యత ఆవిడని ఆకర్షించిందని రాసింది అని చెప్పావుకదా!'

'అందులో ఏముంది.అమ్మాయిల సంగతి నీకు తెలుసు కదా. తమదే పై చెయ్యి అంటారు.

'కామ్రేడ్. ఐ ఆమ్ నాట్ సో ష్యూర్ ఎబౌట్ దట్. ఇంక రెండు (సి). మీ మామగారు....'

'ఆయన మా నాన్న బాల్య స్నేహితుడు అని చెప్పాను గదా. మా నాన్నతో చెప్తాడు. మళ్ళా రెండు (ఎ)కి వస్తాం. లాభం లేదు' అన్నాడు వెంకట్రావు ఆ ప్రతిపాదనని కూడ 'వీటో' చేస్తూ.

'రైట్. అలా అయితే రహస్య మార్గాలు ఏమయినా వున్నాయేమో చూడాలి' అన్నాడు సుబ్బారాయుడు మంచం మీద తిరిగి కూర్చొంటూ.

'మీ కాబోయే మామగారిది దగ్గుపల్లి అన్నావు కదూ.'

'ఊ' అన్నాడు వెంకట్రావు.

'గుడ్డిలో మెల్ల. ఆ వూళ్ళో నా కజిన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ లో డాక్టరు. అక్కడ బిచాణా వేద్దాం కొన్ని రోజులు.'

'వేసి....'

'వేద్దాం. అండ్ లెటజ్ హోప్ ఫర్ ది బెస్ట్.'

'దానివల్ల ఏమయినా ఉపయోగం వుంటుందిఅంటావా?' అని అడిగాడు వెంకట్రావు.

'అంతకన్నా వేరే మార్గం లేదు నీ సమస్యకి. రేపు ప్రొద్దున్న పద్మార్ లో నేను బయలుదేరుతాను. ఇవ్వాళ సాయంత్రం పటమటలో నా స్పీచ్ ముగించుకుని, గుడివాడ సంధిలో నన్ను కలుసుకో, ఆ ముసలిదాన్ని, దాని కొడుకుని చూసే సదవకాశం కూడాను. ఒకవేళ పెళ్ళి జరిగితే ఎలాగూ శెలవు పెట్టాలి కాబట్టి, ఇప్పుడే ఒక నెల పెట్టేయి. మీ నాన్నగారికి మాత్రం ఆఫీస్ పనిమీద కాకినాడ వెళ్తున్నానని చెప్పు' అన్నాడు సుబ్బారాయుడు.

'ఓ.కె.' అన్నాడు వెంకట్రావు.

'ఇంకో విషయం.'

'ఏమిటి' అన్నాడు వెంకట్రావు.

'క్రితం వారంలో మద్రాస్ రేస్ కోర్స్‌లో కొన్ని భేదాభిప్రాయాలు వచ్చాయి.'

'ఎవరికి?'

'నాకు, నేను పందెం కాసినగుర్రానికి. నా అభిప్రాయం ప్రకారం ఆ గుర్రం ఫొటో మర్నాడు పేపర్లో రావాలి. 'కోల్డ్ ట్రయిల్స్ విన్నర్' అని పందమీటర్లు పరిగెత్తిన తర్వాత పేపర్ లో ఫొటో పడడం యిష్టంలేదు కాబోసు అక్కడే చతికిలబడింది-క్లుప్తంగా చెప్పాలంటే ఈ తతంగానికి ముఖ్య కోశాధికారి నువ్వే' అన్నాడు సుబ్బారాయుడు.

'డబ్బు లెక్కేమిటిరా నువ్వుకనుక ఈ పెళ్ళి తప్పిస్తే చచ్చి నీ కడుపున పుడతా' అన్నాడు వెంకట్రావ్ ఆవేశంగా.

'నో! కామ్రేడ్! అంతపని చెయ్యకు. అందులో రెండు నష్టాలున్నాయి. ఒకటి నువ్వు ఛస్తావు కాబట్టి. అదీ వేరే పెళ్ళి

చేసుకొని మరీ- ఒక యంగ్ విడో. రెండు, జీవితాంతం బ్రహ్మ చారిగా ఉందామనుకొంటున్నా. నీకు పిల్లలు, లీగల్‌గా ఐ మీన్, పుట్టాలంటే నీకో వైఫ్. ప్లీజ్ డోంట్ డూ ఇట్.'

'సరేలేరా రేపు గుడివాడలో కలుసుకొందాం.' అని వెంకట్రావు వెళ్ళాడు.

'కామ్రేడ్ వెంకన్నా' అని పిలిచాడు శుబ్బారాయుడు.

'అయ్యా స్నానానికి నీళ్ళు కాగేయండి.'

'అదలా వుంచు నీ మనస్సు తాజాగా వుందా ఇవ్వాళ' అని కుశల ప్రశ్న వేశాడు శుబ్బారాయుడు.

'ఇవ్వాళ గుడ్లు కొనలేదు బాబూ' అన్నాడు వెంకన్న.

'కోడిగుడ్ల పరిశ్రమోద్ధరణ గురించి తర్వాత మాట్లాడదాం, జాగ్రత్తగా విను.మాటవరసకి నాకు నువ్వంటే యిష్టం. కానీ నీకు నేనంటే యిష్టం లేదు. నీకు నేను నిన్నంటే యిష్టపడడం కూడా ఇష్టం లేదు. ఏం చేస్తావు నువ్వు అప్పుడు.'

'మీ కిష్టంలేని పనులు చేస్తానండి' అన్నాడు వెంకన్న వినయంగా.

శుబ్బారాయుడు సంభ్రమాశ్చర్యాలతో వెంకన్నకేసి చూస్తూ అన్నాడు.

'కామ్రేడ్ వెంకన్నా!యూ ఆర్ ఎ జీనియస్.'

'మీరేటి అంటున్నారో అర్థమవ్వడం లేదండీ' అన్నాడు వెంకన్న.

'ఏం లేదుకాని రేపటి నుంచి రెండు మూడు వారాలు ఇక్కడ ఉండను. కావలిస్తే నువ్వు మీ వూరికి వెళ్ళిరా. ఈ ఏభయి రూపాయలు దగ్గరుంచుకో దారి ఖర్చులకి' అంటూ పర్సు తీసి డబ్బు యిచ్చాడు వెంకన్నకి.

'కొండపల్లి వెళ్ళి రావడానికి ఇంత డబ్బెందుకు బాబూ' అంటూ డబ్బు తీసుకొన్నాడు వెంకన్న నవ్వుతూ.

శుబ్బారాయుడు స్నానం చేస్తూ స్వగతంగా అనుకొంటున్నాడు.

'యస్. యు ఆర్ రైట్ కామ్రేడ్ వెంకన్నా. దట్ షుడ్ బి ది స్ట్రాటజీ'.

## 4

పూర్వం అంటే రెండు దశాబ్దాల క్రితం, సామర్లకోట నుంచి మద్రాస్ ప్రయాణం చెయ్యాలంటే హౌరా-మద్రాస్ మెయిల్ ఒక్కటే ముఖ్యమయిన రైలు.

కాకినాడనుంచి మద్రాస్ రావాలంటే ఒక బోగీ కాకినాడ నుంచి బయలుదేరి సామర్లకోటలో మద్రాస్ మెయిల్‌కి తగిలించేవాళ్ళు.

ఆ బోగీలో రిజర్వేషన్లు లాటివేమీ వుండేవి కాదు సగం ఫస్ట్ క్లాస్.

మిగతా సగం 'ఆవడి కాంగ్రెస్' తీర్మానానికి అనుగుణంగా సోషలిస్టిక్ పేటర్న్‌కి వదిలేసేవారు.

అంటే ఆ బోగీలో ఎక్కుదామనుకొన్న అప్పటి మూడవ తరగతి ప్రయాణికులందరికీ సమాన అవకాశం కలిగించేవారు.

అది కాకినాడ పోర్ట్ స్టేషన్‌లో ప్లాట్‌ఫారమ్ మీదికి వచ్చినపుడు ఎవరి శక్తికొలదీ వాళ్ళు గుమ్మాల ద్వారా, కిటికీల ద్వారా లోపలికి ఎక్కేవాళ్ళు.

దరిమిలాను గుడివాడ-భీమవరం బ్రాడ్‌గేజ్ చేసిన తర్వాత సర్కార్ ఎక్స్‌ప్రెస్ వేశారు.

విడదవోలు- భీమవరం-గుడివాడ-విజయవాడ లైనులో వేసిన ప్రథమ ఎక్స్‌ప్రెస్ ట్రెయిన్ అది.

అందుచేత ఆ రోజుల్లో సర్కార్ అంటే అందరికి భయభక్తులుండేవి.

'సర్కార్ ఎక్స్‌ప్రెస్' పేరుతో సినిమా కూడా తీశారు. తర్వాత తర్వాత చాలా ఎక్స్‌ప్రెస్‌లు వేశారు.

ప్రివీ పర్సులు, టైటిల్స్ పోయిన మహారాజులులాగ సర్కార్ ఎక్స్‌ప్రెస్ కూడా 'గతమెంతో ఘనకీర్తి కలవాడ'లా మారిపోయింది.

మద్రాస్ సెంట్రల్ నుంచి బీచ్ స్టేషన్‌కి నెట్టేశారు సర్కార్‌ని.

ఈ మధ్యనే సెంట్రల్ స్టేషన్ విస్తరణ ధర్మమా అని మళ్ళీ సెంట్రల్ స్టేషన్ నుంచే బయలుదేరుతోంది.


ఇంకో విశేషం ఏమిటంటే ఇప్పుడు సర్కార్‌కి అన్ని రకాల ఇంజన్లు తగిలిస్తున్నారు.

మద్రాస్ నుంచి తెనాలిదాకా ఎలక్ట్రిక్ ఇంజన్, తెనాలి నుంచి రాజమండ్రి దాకా డీసెల్ ఇంజన్, రాజమండ్రి నుంచి కాకినాడ దాకా స్టీమ్ ఇంజన్. భారత దేశంలో బహుశా సర్కార్ ఎక్స్‌ప్రెస్‌కి మాత్రమే ఇటువంటి ప్రత్యేకత ఉందేమో. మద్రాస్‌లో రైల్వే వాళ్ళు అరవ్వాళ్ళు కాబట్టి సర్కార్ అంటే చిన్నచూపు చూస్తున్నారనుకొంటే, ఆఖరికి విజయవాడ వచ్చిన సర్కార్ అంటే మనవాళ్ళకి చిన్నచూపే.

'ఔటర్'లో అరగంట నిలబెట్టేస్తారు.

ఇక విజయవాడ ప్లాట్‌ఫారమ్ మీదకి వచ్చిన తర్వాత సర్కార్ విజయవాడ ఎప్పుడు వదులుతుంది అన్నది భేతాళ ప్రశ్నే.

సర్కార్ రాగానే మాత్రం 'ఎనౌన్సర్' 'అరె!





మొత్తంమీద వచ్చేసిందే' అన్న ఆశ్చర్యంతో మూడు భాషల లోనూ ఆ రైలు వచ్చింది అని చెప్తుంది.

అప్పటి నుంచి సర్కార్ ప్లాట్‌ఫారమ్ మీద ఉండడం 'తద్ధర్మకాలం' కి ఉదాహరణ అవుతుంది.

మీకు తెలుగు వ్యాకరణం బాగా తెలియకపోతే 'సూర్యుడు తూర్పున ఉదయించును', 'ఆకాశము నీలంగా వుండును' 'మొగ్గలు పుష్పాలు అవుతాయి' ఇలాటివి తద్ధర్మకాలంకి ఉదాహరణలు.

'ఇంక్వయిరీ'లో సర్కార్ వెళ్ళిందా అని ఎనిమిది గంటలకి అడిగితే మీ అమాయకత్వానికి నవ్వుకొని' ఏదో ప్లాట్‌ఫారమ్ మీద ఉండే ఉంటుంది చూడండి' అన్న జవాబు వస్తుంది.

ఒక్కొక్కసారి సర్కార్‌ని విజయవాడకు తీసికొని వచ్చిన ఇంజన్‌కి 'మెకానికల్ ప్రాబ్లమ్స్' వస్తాయి.

'లోకోషెడ్'లో వున్న స్పేర్ ఇంజన్స్ మంచీ చెడ్డలు తూచి 'ఫరవాలేదు గురూ! రాజమండ్రి దాకా లాగేస్తుంది' అని నాణ్యంచేసి ఇంకో ఇంజన్ వేస్తారు దానికి.

'మళ్ళీ అందరూ మనసు మార్చుకొంటారేమో' అనే భయంతో అనౌన్సర్ "సర్కార్ వెళ్ళుటకు సిద్ధముగ వున్నది" అని మైక్‌లో చెప్తుంది.

తర్వాత ఇంకో అరగంటకి సర్కార్ బయలుదేరుతుంది విజయవాడ నుంచి.

శుబ్బారాయుడు ఆ రోజు ఎనిమిది గంటలకి స్టేషన్ కొచ్చాడు.

'ఎంక్వయిరీ'లో అడగకుండా తిన్నగా ప్లాట్‌ఫారమ్ మీదకి వచ్చాడు- సూట్‌కేస్ తనే మోస్తూ.

ఆ ప్లాట్‌ఫారమ్ మీద గూడ్స్ బండి వుంది.

పోర్టర్‌ని పిలిచి 'కామ్రేడ్! సర్కార్ వెళ్ళిపోయిందే మిటీ బై ఛాన్స్' అన్నాడు.

'లేదండీ. ఇంకా రావాలి' అని భరోసా యిచ్చాడు పోర్టర్.

శుబ్బారాయుడి అదృష్టవశాత్తు ఇంకో పదిహేను నిమిషాలలో సర్కార్ వచ్చింది.

ఫస్ట్ క్లాస్ కంపార్ట్‌మెంట్ అంతా ఖాళీగా వుంది.

ఎక్కికూర్చొని అరగంట కాలేదు ట్రెయిన్ బయలుదేరింది.

'వాట్; ఎయిత్ వండర్ ఆఫ్ ది వరల్డ్' అనుకున్నాడు.

అయినా కొత్త అనుమానం తగిలింది. పొరపాటున ఇంకో రైలు ఎక్కేనేమో అని.

కాని ఇంకో పది నిమిషాలలో 'సత్యనారాయణపురం' బోర్డ్ చూసి ఇది సర్కారే అని నిర్ధారణ చేసుకున్నాడు.

సరిగ్గా గంటలో గుడివాడ చేరింది సర్కార్.

వెంకట్రావ్‌ని చూస్తూ అన్నాడు 'కామ్రేడ్! శకునాలన్నీ బాగున్నాయి. బెజవాడలో కేవలం అరగంట మాత్రం ఆగింది సర్కార్. ఛీర్ అప్'.

ఇంకో పది నిమిషాలలో ట్రెయిన్ గుడివాడ వదిలింది.

'ఇంకో శుభ శకునం కామ్రేడ్. గుడివాడ స్టేషన్‌లో ఏ ముసలి బిచ్చగత్తె, దాని కొడుకుకూడా తగల్లేదు మనకు' అన్నాడు శుబ్బారాయుడు.

వెంకట్రావ్ నవ్వి ఊరుకున్నాడు.

ఇంతలో పుస్తకాలమ్మే కుర్రాడు పెద్ద పుస్తకాల కట్ట చంకలో పెట్టుకొని వీళ్ళ కంపార్ట్‌మెంట్‌లోకి వచ్చాడు.

శుబ్బారాయుడి చెవిలో మెల్లగా అన్నాడు.

'సెక్స్ పుస్తకాలు కావాలా గురువుగారూ'?

'రాంగ్ నంబర్' అన్నాడు శుబ్బారాయుడు.

'ఆ పుస్తకం లేదండీ, కాని మధు సాహిత్యం....'

'నో! నో! కామ్రేడ్! అలాటి పుస్తకాలక్కర్లేదు మాకు' అన్నాడు శుబ్బారాయుడు.

'పోనీ! శవ సాహిత్యం వుంది చూస్తారా, పూలబుట్టలో శవం, గుళ్ళులేని పిస్తోలు, ప్రాణంవున్న శవం....'

'డిస్కనెట్ చేసేయ్' అన్నాడు శుబ్బారాయుడు.

ఆ కుర్రాడికి ఓరిమి తగ్గింది.

'ఇంకేం చదువుతారు మీరు. చూడ్డానికి హుషారయిన కుర్రవాళ్ళలా ఉన్నారు' అన్నాడు నిష్ఠురంగా ఆ కుర్రాడు.

సుబ్బారాయుడు నవ్వి ఊరుకున్నాడు.

'లేనీ వ్రత పుస్తకాలున్నాయి. వరలక్ష్మీవ్రతం, వినాయక వ్రతకల్పం, ఐదోతనానికి ఐదు వ్రతాలు .... ఇంకా అనంత పద్మనాభస్వామి దండకం.... ప్రసన్నాంజనేయం' అంటూ ఆఖరిరాయి విసిరాడు ఆ అబ్బాయి.

సుబ్బారాయుడు తొణకలేదు.

'రామకోటి రాసుకుందుకు పుస్తకాలుకూడా వున్నాయి'.

'కామ్రేడ్, దేముడికి నాకు చాల దూరం'.

ఆ కుర్రాడు విరాళగా వెళ్ళబోతుంటే సుబ్బారాయుడు ఆపాడు. కట్టలో పై పుస్తకం చూపి.

'అదేమిటి' అన్నాడు సుబ్బారాయుడు.

'కుక్కుటశాస్త్రం' అన్నాడు కుర్రాడు నువ్వేం కొంటావులే అనే భావంతో.

'అది యివ్వు' అన్నాడు సుబ్బారాయుడు.

కుర్రాడు డబ్బు తీసికొని వెళ్ళిన తర్వాత వెంకట్రావ్ నవ్వుతూ అన్నాడు.

'ఏరా! పెద్ద శ్రీరంగనీతులు చెప్పి చివరకు అలాటి పుస్తకమే కొన్నావు'.

కామ్రేడ్! నన్ను అపార్థం చేసుకొన్నావు. బహుశా ఇది 'కొక్కోకశాస్త్రం' అనుకొని ఉంటావు. నో! యిది 'కుక్కుటశాస్త్రం' అచ్చ తెలుగులో చెప్పాలంటే కోళ్ళగురించి అన్నమాట' అని విశదీకరించాడు సుబ్బారాయుడు.

'అది నీ కెందుకురా....'

'చెప్పలేం కామ్రేడ్. ఏది ఎప్పుడు ఎలా ఉపయోగిస్తుందో. అగ్గిపిల్ల, కుక్కపిల్ల, సబ్బుబిళ్ళ కవితా వస్తువులు అయినపుడు కోడిపుంజు కావ్య వస్తువు కాకూడదా' అన్నాడు సుబ్బారాయుడు పుస్తకం చదవడానికి ఉపక్రమిస్తూ.

సుబ్బారాయుడిని ఇంకోసారి ఆశ్చర్య పరుస్తూ ఆ రోజు సర్కార్ కాకినాడ రైట్ టయిమ్‌కి చేరింది.

రైలు దిగి బస్ స్టాండ్‌కి రిక్షాలో వెళ్ళారు.

కాకినాడ నుంచి దగ్గువల్లి వెళ్ళాలంటే బస్సులు వున్నాయి. ఆర్. టి. సి. రూట్ కాదు అది. ప్రయివేట్ బస్సులు.

ప్రతి మూడు గంటలకి ఒక బస్సు వుంటుంది.

కాని తెలుగు వ్యాకరణం సంధి సూత్రాల పరిభాషలో చెప్పాలంటే బస్ ప్రతి మూడు గంటలకు వుంటుంది అన్నది వైకల్పికం.

ఉండొచ్చు. ఉండక పోవచ్చు.

ఆ ఊరు కరణంగారు కాని, మునసబుగారు కాని కాకినాడ నుంచి ఆ బస్‌లో వెళ్తే ఆరు గంటల బస్ నాలుగుగంటలకే వెళ్ళిపోవచ్చు.

జనం ఎక్కువ లేకపోతే ఆరు గంటల బస్ మొదటి ఆట అయిన తర్వాత వెళ్ళొచ్చు.

'దగ్గువల్లి బస్ చూశారా' అని ఎవరయినా అడిగితే రకరకాల జవాబులు వినబడతాయి.

'దగ్గువల్లికి బస్ ఉందా?'

'ఈ మధ్యన సర్వీస్ మానేశారని విన్నా.'

'మసీదు దగ్గర రిపేర్ చేస్తుంటే చూశాను రెండు గంటల క్రితం.'

'ప్రొద్దున ఆ బస్‌లోనే వచ్చాను. మళ్ళా పత్తాలేదు నాయాల.'

ఇలాంటివి ఎన్నో జవాబులు వినొచ్చు.

కాకినాడ నుంచి దగ్గువల్లి ఇరవఝు మైళ్ళు.

అందులో ఎనిమిది మైళ్ళు తారు రోడ్డే. కోటిపల్లిరోడ్ మీద.

తర్వాత ప్రక్క రోడ్డులో వెళ్ళాలి.

ఆ ప్రక్క రోడ్డు వేసింది పూర్వకాలంలో ఎడ్లబళ్ళకి. ఇప్పటికీ ఎడ్లబళ్ళు మాత్రమే వెళ్ళగలిగే రోడ్డు అది. కాని ఆ ఊళ్ళో జిల్లా రాజకీయ అతిరథులున్నారు. బస్ సర్వీస్ వేయించారు.

ఒకవేళ మీ అదృష్టవశాత్తూ ఆ బస్ దొరికితే ఆ బస్‌లో రాయబడిన మూడు నినాదాలు చూస్తారు. ['హరేరామ శ్రీలు హరేకృష్ణ' కాకుండా].

'పొగత్రాగరాదు.'

'టికెట్ లేనిదే బస్ ఎక్కరాదు.'

'దేముని స్మరింపుము.'

మొదటి రెండింటిని గురించి మీరు పట్టించుకో అక్కర్లేదు. 'పొగత్రాగరాదు'ని 'పొగత్రాగ రాదూ'గా అర్థం చేసుకొని చుట్టలు వెలిగించేస్తారు ప్రయాణీకులు-ఆడవాళ్ళతో సహా.

'బస్ ఎక్కాం కాబట్టి టికెట్ ఉందనే అనుకోవాలి.' అనుకొని కొందరు ప్రయాణీకులు టికెట్ కొనడాన్ని కండక్టర్ దగ్గరకి వచ్చి కసిరే వరకూ వాయిదా వేస్తారు. కాని మూడో విధానంలో ఎంతయినా నిజం వుంది. ఆ బస్‌లో ప్రయాణం చెయ్యాలంటేనూ, ఊరు చేరాలంటేనూ, దేవుడంటే



నమ్మకం లేని వారు కూడా ఆ బస్‌లో ప్రయాణం చేసేసరికి ఒక్కసారయినా [ఏదో విధంగా] స్మరించకుండా వుండలేరు.

ఆ బస్‌లో ప్రయాణం మీ ఆరోగ్య పరిస్థితి బట్టి వివిధ రకాలుగా మీ మీద ప్రభావం చూపిస్తుంది.

బస్ ఎక్కే ముందర ఒళ్ళు నొప్పులు లేని వాళ్ళకి దిగే టప్పటికి 'ఆస్ప్రో కమర్షియల్'లో మొదటి సీను గుర్తుకు వస్తుంది.

బస్ ఎక్కే ముందర ఒళ్ళు నొప్పులు వున్న వాళ్ళకి ప్రయాణం అయ్యేసరికి అదే 'ఆస్ప్రో కమర్షియల్'లో ఆఖరి సీనులాగ ఇంటికి గెంతుతూ వెళ్ళిపోవడానికి అస్కారం వుంది.

సుబ్బారాయుడు, వెంకట్రావు మూడు గంటల బస్‌లో మూడు గంటలకే ఎక్కారు.

సీట్లలో మొదటి నాలుగు వరుసలు 'హరేరామ స్త్రీలు' సుబ్బారాయుడు, వెంకట్రావ్ 'హరేకృష్ణ' సీట్లు అంటే ఆడ వాళ్ళ సీట్ల ఆఖరి వరుస వెనుక సీట్లో కూర్చొన్నారు.

వెంకట్రావ్ కిటికీ దగ్గరగా, సుబ్బారాయుడు అతని ప్రక్కన కూర్చొన్నారు.

వెంకట్రావ్ కూర్చొన్న సీట్ ముందర సీట్‌లో ఒక పద్దెనిమిది ఏళ్ళ అమ్మాయి కూర్చొని వుంది. ఎర్రచీర, ఎర్ర జాకెట్, జడలో బంతిపువ్వు. కాటుక కళ్ళు, ముక్కుపుడక, చామనచాయ రంగు, ఆరోగ్యవంతమైన శరీరం.

'రస్టిక్ రూరల్ బ్యూటీ' అనుకున్నాడు సుబ్బారాయుడు ఆ అమ్మాయిని చూసి.


ఇంతలో కండక్టర్ వచ్చాడు.

'రెండు దగ్గుపల్లి' అని సుబ్బారాయుడు వెంకట్రావ్ పర్స్‌లోంచి డబ్బు యిచ్చాడు.

'రూరల్ బ్యూటీ' వెనక్కి తిరిగి సుబ్బారాయుడి కేసి చూసి నవ్వింది.

బస్ బయలుదేరింది. ఇంకో పది నిమిషాలలో తారు రోడ్డు మీద తాపీగా సాగిపోయింది.

'రూరల్ బ్యూటీ' రెండు మూడుసార్లు సుబ్బారాయుడి



కేసి వెనక్కి తిరగడం తప్పిస్తే చెప్పుకో దగ్గ విశేషాలు ఏమీ జరగలేదు.

సుబ్బారాయుడు దగ్గుపల్లికి ఇదివరలో ఓ సారి వెళ్ళాడు. వెంకట్రావ్ సుబ్బారాయుడి కేసి చూశాడు.

సుబ్బారాయుడు చేతులు, కళ్ళు లయబద్ధంగా కదుపు తున్నాడు.

'ఏరా : ఏమయింది' అని అడిగాడు వెంకట్రావ్.

'ఇంకో పది నిమిషాలలో ప్రక్క రోడ్డుకి తిరుగుతాం'.

'తిరిగితే.........!'

'అక్కడ నుంచి ప్రయాణం రంజులోకి వస్తుంది. అన్నట్లు నీ చొక్కా జేబులో చిల్లరకాని, తాళం చెవుల గుత్తి కాని ఉంచకు, గాగుల్స్ చేత్తో పట్టుకో. కాస్త 'లింబ్స్' ని 'లూజెన్' చేసుకో మంచిది' అన్నాడు సుబ్బారాయుడు హెచ్చ రిస్తూ.

'బస్‌లో మిగతావాళ్ళు మామూలుగానే వున్నారు కదా!

'కామ్రేడ్! వాళ్ళు సన్స్ అండ్ డాటర్స్ ఆఫ్ ది సోయిల్. వాళ్ళకీ నీకూ సాపత్యమేమిటి! ఈ బస్ కనుక దారిలో చెడిందంటే ఝూంమ్మని ఎడ్లబండో, దొరక్కపోతే నడక మీదో, 'పల్లెసీమే స్వర్గసీమ' అంటూ పాడుకుంటూ పోతారు!' అన్నాడు సుబ్బారాయుడు. 'రూరల్ బ్యూటీ' వెనక్కి తిరిగి సుబ్బారాయుడి కేసి చూస్తూ అడిగింది.'డాటర్ గారింటికి వెళ్తున్నారా' అని. ఆ అమ్మాయి సునిశిత పరిజ్ఞానానికి జోహా ర్లర్పించేడు సుబ్బారాయుడు మనసులో.

అవునన్నట్లుగా తల ఊపాడు.

ఇంతలో బస్ ప్రక్కరోడ్, అంటే దగ్గుపల్లి రోడ్‌కి మళ్ళింది.

'రూరల్ బ్యూటీ' కి విజ్ఞాన తృష్ణ ఎక్కువలా వుంది. అందుకే అడిగింది మళ్ళీ సుబ్బారాయుడిని 'ఏ డాక్టర్ గారు' దగ్గుపల్లిలో ముగ్గురు డాక్టర్లున్నారని సుబ్బారాయుడికి తెలుసు.

ఒకాయన పశువుల డాక్టర్.

ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో ఇద్దరు డాక్టర్లు.

అందులో ఫామిలీ ప్లానింగ్ ఇన్‌చార్జి ఒకరు- అతనే సుబ్బారాయుడి కజిన్.

కాని ఆ ఊళ్ళో ఇద్దరు డాక్టర్లకి వేరే పేర్లున్నాయి. సుబ్బా రాయుడి కజిన్ అయిదడుకుల ఒకంగుళం మాత్రం ఎత్తు వుంటాడు.

అందుచేత ఆయన్ని పొట్టి డాక్టర్ అంటారు ఆయన పరోక్షంలో.

రెండో ఆయన ఆరడుగుల ఎత్తుంటాడు.

ఆయన సమక్షంలో కూడా పొడుగు డాక్టర్ అంటారు.

సుబ్బారాయుడు ఆ అమ్మాయి జవాబు చెప్పేలోపులో బస్ కుడివైపు ముందర చక్రం రోడ్‌లో గుంటలో పడి బయ టకి వచ్చే ప్రయత్నంలో వుంది.

అధాటుగా సుబ్బారాయుడు, వెంకట్రావ్ రెండు అడు గుల ఎత్తు ఎగిరారు సీట్ల నుంచి.

తిరిగి యధాస్థానానికి వచ్చే మార్గంలో సుబ్బారాయుడి

చెయ్యి 'రూరల్ బ్యూటీ' భుజంమీద పడింది.

'రూరల్‌బ్యూటీ' నవ్వింది.

'పొట్టి డాక్టర్ గారింటికి' అని జవాబు చెప్పాడు సుబ్బారాయుడు సీట్లో కూలబడి.

'మా చెల్లి మంగి అద.......' అని 'రూరల్ బ్యూటీ' అనబోతుంటే బస్ ఎడమ చక్రం గోతిలో పడింది.

స్థిరత్వం కోసం ఎదుటి సీటు కమ్మీని గట్టిగా పట్టుకొన్న సుబ్బారాయుడు ఈసారి ఒకడగు మాత్రం ఎగిరాడు.

వెంకట్రావ్ రెండు చేతులతోనూ కిటికీ చువ్వలను పట్టుకొన్నాడు.

'మా చెల్లి మంగి అద పని చేస్తోంది' అంది 'రూరల్ బ్యూటీ తన ఎడమ చెయ్యి సుబ్బారాయుడు సీట్ కమ్మీని పట్టుకొన్న చేతికి తగిలిస్తూ.

'చాలా సంతోషం' అన్నాడు సుబ్బారాయుడు తన చెయ్యి తీస్తూ.

'నా పేరు రంగి' అన్నది కొద్దిగా సిగ్గుపడుతూ.

'గ్లేడ్ టు మీట్ యు. కామ్రేమే....'

సుబ్బారాయుడు, వెంకట్రావ్‌లతో సహా అందరూ ఒక్కసారి బస్ శిఖరాన్ని తాకి తిరిగి సీట్లలో కూలబడ్డారు.

ముందు చక్రాలు రెండూ ఒకేసారి గుంటల్లో పడడం దానికి కారణం.

'ఏబోయ్ డ్రైవర్, చూసి తోలేవ్' అంటున్నాడు ఎవ్వడో వెనక్కాల నుంచి.

డ్రైవర్‌కి అలాటివి వినబడవు.

నిర్లిప్తంగా అలాగే రోడ్ కేసి చూస్తున్నాడు బీడీకాలుస్తూ.

ఇంకో గంటకి దగ్గుపల్లి ముందర ఊరు దగ్గర బస్ హఠాత్తుగా ఆగింది.

డ్రైవర్ క్రిందికి దిగి బస్ క్రిందచూసి తిరిగి ఎక్కలేదు.

బస్‌లో అందరూ మాట్లాడకుండా దిగుతున్నారు. సుబ్బారాయుడు కండక్టర్‌ని అడిగాడు 'ఏమయింది' అని.

'ఏక్సిల్ విరిగిందండీ' అన్నాడు కండక్టర్ వేదాంత ధోరణిలో.

రెండు నిమిషాలు సామానుతో రోడ్‌మీద సుబ్బారాయుడు; వెంకట్రావ్ నిలబడ్డారు.

ఇంతలో రంగి ఓ సైకిల్ రిక్షా తీసికొని వచ్చి 'పొట్టి డాటర్‌గారింటికి తీసికెళ్ళు అబ్బాయిగార్లని' అని పురమాయించింది రిక్షావాడిని.

'మరి నువ్వెలా వస్తావ్ రంగీ'అన్నాడు సుబ్బారాయుడు సామాను రిక్షాలో పెడ్తూ.

'అడ్డపడితే అరగంట నడక, అంతేగా!' అంటూ నవ్వుతూ వెళ్ళిపోయింది.

బస్ ప్రయాణంకన్నా సైకిల్ రిక్షా ప్రయాణం కాస్త సాఫీగానే వుంది.

'ఆ పిల్లలో మంచి ఆకర్షణ వుందిరా' అన్నాడు వెంక

## షరతు

ఒకటి
కాదు పది కాదు
వందవాలదు వెయ్యి
సరిపోదు లక్ష లాభంలేదు
కోటికాదు కోటానకోట్లు
తలలూ చేతులూ కాళ్ళూ
కలిస్తే ఒకటిగకదిత్తే-

అరికాలి నుంచి
నడినెత్తిదాకా దేహం
లోహమైతే లోకం దా
సోహం అనిపిస్తుందేమో

తేల్నా తో
దేల్నా షా
ముల్నా జెం
గల్నా!

గ్లాని తొలగాలంటే ప్రాణ
హాని తప్పాలంటే నిస్త్రాణ
మౌని విలవాలంటే శూర్పణ
ఖ నెత్తురోడాలంటే దుర్బల జన
హననం ఆగాలంటే -

ధరణి పునర్జన్మ మెత్తాలంటే -
ఒకటి....ఒక్కే
ఒకటి....
ప్రతిహింస!

—కె.వి. రమణారెడ్డి

ట్రావ్ చేలకి అడ్డంగా నడిచిపోతున్న రంగిని చూస్తూ.

'కిటికీ దగ్గర కూర్చొంది కాబట్టి నీ సిద్ధాంతం ప్రకారం పెళ్ళికూతురు అయ్యి వుండాలి' అన్నాడు శుబ్బారాయుడు

'నీకేసి చాలా సార్లు చూసిందిరా' అన్నాడు వెంకట్రావ్ కొద్దిగా ఈర్ష్యతో.

'కామ్రేడ్-రంగి సంగతి అలా వుంచు. కాస్త పల్లె సీమల వాసన సోకగానే నీ మనస్సు చలిస్తున్నట్టుందే. అదిసరే మీ కాబోయే మామగారి పేరేమిటి.'

'రామలింగయ్య. ఊరికి మునసబు. ఊరి పెద్ద కామందులలో ఆయనొకడు అని వేరే చెప్పక్కర్లేదు'.

'నీ పెళ్ళికూతురు ఒక్కటే సంతానమా ఆయనకి'.

'కాదు. ఒక కొడుకు ఉన్నాడు. కాకినాడలో కాలేజిలో చదువుతున్నాడు. ఈవిడ బి.ఏ. పాసయి మూడేళ్ళుగా ఇంట్లోనే కూర్చొంది' అన్నాడు వెంకట్రావ్.

రిక్షా హాస్పిటల్ క్వార్టర్స్ దగ్గరకు చేరేసరికి ఆరు గంటలు దాటింది.

అరుగుమీద కూర్చొన్న డాక్టర్ వామనమూర్తి ఉరఫ్ పొట్టి డాక్టర్ నవ్వుతూ ఆహ్వానించాడు శుబ్బారాయుడిని- 'ఏమిటి ఈ అకాల దర్శనం' అంటూ.

ఇంటి లోపలినుంచి మూర్తి భార్య కమలకూడా బయటికి వచ్చింది నవ్వుతూ.

'మీట్ మై ఫ్రెండ్ కామ్రేడ్ వెంకట్రావ్. మీ మునసబుగారికి కాబోయే అల్లుడు. కాకినాడ పనిమీదవచ్చి మిమ్మల్ని చూద్దామని వచ్చాం.

మీట్ మై కజిన్ మూర్తి. మిసెస్ కమల' అని వెంకట్రావ్ని పరిచయంచేసి 'రఘు ఏడీ' అన్నాడు శుబ్బారాయుడు.

రఘు మూర్తిగారి ఏకైక పుత్రుడు.


'ఆడుకొందికి వెళ్ళాడు. ఇంకా రాలేదు' అంది కమల.

'ముందర మీరిద్దరూ స్నానాలు చెయ్యండి. తర్వాత కూర్చుందాం' అన్నాడు డాక్టర్ మూర్తి.

కమలని ఇంటిలోకి అనుసరించారు శుబ్బారాయుడు, వెంకట్రావ్ సామానుతో సహా.

## 5

శుబ్బారాయుడు, వెంకట్రావు స్నానం చేసి కాఫీ తాగిన




తరువాత అందరూ అరు బయట కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు.

'రామలింగయ్యగారికి తెలుసా మీరు ఇలా వస్తున్నారని' అన్నాడు మూర్తి వెంకట్రావు కేసి చూస్తూ.

'లేదు. కాకినాడ నుంచి ఇక్కడకు వద్దామని నిర్ణయించింది నిన్ననే' అన్నాడు వెంకట్రావు.

'ఆయనకి 'సర్ప్రైస్' ఇద్దామని....' అన్నాడు శుబ్బారాయుడు

'ఆయనకా. దమయంతికా' అన్నాడు మూర్తి నవ్వుతూ.

పెళ్ళి కూతురు పేరు దమయంతి.

'అయినా అంత కంగారుపడితే ఎలాగండీ. ఒహ నెల ఓపిక పట్టలేరా' అన్నాడు మూర్తి వెంకట్రావుతో.

వెంకట్రావు మొహంలో రంగులు మారుతున్నాయి.

'రామలింగయ్యగారిని వెంటనే నించున్న పళాన నేను రమ్మన్నానని చెప్పు' అని మూర్తి అప్పుడే వచ్చిన ఆఫీసు ప్యూన్కి పని పురమాయించాడు.

అయిదు నిమిషాలలో హుందాగా నడుస్తూ రామలింగయ్యగారు వచ్చారు. 'డాక్టరుగారూ ఏదో అర్జంట్ పని వుంది అన్నారట' అంటూ.

'రండి సార్. కూర్చోండి. మీరు నాకు బాగా దగ్గర అవుతున్నారు ఇప్పుడు. మీ అల్లుడు నా కజిన్ ప్రాణస్నేహితుడు' అని మూర్తి ఆహ్వానించాడు రామలింగయ్యగారిని.

'ఏమోయ్ ఏమిటిలా రావడం. ఇంట్లో అంతా కులాసానే?' అన్నారు రామలింగయ్య వెంకట్రావుతో.

'అందరూ బాగానే వున్నారండి. అయినా నేనిక్కడకు వద్దామని బయలుదేరలేదు. కాకినాడలో ఆఫీసు పని వుంటే వచ్చాను. మా శుబ్బారాయుడు సంక్రాంతి టైములో పల్లెటూళ్ళు బాగుంటాయి అని ఇలా లాక్కొచ్చాడు' అన్నాడు వెంకట్రావు తడబడ్తూ.

'ఇతను మా కజిన్ శుబ్బారాయుడు' అని మూర్తి పరిచయం చేశాడు.

'చూడటానికి అంత అందంగా వుండి. అలాంటి పాత కాలం పేరు పెట్టుకొన్నావేమిటోయ్' అని ఛలోక్తి విసిరారు రామలింగయ్య.

'నా పేరు సుబ్బారాయుడు కాదండీ శుబ్బారాయుడు' అన్నాడు శుబ్బారాయుడు.

'డాక్టర్ గారూ నా చెవుల్లో మందు వేసికోవాలా' అన్నారు రామలింగయ్య మందహాసం చేస్తూ.

'మీకు 'సెన్స్ ఆఫ్ హ్యూమర్' వుందని ఇట్టే తెలిసిపోయింది కామ్రే.... సార్. వాట్ ఐ మెంట్ వజ్.... నా పేరులో 'స కుంటి-స కాదు మెలిక శ' అన్నాడు శుబ్బారాయుడు.

రామలింగయ్యగారు గట్టిగ నవ్వారు.

'మంచి మాటకారివయ్యా! పెళ్ళి అయిందా?' అని ప్రశ్నించారు.

'ఇంకా లేదండీ అదృష్టవశాత్తు' అన్నాడు శుబ్బా

రాయుడు వినయంగా.

'అందులో అదృష్టమేమిటోయ్.... ఏమిటి డాక్టరుగారూ. ఇంత చక్కటి, చాకులాంటి కుర్రాడిని అలా వదిలివేశారు. ఇదే మా కులం వాడయితే....' అన్నారు రామలింగయ్య.

'అది కాదండీ, నా పెళ్ళి చూపులు విమానంలో జరిగితే గాని పెళ్ళి చేసుకోకూడదని నిర్ణయించుకున్నా' అన్నాడు సుబ్బారాయుడు గంభీరంగా.

రామలింగయ్య ఘొల్లుమని నవ్వారు.

'భలే దెబ్బ కొట్టావయ్యా మామీద. పెళ్ళి చూపులు ఇక్కడే ఏర్పాటు చేద్దామనుకొన్నా కాని వెంకట్రావు నాన్నకి ఏది వచ్చినా తొందరే. అప్పుడే అయిపోవాలన్నాడు. అందు చేత గుడివాడ స్టేషన్‌లో అవగొట్టేశాం' అన్నారు రామలింగయ్య.

ఇంతలో పశువుల డాక్టర్ ఆనందం, పొడుగు డాక్టరు శాస్త్రి కూడా వచ్చారు.

పరిచయాలన్నీ అయ్యాక రామలింగయ్యగారు పశువుల డాక్టర్‌తో అన్నారు: 'మా రాజా ఇవ్వాళ ఉదయం సరిగ్గా కుయ్యలేదండీ. కారణం ఏమిటంటారు.'

వెంకట్రావు, సుబ్బారాయుడులకు ఆ మాటలు అర్థమవలేదు.

మూర్తి వాళ్ళ మొహాలు చూసి చెప్పాడు 'రాజా అంటే రామలింగయ్యగారి పందెం కోడి. ఇంకో వారం రోజుల్లో ఇక్కడ పెద్ద కోడిపందెం జరుగుతుంది మునసబుగారి కోడికీ, కరణంగారి కోడికీ. ఎవరు ఓడిపోయినా నెగ్గినవారికి వెయ్యి రూపాయలు ఇవ్వాలి. పైగా 'సైడ్‌బెట్స్' చాలా వుంటాయి.

సుబ్బారాయుడి మొహంలో వెలుగు వచ్చింది.

'ఏమండీ మీ కోడి నెగ్గుతుందా' అన్నాడు రామలింగయ్యగారి కేసి చూసి.

'నా రాజా నెగ్గకపోతే ఇంకేది నెగ్గుతుందయ్యా. ఆ కరణంగాడి కోడీ ఒక కోడేనా, ఒక్క నిమిషం ఆగలేదు నా రాజా ముందర. క్రితం సంవత్సరం రాజా ఆ కరణంగాడి కోడిని రెండు నిమిషాలలో చంపింది' అన్నారు రామలింగయ్య గర్వంగా.

'అస్సలు కూయడం మానేసిందా?' అని అడిగాడు డాక్టర్ ఆనందం.

'రోజూ కొక్కొరొకో అని మూడుసార్లు ఏకబిగిని కూసేది. ఇవ్వాళ ప్రొద్దున రెండుసార్లు మాత్రమే కొక్కొరొకో అంది' అన్నారు రామలింగయ్య కొద్దిగా దిగులుగా.

'ఫరవాలేదండీ. మీరు రోజూ పెట్టే బాదం పప్పు కాస్త తగ్గించి తవుడులో పాలుపోసి పెట్టండి' అన్నాడు డాక్టర్ ఆనందం.

'అలాగే, అయినా మీరు రేపు ఓసారి మా యింటికి వచ్చి రాజాకి 'జనరల్ చెక్ అప్' ఒకసారి చెయ్యండి' అన్నారు రామలింగయ్య.

ఇంకో పదినిమిషాలు కబుర్లు అయిన తర్వాత రామలింగయ్య గారు లేస్తూ అన్నారు, 'ఇక వస్తానండీ లేటయింది. రాజా 'డిన్నర్' టైము కూడాను. నేను దగ్గర లేకపోతే సరిగ్గా తినదు. సుబ్బారాయుడు గారు 'కతికితే అతకదు' అన్నారు. అందుచేత అల్లుడుగారిని పెళ్ళయ్యేదాకా మా యింటికి పిలవను. కాని మీరు మాత్రం రేపు ప్రొద్దున రండి. మా రాజాను చూద్దురుగాని ఆనందం గారు రేపు తప్పకుండా వచ్చి రాజాని చూడాలి. వస్తానండీ మూర్తిగారు శాస్త్రిగారు'.

వెంకట్రావు వున్నాడని ఎవ్వరూ రామలింగయ్యగారి మీద ఏమీ విమర్శలు విసరలేదు. ఆయన వెళ్ళాక.

కాని సుబ్బారాయుడు మాత్రం నవ్వుతూ అన్నాడు ఆనందంతో 'తవుడులో పాలకి కొక్కొరొకోకి ఏం సంబంధం అండీ?

'సంబంధం ఉండాలా? విన్నన్న చెప్పింది వేదం. అయినా ఏదో 'ట్రీట్‌మెంట్' చెప్పకపోతే ఎలా- పైగా ఊరికి పెద్ద' అన్నాడు డాక్టర్ ఆనందం కూడా నవ్వుతూ.

ఏమండోయ్ నేను చెప్పింది మనలో మనమాట. మీ మామగారికి చెప్పేరంటే ట్రాన్స్‌ఫర్‌కి సామాను సర్దుకోవడం మొదలుపెట్టాలి' అన్నాడు ఆనందం వెంకట్రావ్‌తో.

అందరూ నవ్వారు అతని మాటలకి.

ఇంతలో కరణం శివయ్యకూడా వచ్చాడు గుడివైపు నుంచి.


డాక్టర్ ఆనందాన్ని చూసి అన్నారు:

'ఆడబోయిన తీర్థం ఎదురయినట్లు మీరే కనపడ్డారు. మీ కోసమే మీ యింటికి వద్దామనుకొంటున్నా'.

ఆయనకి కుర్చీ చూపించి సుబ్బారాయుడు, వెంకట్రావ్ లని పరిచయం చేశాడు మూర్తి.

'ఓ! నువ్వన్న మాట రామలింగయ్యకి కాబోయే అల్లుడివి' అన్నారు శివయ్య వెంకట్రావ్‌కేసి చూస్తూ.

అలా అనడంలో కొద్దిగా హేళన ధ్వనించింది.



'కనీసం దబ్బైనా గట్టిగా ముట్టచెప్తున్నాడా' అన్నారు శివయ్య మళ్ళా. 'కనీసం' అన్నమాట ఒత్తిపలుకుతూ.

'కాామే... శివయ్యగారూ. కట్నకానుకాదుల గురించి తెలిసికోవాలంటే వెంకట్రావు తండ్రిగారికి జాబు వ్రాయండి. వీడు అమాయకుడు' అన్నాడు శుబ్బారాయుడు నవ్వుతూ.

'మొహంచూస్తే అలాగే అన్పిస్తోంది.అయినా అమాయకుడు కాకపోతే....' అని ఆపేసి 'ఆనందంగారూ మా చక్రవర్తి ఇవ్వాళ పెట్ట వెంటబడ్డాడు. అది మంచిదంటారా' అన్నారు శివయ్య.

'శివయ్యగారూ, చక్రవర్తి అంటే మీ కోడిపుంజా' అని అడిగాడు శుబ్బారాయుడు వినయంగా,

'అవునయ్యా! వాడి పుంజు రాజా అయితే నా పుంజు చక్రవర్తి. క్రితంసారి మా పుంజుకు ఏదో మందుపెట్టారు మునసబు పార్టీవాళ్ళు. లేకపోతే నందికేశ్వరుడిలాటి పుంజు రెండు నిమిషాలలో చతికిలపడడమేమిటి. ఈసారి చూస్తారుగా అందరూ ఏ పుంజు నెగ్గుతుందో. సరే! నేవస్తానండి ఆనందం గారూ ఏం చెయ్యమంటారు' అన్నారు శివయ్య.

'గంధం అరగదీసి కాళ్ళకి రాయండి. రేపు వచ్చి నేను చూస్తాను' అన్నాడు ఆనందం.

శివయ్యగారు వెళ్ళిన తరువాత కాసేపు ఎవరూ మాట్లాడలేదు.

'కామ్రేడ్ శాస్త్రిగారూ, మీరు అస్సలు మాట్లాడటం లేదు' అన్నాడు శుబ్బారాయుడు.

'ఏముందండీ. ఇది ఏడాది పొడుగున వుండే భాగోతమే. కాని ఇద్దరూ ఊరికి పెద్దలు. ఏది మాట్లాడినా చిక్కే. అందు కోసం విని ఊరుకుంటాం.అయినా ఆ కోళ్ళ పేరులు చూడండి మన సినిమా నటులకి బిరుదులు ఇస్తారే నటచక్రవర్తి ఒకరైతే. నటసార్వభౌమ ఇంకొకరు. అలా మధ్యలో ఆనందంగారికి మంచి గిరాకీ' అన్నాడు శాస్త్రి నవ్వుతూ.

'నేను ఈ ఊరుకి బదిలీకాక మునుపు పశువుల డాక్టర్ని. ఇక్కడ కేవలం కోళ్ళ డాక్టర్‌గా మారాను. ఒకసారి కొక్కొరొకో అనకపోతే నేనే జవాబుదారి. పుంజు పెట్టవెనక పడకపోతే ఆవు వెనకాల పడ్తుందండీ, దానికికూడా నేనే మందు ఇవ్వాలి' అన్నాడు ఆనందంకూడా నవ్వుతూ.

'కాని ఆనందంగారు తెలివైనవాడులెండి. పందెం మూడురోజులుందనగా మామగారు పండక్కి పిలిచారని అమలాపురం చెక్కేస్తాడు' అన్నాడు మూర్తి.

'లేకపోతే ఎలా. పందెంలో ఏది సరిగ్గా పోట్లాడకపోయినా నేనే కావాలని ఏదో చేశానంటారు' అన్నాడు ఆనందం.

'ఇంతకీ ఏది నెగ్గుతుంది అంటారు' అన్నాడు శుబ్బారాయుడు ఆనందంతో.

'ఎలా చెప్తామండీ, రెండూ బలమయినవే. రెండింటి తిండి మీద వందల కొద్దీ రూపాయలు ఖర్చు పెడుతున్నారు' అన్నాడు ఆనందం.

పోస్ట్‌మాస్టర్ వరసింహంగారు వస్తూ అన్నారు.'ఏమిటి ఆనందంగారు 'ఎక్స్‌పర్ట్ కామెంట్స్' ఇస్తున్నారు'.

ఆయనని కుర్చీలో కూర్చోమంటే వద్దని అలాగే నిలబడ్డారు.

ఆయనకి పందాలంటే యిష్టం,

ఈ కోడి పుంజుల పోటీకి ఆయనే రిఫరీ.

గుర్రం పందాల్లో ఆయన ఆస్తి సగం చిల్లరగా మార్చాడని ప్రతీతి.

'నా అభిప్రాయ మేమిటంటే ఈసారి కరణం కోడి నెగ్గుతుంది. కావలిస్తే టూ టు వన్ ఆడ్స్ ఇస్తా, మునసబు కోడి మీద ఎవరయినా పందెం వేస్తే' అన్నారు ఆయన.

ఒక నిమిషం నిశ్శబ్దంగా వున్నారు అందరూ.

'కామ్రేడ్ నరసింహంగారూ. నాదో చిన్న బెట్. మీరిచ్చిన 'ఆడ్స్' మీద రెండు వందలు పందెం' అన్నాడు శుబ్బారాయుడు.


'ఎందుకయ్యా బుల్లోడా అనవసరంగా డబ్బు వృధా చేసుకొంటావు.క్రింతంసారి మునసబు కోడి నెగ్గుతుందనికూడా నేనే చెప్పాను' అన్నారు నరసింహం గర్వంగా.

'మీ కోళ్ళ పరిజ్ఞానానికి నా జోహార్లు. కాని చూడండి-ఈ పల్లెటూళ్ళలో నాలాంటి వాళ్ళకి ఏదో ఇలాంటిది లేకపోతే పది రోజులు వుండడం కష్టం.రేపే మద్రాసుకి సర్కార్‌లో బిచాణా ఎత్తేయాల్సివస్తుంది. 'టర్ఫ్ ఇన్విటేషన్ కప్ రేస్' దగ్గరలోనే వుంది కదా' అన్నాడు శుబ్బారాయుడు.

నరసింహంగారి మొహం వికసించింది.

'గుర్రప్పందేల ప్రవేశం మీకు ఉందన్న మాట. వీళ్ళెవరికీ అందులో మజా తెలియదులెండి. బెంగుళూర్ డర్బీరేస్ ప్రిన్స్ ఖార్టూమ్ నెగ్గినప్పుడు చూశారా. ఆ రోజు అయిదు వేలు 'థండరింగ్' మీద కాశాను. 'హాట్ ఫేవరిట్' బోర్డు మీదకి రాలేదు అన్నారు నరసింహం.

'ఏదో ఉడతా భక్తిగా నేనూ సేవ చేస్తున్నాలెండి అశ్వ



మేథ యాగానికి. పందెం ఖాయమేగా' అన్నాడు శుబ్బారాయుడు.

'నరసింహం మాట అంటే మాటే. కాని ఆ రేసు నేను జీవితంలో మరిచిపోలేను. సగం వరకు ప్రిన్స్ ఖార్టూమ్ వెనకాల వుంది. అక్కడ నుంచి ఏం స్పీడుతో వచ్చింది. చివర నాలుగయిదు లెంగ్తులతో నెగ్గింది. ఫెంటాస్టిక్ హార్స్. నా జీవితంలో అలాంటి గుర్రాన్ని చూడలేదు' అన్నారు నరసింహం ఊహాలోకంలో తిరుగుతూ.

ఇంతలో రఘు లోపల్నించివచ్చి మూర్తి చెవులో మెల్లగా చెప్పాడు. 'అమ్మ వంట అయింది అని చెప్పమంది' అని.

'రఘూ! ఈ రెండు వేళ్ళలో ఒకటి పట్టుకో' అన్నాడు శుబ్బారాయుడు.

రఘు ఒక వేలు పట్టుకున్నాడు.

'క్రామేడ్ నరసింహంగారు మీరు ఓడిపోతారు.నాలుగు వందలు నాకు రావడం ఖాయం' అన్నాడు శుబ్బారాయుడు.

నరసింహంగారితో సహా అందరూ నవ్వారు.

రాత్రి భోజనాల దగ్గర కమల అంది నవ్వుతూ శుబ్బారాయుడి కేసి చూస్తూ.

'ఏమోయ్ రెండు వందలు పందెం కట్టావట'

'టూ టు వన్ ఆడ్స్ ఇస్తే కట్టకపోతే ఎలా? అంటే మునసబుగారి పుంజు ఓడిపోతే నేను రెండువందలు మాత్రమే ఇవ్వాలి నరసింహంగారికి-కరణంగారి పుంజు ఓడితే నాకు నాలుగు వందలు ఇవ్వాలి ఆయన. గుడ్ బార్గయిన్ 'ట్రేక్ రికార్డ్' చూస్తే మునసబుగారి పుంజు ఫేవరిట్ అప్పుడే ఒకసారి నెగ్గింది. మీరుకూడా కాయకూడదూ పందెం' అన్నాడు శుబ్బారాయుడు.

'సరే! మమ్మల్నిలా బతకనీ నాయనా' అన్నాడు మూర్తి జవాబిస్తూ.

'వెంకట్రావ్‌గారూ దమయంతికి ఏదైనా హంసదూత్యం చెయ్యాలంటే నేను హంసగా మారడానికి అభ్యంతరం లేదు' అంది కమల నవ్వుతూ.

'ఇప్పుడు కావాల్సింది హంసదూత్యం కాదు దమయంతీ- పునఃస్వయంవరం' అన్నాడు శుబ్బారాయుడు మెల్లగా వెంకట్రావ్ చెవిలో.

వెంకట్రావు కూడా నవ్వాడు మెల్లగా.

వెంకట్రావు నవ్వుని సిగ్గుగా అన్వయించుకొంది కమల,

'అన్నట్లు శుబ్బారాయుడూ నాలుగురోజుల్లో మా ఫామిలీ ప్లానింగ్ సెక్షన్ తరపున ఇక్కడ ఒక పబ్లిక్ మీటింగ్ వుంది. క్రితం నెల జరిపిన కేంప్‌లో 'టాప్ మోటివేటర్స్'ని గౌరవిస్తాము. దానికి ముఖ్య అతిధి ఇంకా ఎవరూ కుదర్లేదు. నువ్వు బాగామాట్లాడతావుగదా-నువ్వే ముఖ్య అతిధిగా వుండకూడదూ' అన్నాడు మూర్తి.

'ఉపన్యాసమంటే నాకు అభ్యంతరం లేదుగాని నాకన్నా బాగా ఉపన్యాసాలిచ్చే వెంకట్రావ్ వుండగా నేను అనవసరం. నిజానికి నేను కాలేజీలో చదివేటప్పుడు 'ఎలిమెంట్స్ ఆఫ్ పబ్లిక్ స్పీకింగ్' వీడి దగ్గరే నేను నేర్చుకొన్నాను. మామూలు సంభా


ఇది మీకోసం!

మూఢ ఆచారాల అజ్ఞానపు చీకట్లను పారద్రోలే డా॥ సమరం రచన.........

పప్పు తింటే చీము పడుతుందా? మధుమేహానికి గోధుమ అన్నమేమందా? పచ్చకామెర్లకు మజ్జిగ అన్నం మాత్రమే సరిపోతుందా? పథ్యం తీసుకున్నవాడు నిద్రపోకూడదా? రక్తపోటు ఉంటే ఉప్పువాడకూడదా? చర్మవ్యాధులకు పథ్యాలు అవసరమా? కాలిన శరీరంమీద చన్నీళ్ళు చల్లవచ్చా? బల్లి చచ్చిపడిన ఆహారం విషతుల్యమా? వంకాయ తింటే వాతంచేస్తుందా? కోడిగుడ్డు-పొట్లకాయకూర విషతుల్యమా? నిమ్మరసం, ఐస్‌ఫ్రూట్ జలుబు చేస్తాయా? పొంగువస్తే మందులువాడకూడదా? చంటి పిల్లలకు ఆముదం పట్టించవచ్చా? చెవిపోటు పుట్టలో పాలుపోస్తే పోతుందా? కుక్కకాటుకు చెప్పుదెబ్బ మందా? పాముకాటునుంచి మంత్రాలురక్షిస్తాయా? దెయ్యం పట్టటం-దేవుళ్ళు ఆవహించటం నిజమేనా? అమావాస్యకూ, పౌర్ణమికి పిచ్చిముదురుతుందా? దెబ్బలకు దెయ్యంజడుస్తుందా? చేతబడి నిజంగా చేయవచ్చా? అంగవైకల్యానికి గ్రహణాలు కారణమా? తుమ్ములు అనర్థాన్ని కలిగిస్తాయా? వింత శిశు జననాలు కలియుగ మహత్యాలా? రొమ్ము కుదురు, గవదబిళ్ళలు మంత్రాలకు లొంగుతాయా? వేసవిలో ఎండవేళ స్నానంచేస్తే వడదెబ్బ తగులుతుందా? వంట చేసేవారికి గుండెజబ్బు వస్తుందా? చంటి బిడ్డ జబ్బుకు చురకల వైద్యమా? మెడలో తాళ్ళువేస్తే కోరింతదగ్గు తగ్గుతుందా? క్షయ వ్యాధికి గుర్తు దగ్గు రావటమేనా? ఎక్కువ రక్తం వుంటేనే రక్తపోటు వస్తుందా?

ప్రతిఒక్కరికీ ఉపయోగపడే ఇలాంటి 85 సమస్యలను వివరించి చెప్పిన తెలుగులో వెలువడిన ఏకైక పుస్తకం

సైన్స్-సెన్స్

వెల. 15 రూ॥లు

మీ దగ్గరి బుక్‌స్టాల్స్‌లో అడగండి. లేకపోతే అడ్వాన్స్ పంపిన V.P.P.లో పంపగలము.

నవభారత్ బుక్‌హౌస్
ఏలూరురోడ్. విజయవాడ.2

షణలలో అంతగా పాల్గొనని వీడికి వేదిక ఎక్కితే పూనకం వస్తుంది. రాధాకృష్ణన్‌గారి స్పీచ్ ఒకసారి విన్నాను వాల్తేరులో. అదొక్కటే వాడి ఉపన్యాసాలకన్నా నన్ను ఆకర్షించింది. ఫిక్స్ వెంకట్రావ్ ఫర్ ఇట్' అన్నాడు సుబ్బారాయుడు.

వెంకట్రావ్ మొహంలో రంగులు మారాయి.

సుబ్బారాయుడి తొడ గిల్లాడు ఎవ్వరికీ కన్పడకుండా.

'అబ్బ....సారీ.... ఐ మీన్ ఇట్ మూర్తి' అన్నాడు. సుబ్బారాయుడు తొడ రాసుకుంటూ.

'వెరీ గుడ్ వెంకట్రావుగారూ-మీరొప్పుకోవాలి మునసబు పార్టీవాళ్ళు సంతోషిస్తారు కూడాను' అన్నాడు మూర్తి.

'అది కాదండీ....' అంటూ వెంకట్రావ్, అనబో తుంటే:

'వెంకట్రావూస్ స్పీచ్ విల్ బి ఏన్ ఈవెంట్ టు రిమెంబర్' అన్నాడు సుబ్బారాయుడు గట్టిగా.

'అవునుగాని సుబ్బారాయుడు ఇందాక మునసబుగారు కూడా అడిగారు-నీ పెళ్ళి ఎప్పుడు' అన్నాడు మూర్తి.

'ఏం! నాలాటి వాళ్ళు ఎక్కువయితే ఫామిలీ ప్లానింగ్ అనవసరమని మీ ఉద్యోగాలు తీస్తారని భయమా-డోంట్‌వర్రీ కామ్రేడ్. మిగతావాళ్ళు ఆ లోటు భర్తీచేసి మీ ఉద్యోగాలు నిలబెడతారు ఎప్పుడూ' అన్నాడు సుబ్బారాయుడు నవ్వుతూ.

భోజనాలు అయిన తర్వాత వెంకట్రావూ మూర్తీ డ్రాయింగ్ రూమ్‌లో కూర్చున్నారు.

సుబ్బారాయుడు కమల భోంచేస్తుంటే కబుర్లు చెప్తున్నాడు.

'దమయంతి ఎలాటి అమ్మాయి' అన్నాడు సుబ్బా రాయుడు.

'పిల్ల మంచిదే. చూడడానికి కాస్త ఆరోగ్యవంతంగా వుంటుంది' అంది కమల నవ్వుతూ.

'అనగా లావు అని అర్థమా' అన్నాడు సుబ్బారాయుడు నవ్వుతూ.

'ఈ కాలపు పిల్లల్లాగే తెలుగు నవలలు చదువుతుంది ఎక్కువగా సినిమాలు కూడా బాగా చూస్తుంది. ముఖ్యంగా చంద్రమోహన్ సినిమాలంటే చాలా యిష్టం.'

'ఇవన్నీ చూచాయగా వెంకటావ్ కూడా చెప్పాడు. పెళ్ళి చూపుల్లో వీటిమీదే ప్రశ్నలు వేసిందిట' అన్నాడు సుబ్బా రాయుడు.


'ఆ విషయం వాళ్ళ అక్కయ్యకూడా చెప్పింది. అవునూ! పెళ్ళి చూపుల్లో అంత బిడియంగా వున్నతను రేపు ఉపన్యాసం ఎలా ఇస్తాడు....పైగా నువ్వు బాగా రికమెండ్ చేశావు' అంది కమల.

'ఉపన్యాసం గురించి పట్టించుకోకు. చూస్తావుగా. దమయంతి విశేషాలు యింకేమిటి' అన్నాడు సుబ్బారాయుడు.

'ఏం; వెంకట్రావ్‌గారు అడగమన్నారా' అంది కమల నవ్వుతూ.

'ఐ ఆమ్ క్యూరియస్. దట్సాల్.'

'దమయంతి మేనత్త కొడుకు రవి అని వున్నాడు. వాళ్ళింట్లోనే చిన్నప్పటినుంచి పెరిగాడు. దమయంతి కన్నా నాలుగేళ్ళు పెద్ద. ఆ అబ్బాయికి దమయంతి నిస్తారని అనుకొనే




వాళ్ళు ఊళ్ళో. కాని మునసబుగారికి చదువుకున్న అల్లుడుకావాలి. రవి చదువుకోలేదు. కాని మునసబుగారికి వ్యవసాయంలో చాలా సాయం చేస్తాడు.' అంది కమల.

సుబ్బారాయుడు ఒక క్షణం ఆలోచనలో పడ్డాడు.

'మొన్న దమయంతి వచ్చి ఎల్లుండి సినిమాకి వెళ్దామంది. ఈ ప్రక్క ఊళ్ళో టూరింగ్ టాకీస్ వుంది. 'పదహారేళ్ళవయస్సు' సినిమా ఆడుతోంది. ఇప్పుడు మీరు వచ్చారు కాబట్టి ఏం చేస్తుందో తెలీదు' అంది కమల భోజనం ముగిస్తూ.

'పదహారేళ్ళ వయస్సా' అది వచ్చి నాలుగయిదేళ్ళు అవ్వలేదూ, నేను చూశాను ఆ సినిమా' అన్నాడు. సుబ్బా రాయుడు.

'ఈ మహాపట్టణాలకి అంతకన్నా కొత్త సినిమాలు వస్తాయా' అంది కమల నవ్వుతూ.

అరుగుమీద వేసిన మంచాల మీద నిద్రకు ఉపక్రమిస్తున్నారు వెంకట్రావ్, సుబ్బారాయుడు.

'ఏమిట్రా! నేను ఉపన్యాసాలివ్వడ మేమిటి-నీ బొంద. నాకు మైక్ చూస్తేనే వణుకు వస్తుందే' అన్నాడు వెంకట్రావ్.

'కామ్రేడ్ వెంకట్రావ్ పేషన్స్ ప్లీజ్. అన్నీ మన మంచి కొరకే. నేను స్పీచ్ రాసిస్తాగా బట్టీ పట్టి అప్పగించేయడమే. నువ్వు చిన్నప్పుడు పెద్ద బాలశిక్ష బట్టీ వేశావే అలా'

'మార్గం ఏదయినా ఆలోచించావా' అన్నాడు వెంకట్రావ్.

'నీ సమస్యకా! ఏదీ గోదాంలో ఇప్పుడే దిగాంకదా పాత్రల పరిచయం అవుతోంది. చూద్దాం ఆపైన నీ అదృష్టం' అన్నాడు సుబ్బారాయుడు దుప్పటి మెడదాకా కప్పుకొంటూ.

'ఏమోరా! నాకు మాత్రం ఏమీ ఆశ కలగడం లేదు.' అన్నాడు వెంకట్రావ్ నిట్టూరుస్తూ.

'ఇన్ డార్క్‌నెస్ లైట్ పెర్‌సిస్ట్స్' అన్నాడు గాంధీ. లెటజ్ సీ-గుడ్ నైట్ అంటూ నిద్రపోయాడు సుబ్బారాయుడు.

## 6

మర్నాడు ప్రొద్దున అరుగుమీద కూర్చుని మగవాళ్ళు కాఫీలు తాగుతుంటే రంగి వచ్చింది.

'ఏమిటి నువ్వు వచ్చావ్ మంగి ఏమయింది' అన్నాడు మూర్తి.

'ఇంట్లో పనుందండీ దానికి. పది రోజులు నేనే పనికి వస్తాను' అంది రంగి ప్రక్కన కూర్చొన్న సుబ్బారాయుడి కేసి గుచ్చి చూసి ఇంట్లోకి వెళ్తూ.

వెంకట్రావ్ సుబ్బారాయుడు కేసి చూసి కళ్లెగరేశాడు.

'ఆ అమ్మాయి చెల్లి మా యింట్లో పనిమనిషి. ఈ అమ్మాయి పేరు రంగి' అన్నాడు మూర్తి.

'వుయ్ హేడ్ ది ప్లెజర్ ఆఫ్ మీటింగ్ కామ్రేడ్ రంగి ఇన్ ది బస్ ఎస్టర్ డే. నిన్న మాకు రిక్షాకుదిర్చి పెట్టింది రంగే' అన్నాడు సుబ్బారాయుడు.

'మంచి ఛలాకీ అయిన అమ్మాయి. సినిమాలంటే పిచ్చి. వారానికి ఓసారయినా కాకినాడ వెళ్ళి సినిమాలు చూసి వస్తుంది. ఇక్కడ ప్రక్క ఊరులో టూరింగ్ టాకీస్ సినిమాలోవి కాకుండా. వీళ్ళ మేనమామ ఒకడు కాకినాడలో మెకానిక్. వాడితో పెళ్ళి కూడా త్వరలో అవుతుంది' అన్నాడు మూర్తి.

'కంగ్రాచ్యులేషన్స్ వెంకట్రావ్. నీ థియరీ-అంటే కిటికి దగ్గిర కూర్చొన్న అమ్మాయి పెళ్ళికూతురు అవాలన్న సిద్ధాంతం ఈ విషయంలో రైటయింది' అన్నాడు సుబ్బారాయుడు నవ్వుతూ.

మూర్తికి ఆ మాటలు అర్థమవక పోయినా వెంకట్రావ్‌తో పాటు నవ్వాడు.

'ఇక హాస్పిటల్‌కి వెళ్ళడానికి రెడీ అవ్వాలి' అంటూ ఖాళీ కప్పులతో లోపలకి వెళ్ళాడు.

వెంకట్రావ్ కూడా బాత్‌రూమ్‌కి వెళ్ళాడు.

'సుబ్బారాయుడు షేవ్ మొదలుపెట్టాడు అరుగు మీదే. లోపలనుంచి ఇల్లు ఊడుస్తూ అరుగుదాకా వచ్చింది రంగి.

'రెండు నిమిషాలు నా పని అయిపోతుంది.' అన్నాడు క్రీమ్ రాసుకుంటూ.

రంగి అలాగే నిల్చుని సుబ్బారాయుడి కేసి చూస్తోంది.

అద్దంలో మొహం చూసుకొంటూ రేజర్‌కి పని చెప్పాడు.

'మీ చెంపలమీద జుట్టు బాగుంది' అంది మెల్లగా.

'వీటిని ఇంగ్లీష్‌లో 'సైడ్ బర్న్స్' అంటారు.

లార్డ్ బర్న్ సైడ్ అనే ఆయన వీటిని మొదట ఫేషన్‌లోకి తెచ్చాడు కాబట్టి ఆయన పేరునే తలక్రిందులు చేసి వీటికి పేరెట్టారు.' అని విశదీకరించాడు సుబ్బారాయుడు రెండోసారి క్రీమ్ రాస్తూ గడ్డానికి.

రంగికి జనరల్ నాలెడ్జి'లో అంత ఆసక్తి ఉన్నట్లు కన్పించలేదు.

'మీరు సినిమాలో నాగేశ్వరరావులా ఉన్నారు' అంది కొద్దిగా సిగ్గు అభినయిస్తూ.

'కామ్రేడ్ రంగి ప్రొద్దున్నే నన్ను అలా అవమానం చెయ్యడం నీకు తగదు. నేను క్షమించినా భగవంతుడు నిన్ను క్షమించడు. నాలాటి యువకుడిని అరవయ్యో పడిలో పడే ఆ మహానుభావుడితో పోల్చడమా' అన్నాడు సుబ్బారాయుడు కోపం తెచ్చిపెట్టుకొంటూ.

'సినిమాలలో నాగేశ్వరరావు బాగా వుంటాడండీ' అంది రంగి తను చెప్పినదాన్ని సమర్థిస్తూ.

'నువ్వు దగ్గుపల్లి నాగేశ్వరరావు అభిమాన సంఘం అధ్యక్షురాలవయితే నువ్వు చెప్పినదానికి అభ్యంతరం లేదు. నాగేశ్వరరావుగారు మహానటుడు అంటే ఏమీ అబ్‌జెక్షన్ లేదు' అన్నాడు సుబ్బారాయుడు.

ప్రజాస్వామ్యంలో రకరకాల అభిప్రాయాలకు తావుందని నమ్మేవాళ్ళలో ఒకడు సుబ్బారాయుడు.

'మీరు నాగేశ్వరరావులా ఉండడమే కాకుండా అలాగే మాట్లాడతారు' అంది రంగి.

'నాగేశ్వరరావుగారి మీద జరిపిన 'సెమినార్' చాలు. నా షేవ్ కూడా అయిపోయింది. దిస్ ఈజ్ ఆల్ యువర్స్' అన్నాడు సుబ్బారాయుడు షేవింగ్ సామాను సర్దుతూ.

'మీరు సినిమాలో చేరండి'అని రంగి సలహాయిచ్చింది. అరుగు తుడవడానికి ఉపక్రమిస్తూ.

'థేంక్యూ ఫర్ ది సజెషన్. నేను సినిమాలో హీరో అయితే నిన్ను హీరోయిన్‌గా వేసుకుంటాను-సరేనా' అన్నాడు సుబ్బారాయుడు నవ్వుతూ.

ఆ మాటకి రంగి మొహం వికసించింది.

ముగ్గురూ 'బ్రేక్‌ఫాస్ట్' చేస్తున్నారు.

సుబ్బారాయుడు కిటికీలోంచి చూస్తే ఇద్దరు పిల్లలు వీధిలో 'నిరోధ్'లని బుడగలుగా చేసి వాటితో ఆడుకుంటున్నారు.

'కామ్రేడ్ మూర్తీ, మీ డిపార్ట్‌మెంట్‌కి ఫామిలీప్లానింగ్ కన్న రాజ్‌నారాయణ్‌గారిచ్చిన పేరు 'ఫామిలీ వెల్‌ఫేర్' సమంజసం' అన్నాడు సుబ్బారాయుడు.

'ఏం' అన్నాడు మూర్తి.

సుబ్బారాయుడు వీధిలో దృశ్యం చూపించాడు.

'మేం ఇక్కడి వాళ్ళకి నెలకి కొన్ని ఫ్రీగా ఇస్తాం.



కొందరు పిల్లలకి ఇస్తారు వాటిలో కొన్ని-ఏం చేస్తాం' అన్నాడు మూర్తి.

'మునసబుగారింటికి వెళ్ళాలి' అన్నాడు శుబ్బారాయుడు.

'ఆఫీస్‌కి వెళ్ళి ప్యూన్‌ని పంపిస్తా. ఇల్లు చూపిస్తాడు' అన్నాడు మూర్తి.

అరగంటలో ప్యూన్ వచ్చాడు.

శుబ్బారాయుడు వెళ్తూ ఇంట్లో ఉన్న ఫామిలీ ప్లానింగ్ లిటరేచర్ అంతా వెంకట్రావు ఎదురుగా వడేసి 'చదువు అంతా. నీ స్పీచ్‌కి ఉపయోగిస్తుంది' అన్నాడు.

శుబ్బారాయుడిని చూస్తూనే లోపలి గదిలోంచి బయటకి వచ్చారు మునసబు. 'రండి రాయుడుగారూ మీ కోసమే ఎదురు చూస్తున్నా' అంటూ లోపలి గదిలో కుర్చీలో కూర్చోబెట్టి ఇంట్లోకి కేకవేశారు ఆయన. 'ఏమేవ్ మన అల్లుడుగారి ప్రాణ స్నేహితుడు వచ్చాడు' అని.

రామలింగయ్యగారి సతీమణి ప్లేట్ నిండా స్వీట్స్, ఇంకో ప్లేట్‌లో ఇడ్లీలు, హార్లిక్సు కప్‌లతో వచ్చింది రెండు నిమిషాల తర్వాత.

మీ యింట్లో క్యాలరీస్ రిచ్ పుడ్ తింటారులాగుంది అన్నాడు శుబ్బారాయుడు నెయ్యి ఓడుతున్న స్వీట్స్, యిడ్లీలను చూసి.

'మా యింట్లో మనుషులేమిటి ఆఖరికి రాజా కూడాఅంతే. వెన్న పూసలేందే ప్రొద్దున తిండి ముట్టదు' అన్నారు రామలింగయ్య గర్వంగా.

'ఆఖరికి పని మనుష్యులు కూడా అంతేనా' అనబోయేడు మునసబుగారి సతీమణి వెనుక వున్నావిడని చూస్తూ.


అదృష్టవశాత్తు శుబ్బారాయుడు ఆ మాట అనే లోపులో మునసబుగారి భార్య వెనకవున్న ఆవిడని చూస్తూ అంది.

'ఎందుకే అలా సిగ్గుపడతావు. అల్లుడిగారి ప్రాణ స్నేహితుడు'.

శుబ్బారాయుడు గతుక్కుమన్నాడు.

కాని సంబాళించుకొని 'క్రామేడ్ వెంకట్రావ్‌కి అవబోయే సహధర్మచారిణిగారా. నమస్కారం దమయంతిగారూ' అన్నాడు నవ్వు తెచ్చిపెట్టుకుంటూ.

దమయంతి తిరిగి నమస్కారంచేసి తలుపుకేసి చూస్తూ నిలబడింది.




'ఈవిడకి తలుపులంటే యిష్టంకాబోలు. వెంకట్రావుతో ప్రథమ సమాగమంలో కూడా తలుపులకేసే చూసింది' అనుకొన్నాడు శుబ్బారాయుడు.

సన్నగా పొడుగ్గా వున్న యువకుడు లోపలినించి వచ్చాడు.

'ఇతను నా మేనల్లుడు రవి' అన్నారు మునసబుగారు పరిచయంచేస్తూ.

'రవిగారి గురించి నేను విన్నాలెండి' అన్నాడు శుబ్బారాయుడు రవికేసి చూసి మందహాసం చేస్తూ.

'మామయ్యా పొలంకి వెళ్ళివస్తా. మిమ్మల్ని తర్వాత కలుస్తానండీ రాయుడుగారూ' అంటూ బయటికి వెళ్ళాడు రవి.

కాసేపయిన తర్వాత మునసబుగారు శుబ్బారాయుడిని పెరటిలోకి తీసికొని వెళ్ళారు రాజాని చూపించడానికి.

రాజాని కేవలం కోడి అనలేం.

'ప్రవుడ్ ఏజ్ పీకాక్' అని అంటారుకాని రాజాని చూస్తే 'ప్రవుడ్ ఏజ్ రాజా' అనాల్సివస్తుంది.

కోలయిన తల, పొడుగు మూతి, నిడుపయిన మెడ, వంకర ముక్కు, పలచటి చర్మం, నునుపు అయిన మొఖం, మెడమీద జూలు, రెక్కలమీద దట్టంగా ఈకలు, శరీరంముందు భాగం వెడల్పుగావుండి వెనుకకు పోయిన కొలదీ తోక దగ్గర సన్నము, పొడవయిన తోక, బలమైన రెక్కలు, ఎరుపు రంగుతో హుందాగా వుంది రాజా.

రాజా నీడలోనే తిరగడానికి పందిరి వేయించారు. గూటిలో మూల కూర్చొనేందుకు బూరుగుదూది తలగడా దాని ముందర స్టెయిన్‌లెస్ స్టీల్ గిన్నెలో మంచినీళ్ళు ఉన్నాయి.

మునసబుగారిని చూసి బూరుగుదూది దిండుమీద ముడిచి పెట్టుకొని కూర్చొని ఉన్న రాజా గూటిలోంచి బయటికి వచ్చి రెక్కలు ఒకసారి టప టప కొట్టింది.

మునసబుగారు రాజాని చేతుల్లోకి తీసికొన్నారు-అభిమానంగా నిమురుతూ రాజాని.

'విష్ యు ఆల్ ది బెస్ట్' అన్నాడు శుబ్బారాయుడు రాజాకేసి చూస్తూ.

రాజా మొహం ప్రక్కకు త్రిప్పింది.

'ఇది దగ్గుపల్లి కోడి అండీ. తెలుగులోనే మాట్లాడాలి' అన్నారు మునసబు నవ్వుతూ.

శుబ్బారాయుడు నరసింహంగారితో కాసిన పందెం గురించి చెప్పాడు.

'శభాష్. నిన్ను మొదట చూసినప్పుడే అభిమానం కలిగింది. ఇప్పుడు ఇంకా యిష్టపడుతున్నా' అన్నారు మునసబు ఒక చేత్తో శుబ్బారాయుడి వీపు తట్టుతూ.

రాజా మునసబుగారి చేతిలోంచి క్రిందకు ఎగిరింది.

శుబ్బారాయుడు రాజాకేసి చూస్తూ అన్నాడు:

'దీన్ని దేగ అంటారు'.

'అంతే' అన్నారు మునసబు.

'ఇది డెంకి కోళ్ళజాతిది. డెంకి కోళ్ళని రంగులబట్టి పదమూడు రకాలుగా విభజిస్తారు.

ఎరుపురంగు కలవి 'దేగ'ని పిలుస్తారు. అన్నట్లు కరణం గారి కోడి రంగు ఏమిటి?

'అది పూర్తిగా నలుపు' అన్నారు మునసబు.

'అలా అయితే దానిని 'కాకి' అంటారు. మీ రాజా చక్రవర్తిని ఓడించాలంటే శాస్త్రం ప్రకారం ఆరుద్ర నక్షత్రంలో వదలాలి. అప్పుడు దేగ కాకిని జయిస్తుంది' అన్నాడు శుబ్బారాయుడు.

'నీకు కోళ్ళ గురించి చాలా తెలుసులా వుందే'అన్నారు మునసబుగారు ఆశ్చర్యపోతూ.

'గుర్రాల తర్వాత నేను శ్రద్ధ తీసికొన్నది కోళ్ళల్లోనే అన్నాడు శుబ్బారాయుడు వినయంగా గుడివాడ స్టేషన్‌లో కొని చదివిన 'కుక్కుటశాస్త్రం'లోని ముఖ్య అంశాలు గుర్తుకు చేసికొంటూ.

'బలంగా వున్నాడా రాజా' అని అడిగారు మునసబు.

'ముక్కు యింకా బలిష్టంగా వుండాలి. 'కాక్ ష్యూర్' అనే 'పౌల్ట్రి ఫీడ్' వస్తోంది మార్కెట్‌లో. అది వేయించండి రేపటి నుంచి' అన్నాడు శుబ్బారాయుడు వారంరోజుల క్రితం చూసిన పేపర్ ఎడ్వర్టయిజ్‌మెంట్ జ్ఞప్తికి తెచ్చుకొని.

'తప్పకుండా' అన్నారు మునసబు.

'పందెం ఎప్పుడు' అన్నాడు శుబ్బారాయుడు.

'ఇంకో వారంలో. ఇవ్వాళనుంచి మా టీమ్‌కి మేనేజర్ నువ్వే' అన్నారు మునసబు మరోసారి రాయుడి భుజం-చరుస్తూ.

'విత్ ప్లెజర్. మీ కోడి-ఐ మీన్-రాజా నెగ్గితే నాకు లాభమేగా.'

మునసబుగారు ఒక్కక్షణం శుబ్బారాయుడికేసి చూశారు.

'రాయుడుగారు మీరే కనుక మా కులంవారు అయితే మిమ్మల్నే అల్లుడిగా చేసికొందును' అన్నారు మునసబు.

'నో! నో! అంతమాట అనకండి. వెంకట్రావు యోగ్యుడు' అన్నాడు శుబ్బారాయుడు తొందరగా.

'ఏమి యోగ్యుడో. నోట్లో నాలిక లేదు. పెళ్ళి చూపుల్లో ఆఖరికి దమయంతి మొదట మాట్లాడవలసివచ్చిందట. మా అన్నయ్య కూతురు ఆ విషయం చెప్పి ఒకటే నవ్వడం' అన్నారు మునసబు నిట్టూరుస్తూ.

'వాడు మామూలు సంభాషణలలో మితభాషే. కాని వేదికమీద ఉపన్యాసాలు దంచేస్తాడు. మీరే చూస్తారుగా అవతలి ఎల్లుండి మీటింగులో' అన్నాడు శుబ్బారాయుడు.

మునసబుగారు 'చూద్దాంగా' అన్నట్లు మందహాసం చేసి రాజాకి కాపలాగా వుంచిన పాలేరు ఎల్లయ్యని 'జాగ్రత్తగా చూస్తూండు' అని హెచ్చరించి శుబ్బారాయుడితో హాస్పిటల్‌కి బయలుదేరాడు.

ఎల్లయ్య భుజాలు బిరువెక్కినట్లు పొంగాయి. అందులో ఆశ్చర్యం లేదు.

కరణంగారి వేగు అయిన ఎల్లయ్యకి ఆయన దగ్గిరకి మోసుకొని వెళ్ళడానికి విశేషాలు చాలానే వున్నాయి.

దగ్గుపల్లి శివార్లలో ఒక చెరువు. దాని ప్రక్కనే శివాలయం వున్నాయి.

## పోలికలు

అద్దాల మేడ - అందాల భామ
బృహదారణ్యకోపనిషత్తులో
సీలియాని కుట్టి చంపేసిన
కిం గం జా ఐలండ్ చీమలు.
వేదాల పనసలు - ఉల్లిపాయ పొరలు.
నిలువుటద్దాల్ని నిట్టూర్పులతో కొలువ్
షాపెనోవర్ పడుకున్న చోట
పడిపోయిందొక క్షురకర్మ అద్దం.
పగిలిన అద్దంలో అతనొక
అనంత శయన ఐక్యతా శతమూర్తి.
సంసార కొలిమిలో సన్యాసి ఊపిరి ఊదు
దీపాల కొలువులో పాపాల చీకటి చిమ్మ
నిలువుటద్దాలపై పడకటద్దాలు పడితే
కళ్ళు విరిగి కాళ్ళు పగుల్తాయ్.
వాలుటద్దాలపై కార్నర్ అద్దాలు రగిలితే
స్ప్లింటర్స్‌లో సిన్నర్స్ మిగుల్తారు.
అద్దాల మేడలో గాజుసూదుల కంపలో
గాయపడ్డవాళ్ళని చూచి డాక్టరే కట్టు కట్టుకుంటాడు.

—'మో'



ఆ సాయంత్రం వెంకట్రావ్, శుబ్బారాయుడు చెరువు దగ్గిరకి షికారువెళ్ళి శివాలయం ఆవరణలోవున్న పెద్ద గోడను ఆనుకొని చెరువువైపుకి కూర్చొన్నారు శివాలయానికి వచ్చే వాళ్ళకి కనపడకుండా.

వెంకట్రావ్ అలా శూన్యంలోకి చూస్తున్నాడు.

'ఏం. కామ్రేడ్ ఏమయింది' అన్నాడు శుబ్బారాయుడు సిగరెట్ వెలిగిస్తూ.

'మధ్యాహ్నం హంసగారు ఉత్తరం పట్టుకొనివచ్చారు.'

'కమల దమయంతి దగ్గిన్నించి....'

'అవును ఇదుగో చదువు' అని ఉత్తరం శుబ్బారాయుడికి యిచ్చాడు వెంకట్రావ్.

'మై డియరెస్ట్ శ్రీవారూ'

నేను ఫొటో పంపమని వ్రాస్తే మీరే వచ్చేశారన్నమాట. నా మీద మీకు ఎంత ప్రేమ ఉందో ఇక వేరే చెప్పక్కర్లేదు. నేను మీ ఒడిలో తల వాల్చుకోవాలని ఎంత తహ తహ పడ్తున్నానో మీకు తెలియదు. మీరు మితభాషి అయినా మీరు చేసే పనుల్లో మీ ప్రేమ అంతా వ్యక్తమవుతుంది. ఈ ఊళ్ళో మనిద్దరం కలుసుకోవడం కుదరదు. అంతా ఘోషా పద్ధతి'. అందులో మా నాన్న ఊరిపెద్ద. కుటుంబ గౌరవం కాపాడుకోవాలికదా.ఈ నెల తొందరగా పోవాలని దేముణ్ణి ప్రార్థిస్తున్నా.

నాన్నగారు చెప్పారు మీరు మీటింగ్‌లో ఉపన్యాసం ఇస్తారని. మీటింగ్‌కి వస్తాను. దూరంగానే నా ప్రేమ అందుకోండి.

—మీ దమయంతి.'

'మనిషి పుష్టిగా వున్నా శైలి సరళంగానూ, సాఫీగానూ ఉంది' అన్నాడు శుబ్బారాయుడు ఉత్తరాన్ని మెచ్చుకుంటూ.

'ఇంకెలాగరా' అన్నాడు వెంకట్రావు జీర కంఠంతో.

'అరె! అలా ఆడపిల్లలా ఏడిస్తే ఎలా కామ్రేడ్? మ్యూజీని చూసి బుద్ధి తెచ్చుకో. ఎన్ని కమిషన్లు వేసినా ఎలా ఫైట్ చేసి తిరిగి పవర్‌లోకి వచ్చిందో చూశావుగా!'

'లాభం లేదురా. నా జీవితానికి ఇంతే' అన్నాడు వెంకట్రావు నిట్టూరుస్తూ.



'నాకో విషయం తెలిసింది విన్న.'

'ఏమిటి.,

'విన్న కమల చెప్పింది. దమయంతికి ఓమేన బావ వున్నాడు. ప్రొద్దున వాళ్ళింట్లో నేను చూశాను కూడా. పేరు రవి. మీ మామగారి వ్యవసాయమంతా అతనే చూస్తున్నాడు' వాళ్ళింట్లోనే చిన్నప్పటి నుంచి పుట్టి పెరిగాడట. దమయంతి కన్నా నాలుగేళ్ళు పెద్దదట. అతనికి ఆ యింటి అల్లుడు కాకుండా పోవడానికి కారణం అతనికి చదువు లేదని. దమయంతి మనస్సు అతని వైపు మళ్ళించాలి' అన్నాడు శుబ్బారాయుడు.

వెంకట్రావు పేలవంగా నవ్వాడు.

'ఎలా? అందులో గట్టిగా పది రోజులు టైము లేదు. పైగా ఈ హంసదూత్యం. నాకేమీ నమ్మకం లేదు మనం అది సాధిస్తామని. ఒకవేళ సాధించినా మునసబుగారు మనసు ఎలా మారుస్తాం' అన్నాడు వెంకట్రావు.

'ఆయన సంగతి నాకు వదిలేయి. ఈ ప్రక్క ఊరు టూరింగ్ టాకీసులో 'పదహారేళ్ళ వయస్సు' సినిమా ఆడుతోందిట. ఆ సినిమా రవి,దమయంతి కలిసి చూసేటట్టు నువ్వు చెయ్యాలి.'

వెంకట్రావ్ అర్థం కానట్లు చూశాడు.

'ఆవిడకి చంద్రమోహన్ అభిమాన నటుడు అని నీ గుడివాడ ఇంటర్వ్యూలో విదితమయింది కూడా. అదే వార్త విన్న కమల కూడా నిర్ధారణ చేసింది. పైగా ఆ సినిమాలో హీరోయిన్ మొదట ఊరి డాక్టరుని ప్రేమించి,ఆ డాక్టరు చపలత్వం తెలిసికొని చివర రవి లాంటి తన బావనే ప్రేమించి పెళ్ళి చేసుకొంటుంది' అన్నాడు శుబ్బారాయుడు.

'సినిమా చూసినంత మాత్రాన మారిపోతుందా ఎంత దగ్గువల్లి చంద్రమోహన్ అభిమాన సంఘం రాణిపోషకురాలయినప్పటికీ' అన్నాడు వెంకట్రావు.

'నో! కామ్రేడ్! లెటజ్ ట్రై. ఎవ్విరీ లిటిల్ బిట్ హెల్ప్స్' అన్నాడు శుబ్బారాయుడు.

'సరే! ఏం చెయ్యమంటావు.'

'ఏముంది. మన హంసగారున్నారుగా. ఆవిడ ద్వారా ఎల్లుండి సినిమాకు మొదటి ఆటకు రమ్మని వ్రాయి. నువ్వు కూడా సినిమాకు వస్తున్నానని రాయి. అలా రాసి నువ్వువెళ్ళకు. ఉత్తరం రాసి నువ్వు వెళ్ళకపోతే ఆవిడకు చిరుకోపం రావొచ్చు. వాళ్ళ తమ్ముడు ఇంక ఇక్కడ లేడు కాబట్టి రవి చేత పంపిస్తారు. ఆవిడను సినిమాకు టూరింగ్ టాకీస్ రెండు, మూడు మైళ్ళ దూరం కాబట్టి గుర్రబ్బండిలో వెళ్తారు. చంద్రమోహన్ పాత్ర. సినిమా కథ. ఇద్దరు గుర్రబ్బండిలో రాత్రి పది గంటల తర్వాత కలిసి రావడం.... నంద్రపుల్ సెట్టింగ్. ఆ పైన నీ అదృష్టం! అన్నాడు శుబ్బారాయుడు.

'కాని ఇంత ప్రేమ ఒలకబోస్తూ ఉత్తరం రాసిందికదా. ఒక్క సినిమా చూసి మారిపోతుందంటే....' అని సంశయించాడు వెంకట్రావు.

'మైడియర్ కామ్రేడ్. ఈ వయసు ఆడపిల్లలు ఊహాలోకాల్లో వుంటారు. ఇప్పుడావిడ ఊహాలోకంలో నువ్వో ఆధారం. ఇంకో బలమైన ఆధారం వస్తే నువ్వు వెనక్కి వెళ్తావు. అసలు సత్యం ఊహాలోకం. మిధ్య ఈ ఆధారాలు. ఆ విషయం పట్టించుకోకు. నియతం కురు కర్మత్వం! కర్మ జ్యాయే హ్యకర్మణః నీ పని నువ్వు చెయ్యి. అసలు ఏమీ చెయ్యకుండా వుండడంకన్నా ఏదో ఒకటి చెయ్యడం మంచిది. కమక దూకు అర్జున, కిరీటీ, ధనంజయా, పార్థ....' అని ఆగాడు ఊపిరి పీల్చుకునేందుకు సుబ్బారాయుడు.

'సరే! అలాగే రాస్తాలే. చాలించు నీ ఉపన్యాసం' అన్నాడు వెంకట్రావు విసుగ్గా.

'గుడ్. దటీజ్ ది స్పిరిట్. కొందరు వచ్చి ఆనంద పెడ్తారుట. మరి కొందరు రాకుండా ఆనందపెడ్తారుట. అలాగే కొన్ని ఉపన్యాసాలు ఆపు చెయ్యడం కోసమైనా కొందరు కార్యదీక్షపరులు అవుతారు' అన్నాడు సుబ్బారాయుడు నవ్వుతూ సిగరెట్ అప్పుతూ.

చీకటిపడ్తుంటే ఇద్దరూ ఇంటికి పోదామని లేవబోయి గోడవతల గుసగుసలు విని తిరిగి కూర్చొన్నారు. కరణంగారి గొంతు ఎవరితోనో నెమ్మదిగా మాట్లాడుతోంది. 'ఏమిటీ! ఆ కుర్రాడికి అంత తెలుసా' అంటోంది కరణం గొంతు.

'చానాసేపు మాట్టాడేరండి' ఆరికోడి జాతి ఏమిటో, మీ కోడి జాతి ఏమిటో. చాత్రం ప్రకారం ఏది ఎప్పుడు నెగ్గుతుందో అబ్బో! చాన తెలుసు' అంటోంది ఆ రెండో గొంతు.

'ఇంకేం చెప్పాడు.'

'ఏదో కష్యర్ అలాటిదేదో కోళ్ళ తిండి కొత్తగా బజారులో వస్తోందిట. అది పెట్టమన్నా రండీ రాజాకి.'

కాకినాడలో వాకబ్ చేయిస్తా దాన్ని గురించి. రాజా తింటే చక్రవర్తి తినాల్సిందే. సరే! అందాకా ఈ పది రూపాయలు వుంచు. ఇక వెళ్ళు. పూజారి బైటికి వచ్చే వేళయింది. ప్రతీ విషయం జాగ్రత్తగా విని నాకు చెప్తూ వుండు' అంది కరణం గొంతు.

ఆ రెండు గొంతులూ దూరం అయ్యాక సుబ్బారాయుడు మెల్లగా అన్నాడు.

'హంతకుడు తెలివయిన వాడు.'

'ఏమిట్రా. నాకేమీ అర్థం కావటం లేదు'

'అవి కరణం, మునసబుగారి పాలేరు గొంతులు. వాళ్ళు కుర్రాడు అని ఉదహరిస్తున్న వ్యక్తి నేను, కామ్రేడ్. నరసింహంగారితో నేను కాసిన పందెం ఇక నెగ్గినట్లే. చిన్న గాంధీగారి వాక్కు చెప్పానుగా అదే 'ఇన్ డార్క్‌నెస్ లైట్ పెర్‌సిస్ట్స్' అని. నీ సమస్యా పరిష్కారానికి కొద్దిగా లైట్ కనబడుతోంది. లెటజ్‌గో.' అన్నాడు సుబ్బారాయుడు మందహాసం చేస్తూ.

## 7

మర్నాడు ప్రొద్దున్న వెంకట్రావ్ ఫామిలీ ప్లానింగ్ లిటరేచర్ తిరగవేస్తుంటే సుబ్బారాయుడు అన్నాడు 'కామ్రేడ్ దటీజ్‌ది స్పిరిట్. ఊరికినే తిరగవేయడం కాదు పాయింట్స్ నోట్ చేసుకో. నేనీలోపులో హాస్పిటల్‌కి వెళ్ళి మన రూరల్ హెల్త్ సర్వీసెస్ ఇన్ యాక్షన్ చూసి వస్తాను ఇన్ యాక్షన్ ఆర్ ఇనాక్షనో తేల్చుకోవాలి'.

ప్రైమరీ హెల్త్ సెంటర్స్ గ్రామాలలో పెట్టిన తర్వాత గ్రామీణ ప్రజకి రోగాలు ఎక్కువయినట్లు కన్పిస్తుంది. దానికి

## ఏకాంతికం

ఎంత ఏకాంతం-
ఘనీభవించిన
కరగని మంచు ముద్దలాంటి రాత్రి
గుండెలపై కూర్చున్నప్పుడు-
కాలపు పరిధుల్ని దాటి
స్వప్న సురభిగా ప్రపంచ పంజరంలో
కళ్ళు బందీలైనప్పుడు-
మన్ను తిన్న పాములా క్షణాలు
కదలలేక కదులుతున్నప్పుడు
ఎంత ఏకాంతం-
ఏకాంత ధ్వాంతా విముక్తం కావాలని
స్వాంతాని కెంత ప్రయత్నం-
మాతృ గర్భంలో
ఆకారంలేని అణువు
జీవం అరువు తెచ్చుకున్నప్పుడూ-
అంతిమంగా అనంతంలో
ఇంద్రియాలు ఇంధన వాయువుని
వాయులీనం చేస్తున్నప్పుడూ-
ఏకాంతమే
కాలక్షేత్రంలోని
సమస్యా సైన్య సమీకృత కురుక్షేత్రంలోనూ
తోడుగా నిలిచే ధనం
పీడని ఒంటరితనం.

(లలితకు)

—శైలకుమార్

•కారణం హెల్త్ సెంటర్స్ అని అర్థం కాదు.

రోజూ కనీసం రెండు వందల మంది అయినా అవుట్ పేషంట్స్ వచ్చి వెళ్తారు.

కారణం ఏమిటి?

ఈ సెంటర్స్ లేనపుడు వీళ్ళంతా ఏం చేసేవారు?

ఒక కారణం ఎలాగూ పెట్టారు కాబట్టి ఇది వరకు ఆచార్లుగారి దగ్గర పుచ్చుకొనే మందులు బదులు ఈ డాక్టర్ల దగ్గరే తీసికోవచ్చు అనే అభిప్రాయం అవొచ్చు.

నిజానికి ఇది వరకు ఆచార్లుగారిచ్చే మందులకు, ఈ సెంటర్స్ ఇచ్చే మందులకు స్థూలంగా పెద్ద తేడాలేదు.

యునెస్కో సహాయం ద్వారా వచ్చే బిళ్ళలు మినహా గవర్నమెంట్ సప్లయి చేసే మందులు అందరికీ ధారాళంగా ఇస్తే సరిపోవు.


ఊరి పెద్దల కుటుంబాలకీ, కాస్త పేంటు చొక్కావేసే వాళ్ళకి, హాస్పిటల్ సిబ్బందికీ ఎలాగూ సరయిన మందులు ఇవ్వాలి ఆ కాస్త సప్లయిలోనూ.

ఇక మిగతా వాళ్ళకి ఎలాగో రేషన్ చెయ్యాలి.

అలా అని గ్రామీణ ప్రజలు అంతఅమాయకులుకారు. ఏ రోగానికయినా ఎ.పి.సి తెల్లబిళ్ళలే యిస్తే ఒకసారి ఊరుకొంటారు. రెండుసార్లు ఊరుకొంటారు. తర్వాత 'ఈ డాక్టర్‌కి తెలియదేస్' అని తీర్పు యిస్తారు.

అటువంటి తీర్పు ఏ డాక్టర్ 'ఆరోగ్యానికి' మంచిది కాదు.

అందుచేత ఏదో మూల విరాట్టు ఒకడయినా వేరు వేరు రూపాలలో అవతరిస్తాడనే హిందూమత సిద్ధాంతంలో ఈ డాక్టర్లకి నమ్మకం ఎక్కువ. ఎ.పి.సి. బిళ్ళలు, విటమిన్ పిల్స్ పొడిగా మార్చి, పొట్లాలుగా యిచ్చి, ముక్కలుగా ఒకసారి, పూర్తి బిళ్ళలుగా ఇంకోసారి యిచ్చి, మరోసారి అదేబిళ్ళల్ని నీళ్ళలో కరిగించి అరకుగా యిచ్చి, అలా తంటాలు పడ్తూ వుంటారు. ప్రజలకు ఒకే మందు యిస్తున్నారు అనే భావన రానీకుండా.




ఇంకో రకం పేషెంట్లు వస్తారు.

ఫక్తు నాటు సరుకు.

వీళ్ళకి బిళ్ళలు, అరకులలో ఏమాత్రం విశ్వాసం ఉండదు.

ఎడమ చెయ్యి చిటికిన వేలు బెణికినా వీళ్ళు 'డాటర్ గారూ ఇండీషన్ ఇవ్వండి' అంటూ చొక్కా చేతులు జబ్బల పైకి మడుచుకొంటూ మరీ వస్తారు హాస్పిటల్‌లోకి.

వీళ్ళకి జబ్బు ఏమిటి? జ్వరం వుందా? లాటి ప్రశ్నలు వెయ్యడం వృథా.

'డిస్టిల్డ్ వాటర్ స్టాక్' బట్టి ఆ నీళ్ళని ఇంజక్షన్ రూపంలో వీళ్ళకి ఇస్తే మళ్ళీ కొంతకాలం హాస్పిటల్‌కి రారు.

పైగా చక్కటి పబ్లిసిటీ ఇస్తారు.

'ఆ డాటర్ నా మొహం చూడగానే పసిగట్టేసాడు రోగం. పెసి, మర్నాడే తగ్గిపోయింది' అంటూ.

సుబ్బారాయుడు హాస్పిటల్‌కి వెళ్ళేటప్పటికి ఓ వంద మంది ఆడా, మగా వేరువేరు వరసలలో నించుని వున్నారు. లోపలికి వెళ్ళి మూర్తి ప్రక్కన కుర్చీలో కూర్చొన్నాడు.

'నెక్స్టట్' అన్నాడు మూర్తి.

ఓ ముసలమ్మ వచ్చింది.

'ఏం! అమ్మా! ఏమిటి విశేషం' అన్నాడు మూర్తి.

'విశేషం లేకోతే నానెందుకు వత్తా బాబూ. నిన్న రేత్రి నుంచి మోకాళ్ళ చిప్పల దగ్గర ఒకటే నెప్పి అయ్యా' అంది ఆవిడ.

'చూడమ్మా! వచ్చే వయసే కాని పోయే వయస్సు కాదు. ఇంతకాలం నీకు సేవ జేసి అరిగిపోయాయి మోకాటి చిప్పలు. కాస్త భరించుకోవాలి.నర్స్ నాలుగు పొట్లాలివ్వండి. రోజుకి రెండు చొప్పున నీళ్ళతో వేసుకోండి. మళ్ళీ రండి' అన్నాడు మూర్తి.

'తర్వాత' అని అరిచాడు మూర్తి.

ఒకావిడ రెండేళ్ళ పిల్లాడిని ఎత్తుకొని వచ్చింది.

'పిల్లాడు రాత్రి సరిగ్గా నిద్రపోలేదండీ రాత్రి అంతా దగ్గుతూనే వున్నాడు' అంది ఆవిడ.

పిల్లాడి చెయ్యి, నాలిక చూసి 'ఇది పిల్లలకు వచ్చే మామూలు దగ్గే. పెద్దవుతుంటే అదే పోతుంది. ఏం భయం లేదు. ఈ ఆరు పొట్లాలూ రోజుకి రెండు చొప్పున పాలతో యివ్వండి' అన్నాడు మూర్తి.

'ఏ పాలండీ' అంది ఆవిడ.

డాక్టర్ చెప్పింది తు.చ. తప్పకుండా అమలుపరిచే స్వభావం ఆవిడది.

'ఏ పాలయినా ఫరవాలేదు అవుదయినా, గేదెదయినా ఆఖరికి మీ....' అని ఆగి 'తల్లిపాలయినా' అన్నాడు మూర్తి విసుగ్గా.

నర్స్ నవ్వు ఆపుకొందికి నోటికి చెయ్యి అడ్డం పెట్టుకొంది.

'నెక్స్టట్' అన్నాడు మూర్తి.

ఓ ముసలివాడు, అతని మనవడు కామోసు పదేళ్ళ కుర్రవాడూ వచ్చారు.

ముసలాడు డాక్టర్ పక్కన పేషెంట్లు కూర్చునే స్టూల్ మీద కూర్చొన్నాడు.

మూర్తి ఆ ముసలాడి నాడి చూశాడు.

'జ్వరం ఏమీ లేదు' అన్నాడు మూర్తి.

'నాకు కాదండి మా మనవడికి....'

'మరి స్టూల్ నువ్వెందుకు ఎక్కావయ్యా మహానుభావా. లెండి' అన్నాడు మూర్తి.

ఆ కుర్రవాడికి వీపునిండా పేలింది.

'ఆ ఏం లేదు. ఎండల్లో తిరిగి వుంటాడు. కాస్త గంధం పట్టించండి. ఈ రంగు బిళ్ళలు రోజుకి ఒకటిచొప్పున నాలుగు రోజులు వెయ్యండి. మంచినీళ్ళతో ఇవ్వండి' అన్నాడు మూర్తి.

తర్వాత ఓ నడి వయస్కుడు వచ్చాడు.

అతన్ని చూస్తూనే అన్నాడు మూర్తి.

'బల్ల ఎక్కమంటే ఒప్పుకోవుగాని, వారానికి రెండు సార్లయినా మందులు కావాలి'.

'ఈ సారి చేయించుకొంటానండీ దానికి ఇప్పుడు మూడో నెల' అన్నాడు అతను సిగ్గుపడ్తూ.

'సరి! ఇంకెందుకు అలా కంటూ కూర్చుందువుగాని' అన్నాడు మూర్తి గట్టిగా.

'పొత్తి కడుపుకింద నొప్పండీ'.

'సరే! అది ఎప్పుడూ ఉన్నదేగదా. నర్స్- పాత డోస్ రిపీట్'.

ఇంటి దగ్గర్నించి ఫ్లాస్కులో కాఫీ వచ్చింది.

'కాసేపు ఎవర్నీ లోపలికి రానీయకయ్యా' అని ప్యూన్‌తో చెప్పి 'హుష్ ఇలా వుంటుందోయ్ మా వ్యవహారం' అన్నాడు మూర్తి చేతులు బేసిన్‌లో కడుక్కుంటూ.

'కామ్రేడ్ మూర్తీ నీ మందులకన్నా నీ మాటలే వీళ్ళ రోగాల్ని నయం చేస్తున్నట్లు కన్పిస్తోంది' అన్నాడు శుబ్బారాయుడు నవ్వుతూ.

'ముప్పాతిక కేసులు మైనర్‌వే. సీరియస్ కేసులు ఎలాగూ కాకినాడ రిఫర్ చేస్తాం. అయినా మా కొచ్చే మందుల సప్లయిస్‌తో ఇంతకన్నా చెయ్యలేం' అన్నాడు మూర్తి.

'శాస్త్రిగారు ఏరీ?'

'ఆయన కేంప్‌కి వెళ్ళారు. ఈ మందుల సప్లయిలోనే మాకున్న సబ్ సెంటర్స్‌ని కూడా చూసుకోవాలి' అన్నాడు మూర్తి విసుగ్గా.

'ఇఫ్ యూ డోంట్ మైండ్ నాదో చిన్నప్రశ్న.

పిల్లల జబ్బులు వయసు వచ్చేకొద్దీ వాటికవే పోతాయి అన్నావు. ముసలివాళ్ళకి వచ్చే వయసే కాని పోయే వయస్సు కాదంటున్నావు. మరి మిగతా వాళ్ళకి ఏం సలహా యిస్తావ్' అన్నాడు శుబ్బారాయుడు నవ్వుతూ.

'అవన్నీ ప్రొఫెషనల్ సీక్రెట్స్. అయినా పిడుక్కీ, బియ్యానికీ ఒకటే మంత్రం ఉపయోగిస్తే కొంపలు మునుగుతాయి. నకులుడు చినుక్కీ చినుక్కీ మధ్యనుంచి రథంతోలే వాడుట. అందులో ఎంత నిజముందోకాని, మా విషయం ఇంచుమించుగా అలాటిదే!' అన్నాడు మూర్తి కూడా నవ్వుతూ.

ఇంతలో మోటివేటర్ ఒకాయన వచ్చాడు ప్రక్క గుమ్మం లోంచి.

మూర్తికి నమస్కారంచేసి అన్నాడు: 'ఆ మాలపల్లి కేస్ ట్యూబెక్టమీ నుంచి వేసెక్టమీగా మార్చేశాను'.

మూర్తి మొహం విప్పారింది.

'సారీ కామ్రేడ్. మీరిక్కడ ఏదో మేజర్ సర్జికల్ బ్రేక్‌త్రూ కనిపెట్టి వుండాలి. లేకపోతే ఆయన చెప్పింది అర్థం చేసుకోవడం కష్టం' అన్నాడు శుబ్బారాయుడు.

'ఓ! అదా! దటీజ్ మోర్ ఎ సోషల్ ప్రోబ్లమ్. ఒక ఫామిలీ ప్లానింగ్ కేస్ వుంది. భర్తని వేసెక్టమీ చేయించుకోమంటే ఎంత చెప్పినా వినకుండా భార్యకి ట్యూబెక్టమీ చెయ్యమంటాడు. సరే వచ్చే వారం ఫిక్స్ చేశాం. కాని ట్యూబెక్టమీ వేసెక్టమీకన్నా పెద్ద ఆపరేషన్. డెలివరీ అవగానే చేస్తే ఫరవాలేదుగాని కొంత కాలమయిన తర్వాత చెయ్యాలంటే కొద్దిగా కష్టం. పైగా రోజుకి ఇరవయి గంటలు పవర్ వుండదు ఇక్కడ. ఇంతకూ చెప్పేదేమిటంటే చివరకు అతనే వేసెక్టమీ చేయించుకొంటాను అన్నాడన్న మాట' అన్నాడు మూర్తి నవ్వుతూ.

మునసబుగారి మేనల్లుడు రవికూడా ప్రక్క గుమ్మం లోంచి వచ్చాడు- 'డాక్టర్‌గారూ చెయ్యి బెణికింది' అంటూ.

'నర్స్! 'రిలాక్స్‌యిల్' కాస్త పట్టించు' అన్నాడు మూర్తి.


'రవిగారూ పొలంకి వెళ్తున్నారా' అన్నాడు శుబ్బారాయుడు.

'అవునండీ' అన్నాడు రవి.

'సరే! నేనుకూడా మీతో వస్తా. పొలాలు చూసి చాలా ఏళ్ళయింది. కామ్రేడ్ మూర్తి! భోజనం టయిముకి యింటికి వస్తా' అంటూ శుబ్బారాయుడు రవితోపాటు బయటికి వచ్చాడు.

ఇద్దరూ పొలం వైపు నడుస్తున్నారు.

'కామ్రేడ్ రవీ! మిమ్మల్ని మొట్టమొదట చూడగానే





నా తమ్ముడు అన్పించాడు' అన్నాడు శుబ్బారాయుడు.

'మీకు తమ్ముళ్ళు ఎంతమంది' అని అడిగాడు రవి.

'ఎవరూ లేరు. కాని ఉంటే మీలాగే వుండేవాడు అన్పించింది.

రవి నవ్వి ఊరుకున్నాడు.

'మీలాంటి మాణిక్యాన్ని యింట్లో పెట్టుకొని మునసబుగారు దమయంతికి వేరే సంబంధం చెయ్యడం ఏమిటంటి?'

అన్నాడు శుబ్బారాయుడు.

రవి ఒక నిమిషం మౌనం పాటించాడు.

'మీరు వెంకట్రావ్‌గారి ప్రాణ స్నేహితుడని విన్నా' అన్నాడు రవి మెల్లగా.

'నేను వెంకట్రావ్ ప్రాణ స్నేహితుడినే. కాని, స్నేహం వేరు, న్యాయం వేరు. మనసులో వున్నది కుండబద్దలు కొట్టే టట్లు చెప్పే మనస్తత్వం నాది. పైగా వెంకట్రావ్ సంగతి నాకు బాగాతెలుసు' అన్నాడు శుబ్బారాయుడు రహస్యంగా.

'ఏమిటి' అన్నట్లు చూశాడు రవి.

'వాడు కాస్త రసికుడు' అన్నాడు శుబ్బారాయుడు మెల్లగా.

రవి మొహంలో రంగులు మారాయి.

'నాకు దమయంతి అంటే ప్రాణం. కాని మామయ్యకి నేను యింటి అల్లుడు అవడం యిష్టం లేదు' అన్నాడు రవి నిట్టూరుస్తూ.

'నో! నో! కామ్రేడ్ రవీ! మీరు ప్రాణంగా చూసుకునే దమయంతి భవిష్యత్తు గురించి ఆలోచించారా? వెంకట్రావు లాంటి చపలచిత్తుడి పాలు చేస్తున్నారు' అన్నాడు శుబ్బారాయుడు కాస్త కోపం మొహం మీద పులుముకొని.

'ఏమో! మీరు చెప్పిన దాంట్లో నాకు నమ్మకం కుదరటం లేదు. వెంకట్రావుగారిని చూస్తే చాలా అమాయకుడిలా కన్పిస్తారు' అన్నాడు రవి సందేహంగా.

'వాడు కాలేజీలో చదివే రోజుల్లో మా క్లాస్‌మేట్ వెలుగు అనే అమ్మాయి వుండేది. క్రిస్టియన్ గర్ల్. ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకుంటానని మోసం చేశాడు వెంకట్రావు. తర్వాత ఆ అమ్మాయి హాస్పిటల్‌లో చేరడం చాలా రభస అయింది. పోనీ! అదేదో చిన్నప్పటి చపలత్వం అనుకుందాం. రాజ

మంక్రి మెరక వీథిలో వెంకట్రావు పేరు తెలియని ఇల్లు లేదు తెలుసా. మీ దమయంతిని చేసుకొనేది డబ్బు కోసం' అన్నాడు శుబ్బారాయుడు.

'మీరు చెప్పింది నిజమే అనిపిస్తోంది. దమయంతి చూడడానికి అంత బాగుండదు. కాని మనసు మంచిది. అందుకోసం నాకు యిష్టం. కాని వెంకట్రావుగారికి దమయంతి తెలియదు కదా బాగా. డబ్బు కోసమే ఈ పెళ్ళి చేసుకుంటున్నాడని నేను అనుకొన్నాను' అన్నాడు రవి.

'రైట్. దమయంతికి మీ మీద మనసు ఉందా?'

'చెప్పడం కష్టం. వాళ్ళ నాన్న ఎంత చెప్పితే అంత దానికి' అన్నాడు రవి.

'మీ మీద అభిమానం కూడా లేదా?'

'అభిమానం ఉంది. కాని నాకు చదువు లేదని వాళ్ళ నాన్నకి నన్ను అల్లుడుగా చేసుకోవడం యిష్టం లేదు. ఒకసారి దమయంతి కూడా నాకు చదువులేదని హేళనగా మాట్లాడింది' అన్నాడు రవి.

'ఓ. కె. అయితే నేను చెప్పినట్లు చెయ్యండి. దమయంతి మీదవుతుంది.'

'ఏమిటి' అన్నాడు రవి.

'టూరింగ్ టాకీసులో 'పదహారేళ్ళ వయస్సు' సినిమా ఆడుతోంది. రేపు రాత్రి ఆటకి తీసుకొని వెళ్ళండి.'

'రేపు సినిమాకు రానంటే.'

'అది నాకు వదిలివెయ్యండి. దమయంతి రేపు సినిమాకు వస్తుంది. మీరు కూడా వెళ్ళండి. సరేనా.'

'సరే' అన్నాడు రవి.

'తర్వాత ఇంకో విషయం. ఓ రబ్బరు త్రాచుపాము సంపాదించగలరా?'

'రబ్బరు త్రాచుపామేం కర్మ నిజం త్రాచుపామునే సంపాదించగలను. నాకు పాములంటే భయం లేదు.'

'నో! కామ్రేడ్! నిజం త్రాచుపాములు మనం చెప్పిన చోట వుండమంటే వుండవు. రబ్బర్‌వే కావాలి.'

'కాకినాడలో నాకు తెలిసిన డ్రామాట్రూప్ వుంది. వాళ్ళ దగ్గర ఉంటుంది.'

'వెరీగుడ్! రేపు ప్రొద్దున కాకినాడ వెళ్ళండి. రాజాకి కోళ్ళ తిండి ఒకటి రికమెండ్ చేశాను నిన్న మీ మామకి. దానికోసం వెళుతున్నానని చెప్పండి. వెళ్ళి మధ్యాహ్నంకి తిరిగి వచ్చేయండి. ఎందుకంటే సాయంత్రం సినిమాకి వెళ్ళాలి గదా. ఎల్లుండి వెంకట్రావు మీటింగ్‌లో ఉపన్యాసం ఇస్తాడు.

ఆ సాయంత్రం దమయంతి తిరిగి యింటికి వెళ్ళేటప్పటికి ఆవిడ గదిలో మంచం మీద వదలండి రబ్బరు పాముని. ఆవిడ దాన్ని చూసి కేక వేసినప్పుడు మీరు ఆ పాముని చంపి ఆవిడని రక్షిస్తారు. అర్థమయిందా' అన్నాడు శుబ్బారాయుడు నవ్వుతూ.

'దానివల్ల ఉపయోగమేమిటి?' అని అడిగాడు రవి.

'ఉపయోగమేమిటో తర్వాత వెండి తెరపైనే చూడాలి' అన్నాడు శుబ్బారాయుడు.

'సరే.'

'కాని ఇంకో విషయం. మీరు సినిమా నుంచి వచ్చేటప్పుడు గంభీరంగా వుండి శూన్యంలోకి చూస్తూ వున్నట్లు కన్పడాలి. ఆ విషయం మరిచిపోకండి.'

'సరే! కాని నాదో చిన్న సందేహం. మామయ్య మీరంటే ఇప్పటికే చాలా అభిమానం చూపిస్తున్నాడు. వెంకట్రావుగారిని కాదని మీకే యిస్తానంటే దమయంతిని.'

'కామ్రేడ్! అలాంటి అనుమానాలు నీ మనసులోకి రానీయకు. నా జీవిత ధ్యేయం బ్రహ్మచారిగా ఉండాలనే. నేను బంధ్యం వేసికోను కాని ఉంటే దానిమీద ప్రమాణం చేద్దును. మునసబుగారు వెంకట్రావుని కాదన్నారంటే ఇక దమయంతి నీదే. ఐ ప్రోమిస్ దట్ ఆన్ మై వర్డ్ ఆఫ్ ఆనర్. అంటే నా మనసు ప్రమాణికంగా చెప్తున్నా ఆ విషయం.'

'సరే! మీరు చెప్పింది ఎందుకు కాదనాలి. ఏ పుట్టలో ఏ పాముందో' అన్నాడు రవి.

'ఏ బెడ్‌లో ఏ రబ్బర్ పాముందో అనండి!' అన్నాడు శుబ్బారాయుడు నవ్వుతూ.

రాత్రి భోజనాలకి అందరూ కూర్చొన్నారు.

'హంసదూత్యం రిప్లయి వెళ్ళిందా' అన్నాడు శుబ్బారాయుడు వెంకట్రావ్‌తో మెల్లగా.

'ఊ' అన్నాడు వెంకట్రావ్ జున్ను తింటూ.

పల్లెటూళ్ళలో డాక్టరుగావుంటే కొన్ని సుఖాలున్నాయి. ఆ చుట్టుపక్కల గేదెకాని, ఆవుగాని ఈనితే ఓ గిన్నెడు జున్నుపాలు డాక్టరుగారికి తప్పకుండా వస్తయ్.

మూర్తికి వారానికి ఒకసారి అయినా జున్నుపాలు వస్తూనే వుంటాయి.

అలాగే కూర, నార, పళ్ళు, పసుపుకొమ్ములు, కొబ్బరికాయలు, మినుములు, పెసలు, కందిపప్పు, మునగకాయలు, ఒకటేమిటి ఆ చుట్టుప్రక్కల పండేవన్నింటిలోనూ డాక్టరుగారి 'వాటా' వస్తూనే వుంటుంది.

వేళకాని వేళలో డాక్టర్ అవసరం రావచ్చు; దానికి ఊళ్ళోవాళ్ళు కట్టే 'ఇన్సూరెన్స్ ప్రీమియం' అది.

నాయుడుగారి చేతికి ఇంజక్షన్ ఇవ్వబోతూ 'ఏం! నాయుడుగారూ ఈ సారి మీ తోటలో బంగినపల్లి బాగా కాయలేదా' అని డాక్టరంటే ఎంత గుండెదిటవున్న నాయుడుగారయినా

'మా బోలయ్యగాడికి చెప్పాను నిన్న మీ యింట్లో ఓ డజను ఇమ్మని. ఇంకా ఇవ్వలేదా' అనాల్సివస్తుంది. సాయంత్రానికి డజను బంగినపల్లికాయలు డాక్టర్‌గారింట్లో ఉంటాయి.

పైగా ఊళ్ళో పెద్ద కుటుంబం ఆడవాళ్ళు హాస్పిటల్‌కి రారు.

వాళ్ళు డాక్టర్‌గారింటికి రావడమో, డాక్టర్‌గారు వాళ్ళింటికి వెళ్ళడమో జరగాలి.

డాక్టర్ అవసరం వచ్చినపుడు ఈ తరగతి వాళ్ళు కూర, నారలతోపాటు డాక్టర్ గారికి కొంత ధనం కూడా అప్పుడప్పుడు ముట్టచెప్పుతారు.

'కామ్రేడ్ మూర్తి, జున్ను శ్రేష్ఠంగా వుంది. రూరల్ హెల్త్ సర్వీస్‌లో కొన్ని సుఖాలు ఉన్నాయన్న మాట' అన్నాడు శుబ్బారాయుడు కూడా జున్ను తింటూ.

'ఉన్నాయి. కాని, కొన్ని కష్టాలు కూడా ఉన్నాయి' అన్నాడు మూర్తి అదోలా మొహం పెట్టి.


ఆ మాట విని కమల ఫక్కుమని నవ్వింది.

'సారీ! కమలా! నాకు హాస్యరసమంటే యిష్టమేకాని మూర్తి చెప్పినదాంట్లో హాస్యం ఏమీ స్ఫురించలేదు' అన్నాడు శుబ్బారాయుడు.

'ఓ! అదా! ఆఫ్టర్ ది మీల్స్' అన్నాడు మూర్తి నవ్వుతూ.

భోజనాలయిన తర్వాత తాంబూలాలు నములుతూంటే వెంకట్రావ్ అడిగాడు- 'మూర్తిగారూ, ఇందాక భోజనాలు అయిన తర్వాత ఏదో చెప్తానన్నారే' అని.

'మేము ఈ ఊరికి వచ్చిన కొత్తలో జరిగింది అది. పెద్ద కాపు గారికి అజీర్ణం చేసింది. మా యింటికి ప్రొద్దున్నే వచ్చారు. 'డాటర్ గారూ కడుపులో తెగ నొప్పిగ వుంది. నిన్న రేతిరి నాలుగయిదుసార్లు బయటికి వెళ్ళాల్సివచ్చింది' అన్నారు ఆయన. నేను మామూలు పరీక్షచేసి ఎందుకయినా మంచిదని, ఈసారి అయినపుడు కొంత హాస్పిటల్‌కి పంపించండి. పరీక్ష





చెయ్యాలి' అన్నాను.

ఆయన తలూపాడు.

తర్వాత వెళ్తూ అన్నాడు 'ఈరాత్రి చేత ఆవు నెయ్యి పంపిస్తా'నని.

ఇంకో నిమిషం తర్వాత ఆయన తిరిగివచ్చి అడిగాడు. 'దేంట్లో పంపమంటారు' అని. 'చెంబులో పంపించండి' అన్నాను.

నేను హాస్పిటల్ వదిలే టైముకి పెదకాపుగారి పాలేరు ఒక చెంబును గుడ్డతో కప్పి తీసికొని వచ్చాడు. కాంపౌండర్ తో 'స్టూల్స్ ఎగ్జామ్' చేయించమని పురమాయించి యింటికి వచ్చాను.

భోజనం టైంలో 'అన్నట్లు పెదకాపుగారు ఆవు నెయ్యి పంపారు ఇప్పుడే. తీసికొని వస్తా' అంటూ కమల ఇంకో చెంబు తీసికొని వచ్చింది. దానిమీద కూడా గుడ్డ వుంది. గుడ్డ తీశాం....' అని చెప్పి మూర్తి ఆగాడు.

కమల ఫకాలున నవ్వింది.

'క్లాస్‌మేట్ మూర్తీ! వతాక సన్నివేశం ఇద్దే ఊహించవచ్చు. అదే సినిమా తీస్తే 'చెంబుల తారుమారు' అని పేరెట్టవచ్చు' అన్నాడు సుబ్బారాయుడు నవ్వుతూ.

పెదకాపుగారు నెయ్యిని గురించి అడుగుతున్నారని చెంబులో పంపించమన్నా. కాని ఆయన వేరే అర్థం చేసుకొని రెండూ చెంబులలోనే పంపించాడు' అన్నాడు మూర్తి కూడా నవ్వుతూ.

రాత్రి నిద్రపోతుంటే సుబ్బారాయుడు వెంకట్రావుని అడిగాడు.

'నీ స్పీచ్ తయారుచేశావా' అని.

'ఫామిలీ ప్లానింగ్‌కి ఇన్ని పద్ధతులున్నాయని ఇవ్వాళే తెలిసింది' అన్నాడు వెంకట్రావు.

'వెరీ గుడ్. వాటినే స్పీచ్‌గా రాసేయి ముందు' అన్నాడు సుబ్బారాయుడు

'రేపు చేస్తా ఆ పని. నువ్వేం చేశావ్ ఇవ్వాళ' అన్నాడు వెంకట్రావు.

'రవిగారితో బాతాఖానీ కొట్టా. ఇంకో కాంతి కిరణం కనపడింది మన చీకటిలో' అన్నాడు సుబ్బారాయుడు నవ్వుతూ.

## 8

దగ్గువల్లి ప్రక్కఊరిలో ఉన్న సినిమా టూరింగ్ టాకీసు మామూలు టూరింగ్ టాకీసుల కన్న ఒక్కరవ్వ తక్కువే. అంటే ప్రతి రీలు అవ్వగానే 'రివైండింగ్' చెయ్యడానికి పది నిమిషాలు సినిమా కార్యక్రమం ఆపివేయబడుతుంది.

రెండున్నర గంటల సినిమా. అందుచేత దగ్గరదగ్గర నాలుగు గంటలు పడుతుంది పూర్తవడానికి.

ఒక్కొక్కసారి రీల్సు తారుమారు అయ్యి హీరో వీరమరణం ముందర, హీరోయిన్‌తో వరుగు వందాల ప్రణయ గీతాలు (అంటే చెట్ల పుట్టలను చూస్తూ పరిగెత్తుతూ కసరత్తు చేస్తూ పాడేపాటలన్నమాట) తర్వాత కూడా చూడొచ్చు. కాని మన పల్లెసీమ జనాభా మేథాసంపన్నులు. అలా జరిగిన అది 'ఫ్లాష్‌బేక్'గా అన్వయించుకొని కథను అర్థం చేసికొంటారు.

'పదహారేళ్ళ వయస్సు' సినిమా 'ఫ్లాష్‌బేక్'తోటే ప్రారంభమవుతుంది

'తప్పురీలు ఏమిట్రా' అన్నాడు పేంటు వేసుకొన్న ఓ ఆసామీ బెంచీ క్లాసులో ప్రక్కన కూర్చున్న ఇంకో బుష్‌కోట్‌తో.

'కాదురా అసలు కథే అంత. నేను కాకినాడలో ఇదివరకు చూశాను' అంది బుష్‌కోటు'.

కుర్చీ క్లాసులో ఆఖరి వరసలో దమయంతి,రవి కూర్చున్నారు.

దమయంతి ద్వారంకి వెయ్యబడిన జంబుఖానా కేసే చూస్తోంది.

జంబుఖానా పురాతన కాలంది.

అక్కడక్కడా చిల్లులు కూడా వున్నాయి.

కాని దమయంతి ఆసక్తి జంబుఖానామీద కాదు. వెంకట్రావు వస్తాడేమో అని ఆశ.

హీరోయిన్ హీరో కోసం రోజా పైలు చూడడం కమామిషూ అయ్యేటప్పటికి పది నిమిషాలయింది.

ఇంకా వెంకట్రావు రాలేదు.

తెరమీదకి చంద్రమోహన్ వచ్చాడు.

ఇక వెంకట్రావు రాడని నిర్ధారణ చేసికొని సినిమా చూడడం ప్రారంభించింది దమయంతి.

చంద్రమోహన్ సినిమాలో చేతికందని కోడిపుంజు పట్టుకోడంతో దర్శనం ఇస్తాడు ఆ సినిమాలో. చంద్రమోహన్ హీరో అంటే పిక్చర్‌లో ఇంటర్వల్ దాకా(అంటే టూరింగ్ సినిమాల ఇంటర్వెల్ కాదు. మంచి సినిమా హాలులో యిచ్చే ఒక్క ఇంటర్వెల్) ఓ పాత పంచితోనో, నిక్కర్‌తోనో వుంటాడు-గడ్డం అదీ చేసికోకుండా.

మీ అదృష్టం బాగుండకపోతే ఓ కాలో చెయ్యో అవిటో లేకపోతే గుడ్డో కూడా అవ్వొచ్చు.

ఆ పాత్రలోని అమాయకత్వం, మంచితనం ప్రేక్షకుల్ని ముఖ్యంగా స్త్రీ ప్రేక్షకుల్ని ఆకట్టుకొంటుందని అటువంటి సినిమాలు తీసే ప్రొడ్యూసర్స్ నిశ్చిత అభిప్రాయం.

చూసేవాళ్ళ అదృష్టం బాగుంటే పతాక సన్నివేశంలో ఏ ఎలక్ట్రిక్ షాక్ తగిలో అవిటితనం లేక గుడ్డితనం పోయి శుభ్రంగా 'శుభం' వేళ కన్పిస్తాడు చంద్రమోహన్.

దమయంతికి అత్యంత అభిమాన నటుడు చంద్రమోహన్. ఆఖరికి చంద్రమోహన్ వేసిన పాత్ర సినిమా మొదటి నుంచి చివర వరకూ గోచీ గుడ్డలో వున్నా దమయంతి అభిమానం రవ్వంత కూడా తగ్గదు.

అందులో ఆ సినిమా కథ అంతా పల్లెటూరులో జరుగుతుంది.

హీరోయిన్ని మోసపుచ్చిన డాక్టర్ పాత్రకి, వెంకట్రావ్‌కి పోలికలు లేకపోయినా ఆ రోజు సినిమాకు వస్తానని రాకపోవడం దమయంతికి వెంకట్రావ్‌మీద కొద్దిగా కోపం కలిగించింది.

చంద్రమోహన్ పాత్రకి, తన ప్రక్కన కూర్చొన్న రవికి మాత్రం స్వభావంలో చాలా పోలికలున్నాయి.

సినిమాలో చూపిస్తున్న కొన్ని సంఘటనలు దమయంతి జీవితంలో కూడా జరిగాయి.




రవీ, దమయంతుల చిన్నప్పుడు తోటలో చెట్టుకి కాసిన పండిన మామిడిపళ్ళు ఎవరికీ తెలియకుండా కోసి రవి దమయంతికిచ్చేవాడు.దమయంతి కాకినాడలో చదివేటప్పుడు వారానికి రెండుసార్లయినా దగ్గుపల్లినుంచి దమయంతికితల్లిచేసిన స్వీట్స్, అవీ పట్టుకెళ్ళి దమయంతికి హాస్టల్‌లో ఇస్తూ వుండేవాడు.

ఒకసారి దమయంతి తల్లి 'పోనీ రవిబావని పెళ్ళిచేసుకోవా' అని అంటే 'ఈ చదువులేని మొద్దునా' అని దమయంతి అంటే రవి తల వంచుకొనడం కూడా సినిమా చూస్తుంటే దమయంతికి గుర్తుకు వచ్చింది. తన జీవితమే సినిమాగా తీశారా అన్పించింది దమయంతికి ఆ సినిమా చూస్తున్నంతసేపూ.

అందులో చంద్రమోహన్ హీరో.

పదిగంటలకి సినిమా అయింది.

జట్కాలో దగ్గుపల్లికి తిరిగి బయలుదేరారు.

అయిదు నిమిషాలు నిశ్శబ్దం తాండవించింది జట్కాలో. జట్కావాడు గుర్రాన్ని అదమాయించడం తప్పిస్తే.

'బావా! సినిమా బాగుంది కదూ' అంది దమయంతి

'ఊ' అన్నాడు రవి అలా రోడ్‌కేసి చూస్తూ

'ఆ డాక్టర్‌లాటి వ్యక్తులుంటారా నిజ జీవితంలో' అంది దమయంతి.

'ఎందుకు ఉండరు? ఆ డాక్టర్‌లాటి వాళ్ళూ ఉంటారు. హీరో, హీరోయిన్‌లాటి వాళ్ళూ ఉంటారు. కాని సినిమాకాబట్టి హీరో హీరోయిన్‌లని కలిపారు. నిజ జీవితంలో అలాగ జరగదు' అన్నాడు రవి నిట్టూరుస్తూ.

దమయంతి రవికేసి ఒక క్షణం చూసింది.

'అమ్మాయిగోరు కాస్త ఎనక్కి కూకోండి. గుర్రంమీద మోపు ఎక్కువయింది' అన్నాడు జట్కావాడు.

దమయంతి వెనక్కి జరిగింది.

'బావా! నువ్వు పెళ్ళి చేసేసుకో' అంది దమయంతి.

'అదొక్కటే తరవాయి. అయినా నా లాటి చదువులేని మొద్దుని చేసికొనేది ఎవరులే' అన్నాడు రవి మెల్లగా.

'ఛీ! ఏదో తమాషాకి చిన్నప్పుడు నేను అలా అన్నా. నీకేం తక్కువ' అంది దమయంతి.

'చిన్నప్పటినుంచి కలిసి పెరిగాం. ఇంకో నెలలో నువ్వు ఇంకో ఇంటిదానివి అయి ఈ వూరు వదిలేస్తావు అన్పించినపుడు నాకు అదోలా అవుతుంది దమయంతీ' అన్నాడు రవి.

దమయంతి తల వంచుకొంది.

'రేపు వెంకట్రావ్‌గారు మీటింగ్‌లో మాట్లాడుతారట' అన్నాడు రవి.

'ఊ! అవునుగాని ప్రొద్దున కాకినాడ ఎందుకువెళ్ళావ్' అంది దమయంతి.

'మామయ్య కోళ్ళతిండి కొత్తది వచ్చింది మార్కెట్లో. సుబ్బారాయుడుగారు చాలా మంచిది రాజాకి పెట్టమని చెప్పారు-దాని కోసం వెళ్ళాను. అన్నట్లు నీ కిష్టమని తెచ్చాను కోటయ్య కొట్టునుంచి కాజాలు' అని సంచీలోంచి పొట్లం దమయంతికి

యిచ్చాడు.

దమయంతి కళ్ళలో నీరు తిరిగింది.

ఆ రోజే వెంకట్రావ్ ముఖ్య అతిథిగా జరగబోయే ఫామిలీ ప్లానింగ్ మీటింగ్.

ప్రొద్దున లేచినదగ్గర్నుంచి వెంకట్రావ్ దిగులుగా ఉన్నాడు.

'ఏం! కామ్రేడ్! స్పీచ్ రెడీ అయిందా' అన్నాడు సుబ్బారాయుడు కాఫీ తాగుతూ.

'నిన్న ప్రొద్దున నుంచి ఆ ప్రయత్నంలోనే వున్నాను. ఫామిలీ ప్లానింగ్ పద్ధతులకి మోటివేటర్స్ నైపుణ్యానికి ఎలా సంబంధం కలపాలో అని ఆలోచిస్తున్నాను. అంతా అయోమయంగా వుంది' అన్నాడు వెంకట్రావ్ తను తాగిన కాఫీ కప్పు క్రిందపెడ్తూ.

'ఎందుకోయ్. చిన్న ఉపన్యాసం ఇవ్వడానికి అంత వర్రీ అవుతావ్. మన మంత్రులను చూసి బుద్ధి తెచ్చుకో. అద్వైతం నుంచి అణ్వస్త్రాల వరకు ఏ సబ్జక్ట్ మీద అయినా అనర్గళంగా అరగంట ఉపన్యాసం అప్పుడే యిమ్మంటే యిస్తారు. మొన్న బెజవాడలో ఒక మంత్రిగారు చెడుగుడు టోర్నమెంటు ప్రారంభిస్తూ చెడుగుడు ఆటని, ఇరవైసూత్రాల పథకాన్ని ఎంతో చాకచక్యంగా అన్వయించి చివర-'కనుక సోదరులారా మనం అంతా శ్రీమతి ఇందిరా గాంధిని బల పర్చాలి అని ముగించాడు. ఆయన నీలాగే దిగాలుపడ్డాడా?

'నీకు చిన్న ఉపన్యాసం అన్పించవచ్చు. నేను మంత్రిని కాను. ఇది నా పాలిటి యమగండంలా తయారయింది. బాబ్బాబు నీకు పుణ్యం ఉంటుంది. నా బదులు నువ్వే ఉపన్యాసం ఇచ్చేయి. నాకు సడన్‌గా జ్వరం వచ్చిందని చెప్పి యింట్లోనే కూర్చుంటా' అన్నాడు వెంకట్రావ్ బతిమాలుతూ.

'అలా జరిగేందుకు అవకాశం లేదు మై డియర్ వాట్సన్. నువ్వు డాక్టర్ గారింట్లోనే బిచాణా వేశావు- పైగా నీ పేరు ముఖ్య అతిథిగా వేసి కరపత్రాలు కూడా పంచి పెట్టారు మీటింగ్ కోసం. ఆఖరి క్షణంలో ఉత్తరకుమారుడిలా



లోక ముదిరావంటే నువ్వు. నీ పేరు సూచించిన నేను, మీ కాబోయే మామగారి పార్టీ అందరం చిన్నబోవాలి. బి బ్రేవ్. కావలిస్తే ఉపన్యాసానికి పాయింట్లు చెప్తా రాసుకో, రాసుకొని బట్టీవేసి వేదికమీద అప్పచెప్పేయి' అన్నాడు సుబ్బారాయుడు.

'సరే' అంటూ వెంకట్రావ్ పెన్, కాగితాలు తెచ్చాడు.

'భారత దేశం జనాభా ఇప్పుడు 680 మిలియన్లు లేక అరవయిఎనిమిది కోట్లు. ఈ శతాబ్దం చివరికి వెయ్యిమిలియన్లు లేక 100 కోట్లు అవుతాం. ఇప్పటిలా జనాభా పెరుగుదల అయితే వందకోట్ల జనాభా బతకాలంటే కనీసం రెండువందల మిలియను టన్నుల ఆహార ధాన్యాలు కావాలి. అంటే వచ్చే రెండు దశాబ్దాలలోనూ మనం ఆహార ఉత్పత్తి సుమారు రెట్టింపు చెయ్యాలి. పైగా ఎన్నో హాస్పిటల్స్ తెరవాలి. వేల కొద్దీ స్కూళ్ళు తెరవాలి. లక్షల కొద్దీ ఉద్యోగాలు కలుగ జేయాలి. ఇవన్నీ చెయ్యడానికి మన దేశానికి స్తోమత లేదు. కనుక పరిమిత కుటుంబం ఒక్కటే మన సమస్యలకి పరిష్కారం. రాశావా' అన్నాడు సుబ్బారాయుడు.

'ఒకె'

'ఇక మీటింగ్ ప్రధాన ఉద్దేశానికి వద్దాం. ఈ చుట్టు ప్రక్కల ప్రజల్లో కుటుంబ నియంత్రణ గురించి చైతన్యం కలిగించిన మోటివేటర్స్‌కి జోహార్లు అర్పించు. వాళ్ళే కుటుంబ నియంత్రణ పథకం అమలు పరచడానికి వెన్నెముకలు అను ఎందుకంటే వాళ్ళు కేసులు తెస్తేనేకదా డాక్టర్లు ఆపరేషన్స్ చేసేది-అఫ్‌కోర్సు! వాళ్ళు ఎలాటి పద్ధతులు అవలంభించారు అన్నది మనకు అనవసరం, ఉపన్యాసం రక్తి కట్టాలంటే ఒక కథ చెప్పు' అని ఆగాడు సుబ్బారాయుడు సిగరెట్ వెలిగిస్తూ.

'అనవసరం.... ఊ చెప్పు'.

'ఏమిటి అనవసరం. కథా' అన్నాడు సుబ్బారాయుడు.

'కాదురా నువ్వు చెప్పింది రాస్తున్నా-మనకు అనవసరం అన్నావు కదా' అన్నాడు వెంకట్రావ్.

'పూర్వరి ఒక గుడ్లగూబ ఉండేది అది చాలా తెలివైనది. అందుచేత చుట్టుప్రక్కల పక్షి, జంతు సముదాయానికి ఏం కష్టాలు వచ్చినా ఆ గుడ్లగూబ సలహాతీసికొంటూ వుండేది. అక్కడే ఒక ఎలుక కుటుంబం ఉండేది. ఒక పిల్లి ఆ ఎలుక కుటుంబంలోని పిల్లల్ని ఎప్పుడూ ఫలహారం చేస్తుంటే తండ్రి ఎలుక గుడ్లగూబని సలహా అడిగింది ఆ పిల్లి బాధ తప్పించే ఉపాయం చెప్పమని గుడ్లగూబ ఒక నిమిషం ఆలోచించి- 'ఏముందీ, సులభం. మీరు పిల్లుల్లా ప్రవర్తించండి. అప్పుడు ఆ పిల్లి మిమ్మల్ని పిల్లులు అనుకుని దగ్గరకు రాదు' అని సలహా యిచ్చింది.

'ఎలుకలు పిల్లులు ఎట్లా అవుతాయి' అన్నాడు వెంకట్రావు.

'సరిగ్గా అదే ప్రశ్న తల్లి ఎలుక వేసిందట. తండ్రి ఎలుక మళ్ళా గుడ్లగూబ దగ్గరకి వెళ్ళి ఈ సందేహం వెలిబుచ్చిందిట. అప్పుడు గుడ్లగూబకి కోపం వచ్చి 'సలహా చెప్పటం వరకే నావంతు, ఆచరణలో పెట్టడం మీ బాధ్యత' అందిట.

'కథకు, మీటింగ్ కూ?....'

'సంబంధం ఏమిటి అంటావు. ఎలిమెంటరీ మై డియర్ కామ్రేడ్. కుటుంబ నియంత్రణ జరగాలని ఢిల్లీ నుంచి దగ్గుపల్లి నాయకుల దాకా అందరూ సలహా యిస్తారు గుడ్లగూబ లాగా. కాని ఆచరణలో పెట్టించడానికి కొన్ని ట్రిక్స్ వెయ్యాలి. అది ఈ మోటివేటర్స్ సాధించారు. అందుచేత వాళ్ళు గొప్ప వాళ్ళు. ఈ కాస్త ఉపన్యాసం ఇస్తే పది నిమిషాలయిపోతుంది. తర్వాత నీకు వేసిన దండలో పూలు లెక్కపెడుతూ కూర్చోవడమే నీ పని' అన్నాడు శుబ్బారాయుడు.

వెంకట్రావు రాసిన కాగితాలు తీసికొని పెరట్లో చెట్టు క్రిందకు వెళ్ళి స్పీచ్‌ని భట్టీ వెయ్యడం మొదలు పెట్టాడు

భోజనం టైంకి మూర్తి హాస్పిటల్ నుంచి వచ్చాడు. పెరట్లో చెట్ల క్రింద కాగితం చేత్తో పట్టుకుని పచార్లు చేస్తున్న వెంకట్రావుని చూసి శుబ్బారాయుడుతో అన్నాడు 'ఏమిటి! వెంకట్రావుగారు ఉపన్యాసం భట్టీ పడుతున్నట్లున్నారు.'

'నో! నో! అలాటిదేమీ లేదు. వాడు పెర్‌ఫెక్షనిస్ట్. ఏ మాట ఎలా ఉచ్చరిస్తే 'ఇఫెక్టివ్'గా వుంటుందో చూస్తున్నాడు. విన్‌స్టన్‌చర్చిలుగారు కామన్స్‌లో స్పీచ్ ఇవ్వాలంటే థేమ్సనది ఒడ్డుకి వెళ్ళి రిహార్సలు వేసేవారట. అలాగే వీడూనూ' అన్నాడు శుబ్బారాయుడు వెంకట్రావుని సమర్థిస్తూ.


'ఏమో! నాకు మాత్రం బోనులో ఎలకలా కన్పిస్తున్నారు' అన్నాడు మూర్తి నవ్వుతూ.

'అది సరే మూర్తి. మీ యింట్లో ఏవయినా హార్డ్‌డ్రింక్స్ వున్నాయా. వీడికి లెక్చర్ ముందు ఒక పెగ్ వేసికోవడం అలవాటు' అన్నాడు శుబ్బారాయుడు నెమ్మదిగా.

'హాఫ్ బాటిల్ జిన్ వుంది. క్రితం వారమే యానాం నుంచి తెప్పించా. డ్రాయింగ్ రూమ్ అలమారులో పై అరలో వుంది' అన్నాడు మూర్తి.

వెంకట్రావు భోజనం ఏదో కతికి మళ్ళీ చెట్టుక్రిందకు వెళ్లాడు.

మూర్తి హాస్పటలుకి వెళ్తూ అన్నాడు 'మీటింగ్ అయిదు గంటలకి. నాకు యింటికి తిరిగి రావడానికి కుదరదు. మీరిద్దరూ అక్కడకే తిన్నగా వచ్చేయండి.'




మూడు గంటలు దాటింది.

శుబ్బారాయుడు డ్రస్ చేసికొని చెట్టు క్రింద తిరుగుతున్న వెంకట్రావుతో అన్నాడు: 'కామ్రేడ్! నేను మునసబు గారింటికి వెళ్ళి ఆయన, దమయంతిలతో సహా మీటింగ్‌కి తిన్నగా వస్తాను. నువ్వు నాలుగుముప్పావు ప్రాంతాలకి హాస్పటల్ ఆవరణలోకి రా.'

'లాభం లేదురా శుబ్బారాయుడూ. ఇంత భట్టీ వేసినా అన్నీ మరుక్షణంలో మరిచిపోతున్నా' అన్నాడు వెంకట్రావు దిక్కుమొహం వేసి.

'డోంట్ వర్రీ. వేదిక ఎక్కేటప్పటికి అవ్వే గుర్తుకు వస్తాయి. అంతగా కాస్త ధైర్యంకావాలంటే ఓ డోస్ పుచ్చుకో. డ్రాయింగ్ రూమ్ అలమారులో వుంది సీసా' అని ధైర్యం చెప్పి వెళ్లాడు శుబ్బారాయుడు.

మునసబుగారిని, దమయంతిని, దమయంతి తల్లిని, రవిని హాస్పటల్ గేట్ దగ్గర వదలి నాలుగు ముప్పావుకి శుబ్బారాయుడు ఇంటికి వచ్చాడు వెంకట్రావ్ పరిస్థితి ఎలా వుందో చూద్దామని.

వెంకట్రావ్ యింట్లో లేడు.

'మన ముఖ్య అతిధి ఏమయ్యాడు' అన్నారు శుబ్బారాయుడు కమలతో.

'అయిదు నిమిషాల క్రితం హాస్పటల్ వైపు వెళ్ళారు' అంది కమల.

'నువ్వు రావడం లేదా!'

'నేను తర్వాత వస్తాను. నాకు ఉపన్యాసంఅంటే బోర్' అంది నవ్వుతూ కమల.

శుబ్బారాయుడు వెళ్తూ అలమరులో సీసా పరీక్ష చేశాడు. మొత్తం సీసా ఖాళీ అయింది.

'మై గుడ్‌నెస్: కమలా! వీడు మంచినీళ్ళు ఏమీ అడగ లేదా నిన్ను' అన్నాడు శుబ్బారాయుడు.

'లేదు. కాని బీర్ గ్లాసులు మీ యింట్లో ఉన్నయ్యా అని అడిగితే అరగంట క్రితం బీర్‌గ్లాస్ యిచ్చాను' అంది కమల.

'హాఫ్ బాటిల్ జిన్ బీర్‌లా తాగేశాడన్నమాట. దట్ టూ ఆన్ ప్రాక్టికల్లీ ఎమ్టీ స్టమక్. వెధవకి జిన్‌కి, బీర్‌కి తేడా తెలుసు అనుకొన్నాను ఎంత తాగుడు అంటే యిష్టపడక పోయినా' అనుకున్నాడు శుబ్బారాయుడు హాస్పిటల్‌కేసి గబ గబ నడుస్తూ.

శుబ్బారాయుడు మీటింగ్ స్థలానికి వెళ్ళేటప్పటికి రెండు వందల మంది దాకా జనం పోగయ్యారు అప్పటికే.

అప్పటికే వేదికమీద వెంకట్రావ్, మునసబు, కరణం, మూర్తి, శాస్త్రిలు కూర్చొని వున్నారు.

వెంకట్రావ్‌కి రెండు ప్రక్కలా మునసబు, కరణం కూర్చొన్నారు.

శుబ్బారాయుడు వెంకట్రావ్‌కేసి పరీక్షగా చూశాడు.

వెంకట్రావ్ చాలా ఉత్సాహంగా ఏవో కబుర్లు చెప్తు

న్నాడు ఇద్దరితోటి.

ఇంతలో మీటింగ్ ప్రారంభమయింది.

సుబ్బారాయుడు వెళ్ళి మొదట వరసలో చివరి కుర్చీలో కూర్చొన్నాడు.

ఒక నర్స్ ప్రార్థనాగీతం పాడింది.

మూర్తి మీటింగ్ ప్రాముఖ్యతను వివరించి మోటివేటర్స్‌ని పరిచయం చేశాడు.

మోటివేటర్స్ అయిదుగురు కూడా వేదికమీద ఆసీనులయ్యారు.

తర్వాత ముఖ్య అతిథి ఉపన్యాసం.

వెంకట్రావ్ కుర్చీలోంచి లేచాడు.

తూలిపోతుంటే మైక్‌ని పట్టుకొని దగ్గరకు లాక్కొన్నాడు.

ఒక్క నిమిషం అటూ, యిటూ చూశాడు.

ప్రేక్షకులు అంతా నిశ్శబ్దంగా ఉన్నారు.

మునసబుగారి ఉత్తరీయం తీసికొని భుజంమీద వేసుకొన్నాడు.

జనం అంతా మందహాసం చేశారు.

కరణంగారి దగ్గర్నించి చేతి కర్ర లాక్కొని చేతిలోకి తీసికొన్నాడు.

ఈసారి జనం నవ్వారు.

గొంతుని సవరించుకొని అన్నాడు వెంకట్రావ్.

'సోదర సోదరీమణులారా భారతదేశం జనాభా 680 కోట్లు లేక 68 మిలియనులు. ఈ శతాబ్దం చివరకి వెయ్యికోట్లు లేక వంద మిలియన్లు అవుతుంది. కోటికి మిలియన్లు ఎంతో మీకు తెలియకపోతే నాకు తెలియదు. మా సుబ్బారాయుడికి మాత్రం తెలుసు. అదుగో అక్కడ వున్నాడు.'

వెంకట్రావు చమత్కారానికి అందరూ నవ్వారు.

'ఏది ఏమయినా మన జనాభా పెరుగుతోంది మునసబుగారి మీసాల్లా.'

కరణంగారి పార్టీ కరతాళ ధ్వనులు చేశారు.

'ఈ పెరిగే జనాభాకి తిండి పెట్టాలంటే మనం రెండు వందల కోట్ల టన్నుల ఆహార ధాన్యాలు ఉత్పత్తి చెయ్యాలి. వచ్చే రెండు దశాబ్దాలలోనూ అది అంత సులభం కాదు. కరణంగారి నెత్తిమీద వెంట్రుకలు మొలిపించడం అంతకన్నా సులభం' అన్నాడు వెంకట్రావు కరణంగారి బట్టతల నిమురుతూ.

ఈసారి మునసబుగారి పార్టీ జనం హర్షధ్వానాలు చేశారు.

'సరే! ఒక కథ చెప్తాను. పూర్వం ఒక గుడ్లగూబ ఉండేదిట. అందరికీ అడక్కుండా సలహాలు యిచ్చేదిట. మన మునసబుగారిలా.'

మునసబుగారి మొహం ఎర్రబడుతోంది.

జనం చప్పట్లు కొట్టారు.

'అక్కడే ఎలక దంపతులు ఉండేవిట- మన మోటివేటర్స్‌లాగ. ఓ పిల్లికూడా ఉండేదిట- కరణంగారిలాగ' జనం మళ్ళా చప్పట్లు కొట్టారు.

కరణంగారు మొహం చేతుల్తో కప్పుకొన్నారు.

'కరణంగారు మోటివేటర్స్‌ని తినేవాడుట. అప్పుడు వాళ్ళు మునసబుగారి దగ్గరకి వెళ్ళారుట సలహా కోసం. తర్వాత ఏమయిందో గుర్తులేదుకాని చివరకి మునసబు గారన్నారట 'నేను ఉపాయం చెప్తాకాని ఆచరణ మీది' ఇంతకీ చెప్పొచ్చేదీ ఏమిటంటే ఈ మోటివేటర్స్ ఆచరణలో పెట్టారు. ఎలా చేశారో నన్ను అడగకండి. అదుగో అక్కడ కూర్చున్న సుబ్బారాయుడు....' అని ఆగాడు వెంకట్రావు.

సుబ్బారాయుడు అప్పటికే కుర్చీ ఖాళీచేసి వేదిక వెనక భాగానికి వెళ్ళాడు.

'అది సరే. ఇంకో రెండు రోజుల్లో కోడి పందాలు జరుగుతాయి. మునసబుగారి కోడికీ, కరణంగారి కోడికీ. వాళ్ళిద్దరూ ఆ కోళ్ళమీద ఎంత శ్రద్ధ తీసికొంటున్నారో దానిలో పదో వంతు మనుష్యులమీద తీసికొంటే ఈ ఊరికి జనాభా సమస్య ఉండదు. నాకు తెలియక అడుగుతా కరణంగారి పుంజు పెట్ట వెనకాల పడబోతే కరణంగారి భార్య వెనకాలపడ్తుందా? దానికి మందు కావాలి.'

మునసబుగారి పార్టీ అంతా పందిరి ఎగిరిపోయేలా చప్పట్లు కొట్టారు ఆ మాటలకి.


'మునసబుగారి కోడి కొక్కొరొకో అని మూడు సార్లు బదులు రెండుసార్లు మాత్రం అరిస్తే డాక్టరు కావాలి. ఆయనే కూస్తేపోలా మూడోసారి.'

ఈసారి కరణంగారి పార్టీ అంతా 'కొక్కొరొకో' అని అరిచారు.

'ఆఖరి మాట మీరంతా 'పదహారేళ్ళ వయస్సు' చూడండి' అని కూర్చున్నాడు వెంకట్రావు.

జనం అంతా రెండు నిమిషాలసేపు చప్పట్లు కొట్టారు. మునసబుగారి ఉత్తరీయం కరణంగారికి, కరణంగారి చేతికర్ర మునసబుగారికీ ఇచ్చాడు.

జనం మళ్ళా ఘొల్లుమని నవ్వారు.



ఇంకో నిమిషంలో కుర్చీ వెనక్కి ఆనుకొని కళ్ళు మూసుకొన్నాడు వెంకట్రావు.

అది కూడా జోక్‌గా తీసికొని జనం మళ్ళా నవ్వారు. కరణంగారిచేత, మునసబుగారిచేత మోటివేటర్ని కి సన్మానం చేసిన తర్వాత మూర్తి వందన సమర్పణతో మీటింగ్ ముగిసింది.

దగ్గుపల్లికి చిన్న, పెద్ద తరహా రాజకీయ నాయకులు తరుచు వస్తూనే ఉంటారు.

కాని ఏ నాయకుడువచ్చినా ఆయన కరణంగారి పార్టీయో లేక మునసబుగారి పార్టీయో అయి ఉంటాడు కాబట్టి వాళ్ళు కరణంగారిని కాని, మునసబుగారిని కాని పొగుడ్తూ ఉపన్యాసాలిచ్చేవారు.

కాని ఒకే వేదిక మీద ఇద్దర్నీ నిశితంగా విమర్శించిన ఘనత వెంకట్రావుకే ప్రప్రథమంగా దక్కింది ఆ ఊళ్ళో ఆ రోజు.

రెండు పార్టీల జనాన్ని ఒకేసారి ఆనందపరిచిన ఖ్యాతి కూడా ఆ రోజు వెంకట్రావు పరమయింది.


మీటింగ్ అవ్వగానే సుబ్బారాయుడు వేదిక మీదకి వచ్చి 'వాడికి ఒంట్లో బాగుండ లేదండీ' అని మునసబు, కరణాలకి చెప్పి వెంకట్రావుని లేపి హాస్పిటల్‌లో మూర్తి గదికి నడిపించుకొని తీసికొని వెళ్ళాడు.

పది నిమిషాల తర్వాత మూర్తి, శాస్త్రి నవ్వుతూ మూర్తి గదిలోకి వచ్చారు.

వెంకట్రావు ఆపరేటింగ్ టేబిల్ మీద పడుకుని గురకలు పెడ్తున్నాడు.

'ఫెంటాస్టిక్ మీ ఫ్రెండ్' అన్నాడు మూర్తి సుబ్బారాయుడి కేసి చూసి నవ్వుతూ.

'స్పీచ్ ఎలా వున్నా ముసలాళ్ళిద్దర్నీ బాగా ఎగతాళి చేశారు' అన్నాడు శాస్త్రికూడా నవ్వుతూ.



'మొత్తంమీద మీటింగ్ 'గ్రేండ్ సక్సెస్' అన్నాడు మూర్తి.

'ఇంకా సక్సెస్ అవ్వాల్సింది చాలా వుంది' అన్నాడు సుబ్బారాయుడు నవ్వుతూ.

మూర్తి, శాస్త్రులు ఆ మాటలు అర్థమవ్వకపోయినా నవ్వారు.

'ఛీ! నా గౌరవమంతా మట్టిపాలు చేశాడు అల్లుడుగారు' అంటూ ఉత్తరీయం మడత మంచంమీదకు విసరి వీధిగదిలో పడకకుర్చీలో కూలబడ్డారు మునసబుగారు.

దమయంతి, మునసబుగారి భార్య, రవికూడా ఆయన వెనక్కాలే మీటింగ్ నుంచి యింటికి వచ్చారు.

'ఆ కరణంగాడు వ్యంగ్యంగా అందరి ఎదుటా 'మంచి అల్లుడినే సంపాదించారు' అన్నాడు నాతో. తల తీసేసినంత పనయింది' అన్నారు మునసబుగారు కోపంగా.

'కరణంగారిని కూడా ఏడ్పించారుగదా వెంకట్రావ్ గారు' అని సమర్థించాడు రవి.

'అది వేరే సంగతి. నామీద కూడా కూతలు కూశాడుగా' అన్నారు మునసబు.

'సరే! అయిందేదో అయింది. మన కడుపు చించుకొంటే పడేది మన కాళ్ళమీదేగదా' అంది దమయంతి తల్లి లోపలకి వెళ్తూ. దమయంతికూడా ముభావంగా లోపలికి వెళ్ళింది.

తండ్రిని గురించి అందరి ఎదుట వెంకట్రావ్ అలా మాట్లాడడం దమయంతికి నచ్చలేదు.

పైగా కరణంగారి భార్య 'తప్పతాగి మాట్లాడినమాటలు అవి. వాటిని మనం లెక్కపెట్టకూడదు' అంది ఎవరితోనో దమయంతికి వినబడేలా మీటింగ్ అయిన తర్వాత.

దమయంతి చీర మార్చుకొందుకు పడకగదిలోకి వెళ్ళి తలుపు దగ్గరగా వేసి చీరవిప్పి మంచంమీదవున్న పాత చీర తీసింది.

ఆ పాతచీర క్రిందవున్న పాము పడగ ఎత్తింది. దాన్ని చూడగానే కెవ్వుమని అరిచింది దమయంతి.

మునసబుగారితో మాట్లాడుతున్న రవి వెంటనే పరిగెత్తి కొని వచ్చాడు పడకగదిలోకి 'ఏమయింది' అంటూ.

దమయంతి పాముని చూపించింది.

రవి వెంటనే ఆ పాము తోకను పట్టుకొని పైకితీశాడు. 'ఏం భయంలేదు. పెరట్లో దీన్ని చంపేసివస్తా' అన్నాడు రవి దమయంతి కేసి చూస్తూ.

ఇంకా లోపల పరికిణీలోనే వున్నానని దమయంతి గ్రహించుకొంది అప్పుడు.

రవి తనకేసి అలా చూస్తుంటే మొహం ఎర్రబడింది.

రవి పాముతో బయటికి వస్తుంటే మునసబుగారుకూడా 'ఏమిటి' అంటూ వచ్చారు.

'ఏం లేదు, పాము మంచంమీద వుంది' అంటూ పెరట్లోకి నడిచాడు రవి.

రెండు నిమిషాల తర్వాత లోపలికి వచ్చిన రవిని చూసి

అంది దమయంతి 'బావా! నా ప్రాణం కోసం నీ ప్రాణం అడ్డు వేశావు. చేతిలో కర్రయినా లేకుండా అలా ధైర్యం చెయ్యడమే' అని.

రవి గర్వంగా ముందు గదిలోకి వెళ్ళాడు.

దమయంతి చీర కట్టుకుని వంటగదిలోవున్న తల్లి దగ్గరకు వెళ్ళింది.

'నీ అదృష్టం బాగుంది. సమయానికి రవి ఉన్నాడు' అంది దమయంతి తల్లి హార్లిక్స్ గ్లాస్ అందిస్తూ.

దమయంతికి నిన్న చూసిన సినిమా, సినిమా నుంచి వచ్చేటప్పుడు రవి మాట్లాడిన తీరూ, రవి ఇచ్చిన కాజాలు, ఆ సాయంత్రం మీటింగ్, తర్వాత గదిలో పాము-ఇవన్నీ వరసగా కళ్ళ ముందరకు వచ్చాయి.

హార్లిక్స్ త్రాగి నెమ్మదిగా అంది దమయంతి :

'అమ్మా! బావ చాలా మంచివాడు'.

'ఏం! ఇప్పుడు తెలిసిందా' అంది ఆవిడ నవ్వుతూ.

'అది కాదు....నేనంటే బావకి చాలా యిష్టం....' అని ఆగింది దమయంతి.

'నేను ఎన్నిసార్లు చెప్పలేదు ఇదివరకు. నువ్వు, ఆయన వింటేగా' అంది ఆవిడ నిష్టూరంగా.

దమయంతి తల వంచుకుని కూర్చొంది ఎలా చెప్పాలా అని.

దమయంతి తల్లి కూతురు మనస్సు అర్థం చేసికొంది. మునసబుగారు ఇవ్వాళ ఎంత ధుమ ధుమలాడినా తర్వాత శాంతిస్తాడు.

వెంకట్రావ్ తండ్రి ఆయన ప్రాణ స్నేహితుడు. కేవలం ఇవ్వాళ వెంకట్రావ్ ప్రవర్తన ఆధారంగా పెళ్ళి ఆపు చెయ్యడని ఆవిడకు బాగా తెలుసు.

'సరేలే! పోయి పడుక్కో కాసేపు. అలిసిపోయావు' అంది ఆవిడ దమయంతితో.

## 10

ప్రొద్దున తొమ్మిది గంటలయింది.

మీటింగ్ అయిన తర్వాత హాస్పిటల్‌లో మూర్తి రూములో ఆపరేటింగ్ టేబిల్ మీద గురక పెట్టి నిద్రపోతున్న వెంకట్రావ్‌ని ఓ గంటయిన తర్వాత లేపి శుబ్బారాయుడు, మూర్తి యింటికి చేర్చి పడుకోబెట్టారు పడక గదిలో. అప్పుడు పడుకున్న మూర్తి రాత్రి భోజనానికి కూడా లేవకుండా నిద్రపోయి అప్పుడే లేచాడు.

'గుడ్ మార్నింగ్! కామ్రేడ్' అన్నాడు శుబ్బారాయుడు నవ్వుతూ వెంకట్రావ్ నిద్దరలేవడం చూసి.

వెంకట్రావ్ బద్ధకంగా ఒళ్ళు విరుచుకొని లేచి కూర్చొన్నాడు మంచం మీద.

'గుడ్ మార్నింగ్' అన్నాడు శుబ్బారాయుడు మళ్ళీ.

'తలపోటురా బాబూ' అన్నాడు వెంకట్రావ్ కణతలు నొక్కుకొంటూ.

'కాస్త హేంగోవర్-తప్పదులే - తీసికొన్నది ఒకటి రెండు చెమ్చాలు కాదుకదా' అన్నాడు శుబ్బారాయుడు.

'మీటింగ్ ఎలా అయింది' అని ప్రశ్నించాడు వెంకట్రావ్.

'ఎలా అవ్వడమేమిటి నీ మొహం, నువ్వేకదా మీటింగ్‌లో హీరోవి' అన్నాడు శుబ్బారాయుడు.

'అంటే?'

'రైట్ ఆనరబుల్ శ్రీనివాస శాస్త్రి బ్రతికి ఉండి నిన్న నీ స్పీచ్ విని వుంటే పబ్లిక్ స్పీకింగ్‌లో కొన్ని కొత్తపాఠాలు నేర్చుకొని ఉండేవాడు. డేల్ కర్నెగీ వినివుంటే 'ఎలిమెంట్స్ ఆఫ్ పబ్లిక్ స్పీకింగ్' రివైజ్డ్ ఎడిషన్ తయారు చెయ్యాలి అనుకుని ఉండేవాడు', అన్నాడు శుబ్బారాయుడు నవ్వుతూ.

'నేను మాట్లాడానా? నాకేం గుర్తులేదు. వేదిక ఎక్కి కూర్చున్నంతవరకూ మాత్రం గుర్తు వుంది' అన్నాడు వెంకట్రావ్.

'అయితే నిన్న నీ 'ఫెర్‌ఫారమెన్స్' అంతటికీ నీ 'సబ్-కాన్షస్'కి 'క్రెడిట్' యివ్వాలన్నమాట' అన్నాడు శుబ్బారాయుడు నవ్వుతూ.

'ఏం మాట్లాడేను' అన్నాడు వెంకట్రావ్ కుతూహలంతో.

'వింటావా మీ ఉపన్యాసం! నిన్న నా కేసెట్ టేప్ రికార్డర్‌లో టేప్ చేశాను' అంటూ టేప్ పెట్టాడు మూర్తి.

'ఇప్పుడు ముఖ్య అతిథి శ్రీ అట్లూరి వెంకట్రావ్‌గారు మాట్లాడుతారు' అది మూర్తి గొంతు.

తర్వాత ఒక నిమిషం నిశ్శబ్దం.

జనం నవ్వులు

మళ్ళీ నిశ్శబ్దం

జనం నవ్వులు మళ్ళీ


'సోదర సోదరీమణులారా....' వెంకట్రావ్ గొంతు.

వెంకట్రావ్ శ్రద్ధగా వింటున్నాడు.

'....పదహారేళ్ళ వయస్సు చూడండి'

మూర్తి టేప్ ఆఫ్ చేశాడు.

వెంకట్రావ్ మొహం వికసించింది టేప్ అంతా



విన్నాక.

'అది కేవలం నీ స్పీచ్ మాత్రమే. స్టేజి మీద నీ హావ భావాలు, చేతలు దీన్ని మించి జరిగాయి' అన్నాడు సుబ్బారాయుడు నవ్వుతూ.

'ఈ బ్లేక్ కాఫీ ముందర తీసుకోండి' అంటూ కమల కప్పుతో వచ్చింది గదిలోకి. కమలని చూసి వెంకట్రావ్ సిగ్గు పడ్డాడు.

'వెంకట్రావ్‌గారూ మీ స్పీచ్‌ని 'లైవ్'గా వినే అదృష్టం నాకు కలుగలేదు. సాధారణంగా ఉపన్యాసాలంటే నా కిష్టం ఉండదు. కానీ నిన్న మీటింగ్‌కి రాకుండా ఎంత 'మిస్' అయ్యానో వీళ్ళిద్దరూ చెప్పిన తర్వాత తెలిసింది. నిన్నరాత్రి ఈ టేప్ మూడుసార్లు విన్నాం' అంది కమల నవ్వుతూ.


'ఈ టేప్‌ని ఢిల్లీలో 'నేషనల్ మ్యూజియమ్'కి బహూమతి చెయ్యాలని నా ప్రతిపాదన. ముందుతరాల వాళ్ళకికూడా ఉపయోగిస్తుంది' అన్నాడు సుబ్బారాయుడు.

'సారీ సర్! మీ కేమీ ప్రోబ్లమ్స్ రావుకదా ఇక్కడ?' అన్నాడు వెంకట్రావ్ మూర్తితో.

'నో! నో! డోంట్ వర్రీ అబౌట్ దట్ స్కోర్-అయినా మీ నిష్పక్షపాత ఉపన్యాసం అందరినీ ఆకర్షించింది మునసబు, కరణాలని తప్ప. జనం చప్పట్లు విన్నారుగా. ఫామిలీ ప్లానింగ్ మీటింగులు 'డల్'గా వుంటాయని ఈపైనుంచి ఎవ్వరూ అనుకోరు ఇక్కడ' అన్నాడు మూర్తి నవ్వుతూ. బ్లాక్‌కాఫీతో రెండు సారిడన్ మాత్రలు మింగి స్నానం చేసి వచ్చినతర్వాత వెంకట్రావ్ మామూలు మనిషి అయ్యాడు.

'ఏరా! నీ ప్లాన్ భంగమయిందా నా ఉపన్యాసంతో' అన్నాడు వెంకట్రావ్ రహస్యంగా సుబ్బారాయుడితో.

'భంగమా! నీ పాత్ర నువ్వు చాలా చక్కగా పోషించావ్. ఇంత చక్కగా పోషిస్తావని నిజం చెప్పాలంటే నేను అనుకోలేదు కలలో కూడా. నువ్వేదో వేదికమీద మలేరియా రోగిలా గడగడ వణుకుతావు అని మాత్రమే అనుకొన్నాను. దాంతో మీ కాబోయే మామయ్యగారికి, సతీమణికి నీ మీద కొద్దిగా విముఖత కలుగుతుందని ఆశించా. యు ఫార్ ఎక్సీడెడ్ మై ఎక్‌పెక్టేషన్స్!' అన్నాడు సుబ్బారాయుడు ధైర్యం చెప్తూ.




'మా నాన్నకి రాస్తాడేమోరా' అన్నాడు వెంకట్రావ్ దిగులుగా.

'ఆయన, అంటే మీ మామగారు రేపు కోడి పందెం హడావుడిలో వుంటాడు. ఇంక రెండు, మూడు రోజుల వరకు ఆయనకు తీరిక ఉండదు' అన్నాడు సుబ్బారాయుడు.

సాయంత్రం సుబ్బారాయుడు మునసబుగారింటికి వెళ్ళాడు.

'వచ్చారా! మీ గురించే అనుకొంటున్నా. రాజా మంచి హుషారుగా వున్నాడు. 'కాక్‌ష్యూర్' బాగా తింటున్నాడు' అన్నారు మునసబు సుబ్బారాయుడిని ఆహ్వానిస్తూ.

సుబ్బారాయుడు మునసబు మొహంకేసి పరీక్షగా చూశాడు

నిన్న మీటింగ్ తాలూకు భావాలు ఏమయినా మిగిలి ఉన్నాయేమోనని.

ఆ విషయం పూర్తిగా మరిచిపోయినట్లే వున్నారు ఆయన.

ఆయన ధ్యాస అంతా మర్నాడు కోడి పందెం మీదే వుంది ఇప్పుడు.

ఇద్దరూ పెరట్లోకి వెళ్ళారు.

మునసబుగారు చెప్పినట్లుగానే రాజా హుషారుగా తిరుగుతున్నాడు పందిట్లో.

'ఎల్లయ్యా! 'కాక్ ష్యూర్' మళ్ళీ పెట్టావా' అన్నారు ఆయన పాలేరుతో.

'ఇప్పుడే తిందండీ' అన్నాడు ఎల్లయ్య వినయంగా.

'రేపు ఎన్ని గంటలకి పందెం' అన్నాడు సుబ్బారాయుడు మునసబుగారితో.

'పది గంటలకి'.

రెండు నిమిషాలు వేళ్ళతో లెక్కలు వేశాడు సుబ్బారాయుడు.

'రాత్రి పన్నెండు, ఒంటిగంటల మధ్య చెయ్యాలి' అన్నాడు సుబ్బారాయుడు.

'ఏమిటి' అన్నట్లు చూశారు మునసబు.

'తిధి నక్షత్రాల ప్రకారం అదీ ముహూర్తం'

'దేనికి ముహూర్తం' అన్నారు మునసబు.

'సరిగ్గా రాత్రి పన్నెండు ఒంటి గంటల మధ్య రాజాని చెరువులో స్నానం చేయించాలి. స్నానం అంటే ముఖ్యం మూడుసార్లు నీళ్ళలో ముంచాలి రాజాని' అన్నాడు సుబ్బారాయుడు గంభీరంగా.

'కోడికి స్నానం చేయిస్తే జలుబు చేస్తుందికదా' అన్నారు మునసబు అనుమానంగా.

'రేపు మీ రాజా చక్రవర్తిని ఓడించాలంటే ఇది ముఖ్యం.

క్షుద్రదేవతలకి ఢింకీ జాతి కోళ్ళంటే చాలాయిష్టం. వాటి మృతిని కోపతూ వుంటాయి ఎప్పుడూ. రాజా కరణంగారి పుంజు రెండూ ఢింకీ జాతివే. ఆ క్షుద్రదేవతల ప్రభావం పోవాలంటే పందెం ముందర ఆ రాత్రి స్నానం చేయించాలి పందెంలో పాల్గొనే కోళ్ళకి. ఈ విషయం కుక్కుట శాస్త్రంలో పది శ్లోకాలలో వివరించారు. ఆ ముహూర్తంలో స్నానం చేసిన కోడికి క్షుద్ర దేవతల పీడ విరగడయి విజయావకాశం ఎక్కువ అవుతుంది పందెంలో,' అని వివరించాడు శుబ్బారాయుడు.

మునసబుగారు నమ్మలేనట్లు చూశాడు శుబ్బారాయుడికేసి.

'కాక్ ష్యూర్'లో ఏంటీకోల్డ్ అంటే జలుబు రాకుండా వుండేందుకు విటమినులు కూడా వున్నాయి. మీ రాజాకి స్నానం చేస్తే రొంప చేస్తుందని ఏమీ భయపడక్కర్లేదు' అన్నాడు శుబ్బారాయుడు.

ఆ విశదీకరణకి మునసబుగారు సంతృప్తి చెందారు.

'సరే! మీ యిష్టం. మా టీమ్ మేనేజర్ మీరే గదా. అయినా రాజా ఓడిపోతే మీ పందెం పోతుందిగా' అన్నారు మునసబుగారు నవ్వుతూ.

మునసబుగారిది రాజకీయపు బుర్ర.

'కాని విషయం మాత్రం అతి గుప్తంగా వుంచాలి. కరణంగారికి అస్సలు తెలియకూడదు. ఎందుకంటే చక్రవర్తి కూడా స్నానం చేస్తే రెండు కోళ్ళూ కూడా క్షుద్రదేవతల బారి నుంచి తప్పిపోతాయి. మీరు పన్నెండు గంటలకి రాజాని చెరువు దగ్గరకు తీసికొనిరండి. నేను తిన్నగా వస్తాను అక్కడికి రాజాని నేనే స్నానం చేయిస్తాను' అన్నాడు శుబ్బారాయుడు రహస్యంగా చెప్తున్నట్లు నటిస్తూ కొద్దిగా గట్టిగానే అంటూ.

'అన్నట్లు! నిన్న మీటింగ్....' అని మునసబుగారు ఏదో అనబోతుంటే శుబ్బారాయుడు అన్నాడు.

'ఏదో చిన్నతనం....'

'తర్వాత ఇంటకి వచ్చేం. ఏం జరిగిందో తెలుసా. దమయంతి గదిలో త్రాచుపాము మంచంమీద వుంది. వెంట్రుక వాసిలో దానికి గండం తప్పింది. రవి చంపేశాడు ఆ పాముని' అన్నారు మునసబు.

'క్లాస్మేట్ రవికి ధైర్యం ఎక్కువ' అన్నాడు శుబ్బారాయుడు మెచ్చుకొంటూ.

'వాడికి చదువు ఒక్కటే తక్కువకానీ. ధైర్య సాహసాలు, పనితనం చాలా ఎక్కువ' అన్నారు మునసబు.

'చదువులో ఏముందండీ. నాలుగు అక్షరాలు ముక్కున బట్టి కక్కేస్తే బి.ఏ. వస్తుంది. మాటవరసకి మీరు ఏవయినా పెద్ద చదువులు చదివారా. అయినా తూర్పుగోదావరిజిల్లా మొత్తంమీద మీ మాటని కాదని బ్రతకగలరా' అన్నాడు శుబ్బారాయుడు.

మునసబుగారు ఆలోచనలో పడ్డారు ఒక క్షణం.

'సరే! పన్నెండు గంటలకి చెరువు దగ్గర కలుస్తాం' అంటూ శుబ్బారాయుడు సెలవు పుచ్చుకొన్నాడు.

'డార్బీ', 'టర్ఫ్ ఇన్విటేషన్ కప్' ఇలాటి పెద్ద గుర్రపు పందేలు జరిగేరోజు ముందర అందులో పాల్గొనే గుర్రాల ఫొటోలు, వాటి వంశవృక్షం, జాకీల పేర్లు, ట్రెయినర్ల పేర్లు, నిపుణుల అభిప్రాయాలు మొదలయినవి న్యూస్‌పేపర్స్‌లో వేస్తారు.

గుర్రప్పందేలంటే ఆసక్తి లేనివాళ్ళకి అన్ని గుర్రాల మొహాలూ మన ఊరి సాయిబు జట్కా గుర్రం మొహంలాగే కనిపిస్తాయి.

కాని మొహంమీద చారలుంటే వెయ్యి రూపాయలు పందెం కాయడానికి జంకరు కొందరు.

నల్లటి గుర్రాల్ని ఇష్టపడేవారు మరి కొందరుంటారు. తెల్లటి మొహం వుంటే అదృష్టమని అనుకొనేవాళ్ళు ఇంకొందరుంటారు.

ఇక వంశవృక్షం ఎంత క్షుణ్ణంగా పరిశీలిస్తారంటే ఆ గుర్రం తల్లి, తండ్రి ఎవ్వరు? ఆ తండ్రి, తల్లిలకు తల్లి తండ్రులు ఎవ్వరు? ఈ సమాచారమంతా పందెం కాసేవాళ్ళకి కావాలి. పందెం గుర్రాంమీద ఈ సమాచారం అంతా దొరుకుతుంది న్యూస్‌పేపర్స్ ద్వారాను, రేస్‌బుక్‌ల ద్వారాను.

గుర్రం ఎంత మంచిదయినా జాకీ అంటే నడిపే రౌతు ముఖ్యం కదా. అలాగే గుర్రాన్ని ట్రెయిన్ చేసినవాడి ఆమూకీ కూడా ఇంకా ముఖ్యం.


టి.వి.లో అయితే నిపుణులచేత ఈ విషయాలన్నీ క్షుణ్ణంగా మాట్లాడిస్తారు.

అఫ్‌కోర్స్! అవి వింటే చివరకి దేనిమీదా పందెంకాయలేరు అనుకోండి! అది వేరే సంగతి.

నిజానికి అసలు రేస్‌కన్నా ఈ హంగామా అంతా ఎంతో 'ఎక్సయిట్‌మెంట్' కలిగిస్తుంది జనానికి.

ఆ సాయంత్రం ఆరు గంటలకి మూర్తి యింటిముందర కుర్చీలలో కూర్చున్న మూర్తి, వెంకట్రావు, శుబ్బారాయుడు, నరసింహంగార్లు మర్నాటి పందెం గురించి టి. వి. లో నిపుణులు చర్చించినట్లే చర్చిస్తున్నారు.

'ఎన్నాళ్ళ నుంచి ఈ పందెం ఏటా జరుగుతోంది'అని



అడిగాడు శుబ్బారాయుడు.

'గత పది సంవత్సరాలుగా జరుగుతోంది. ఇప్పటి వరకు ఏడుసార్లు కరణంగారి కోడి, మూడు సార్లు మునసబు గారి కోడి గెలిచింది. ఈ పదేళ్ళు కూడా నేనే రిఫరీని'అన్నారు నరసింహం గర్వంగా.

'క్రితం ఏడాది గెలిచిన మునసబుగారి కోడి ఈ ఏడాది గెలవదు అన్నారు మొన్న. ఎందుకు?' అన్నాడు వెంకట్రావు.

'కోళ్ళ పందెంలో ముఖ్యమైనది బలం ఒకటే కాదు. ఎంత ఎత్తు ఎగరగలదు అన్నది కూడా ముఖ్యమైన అంశమే. కాళ్ళకి కట్టిన కత్తులతో పోరాడేటప్పుడు ఏ కోడి ఇంకా ఎత్తు ఎగరగలదో ఆ కోడి కాళ్ళకి కట్టిన కత్తి రెండో కోడి డొక్కల్లో దిగబడడానికి అవకాశం వుంటుంది. క్రితం ఏడాది కరణంగారి కోడి దగ్గుపల్లిలో పుట్టి పెరిగినది. చూడడానికి బలంగానే వుండేది. కాని అంత ఎత్తు ఎగిరేది కాదు. కాని ఈసారి కరణంగారి కోడి వంశవృక్షం చాలా మంచిది. కపిలేశ్వరపురం చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో మూడేళ్ళు అజేయంగావున్న పుంజు ఈ పుంజు తండ్రి. పైగా మునసబుగారి కోడి క్రింత సంవత్సరం కన్న ఓ ఏడాది ముసలది అయింది కదా. అందుకే ఈసారి కరణంగారి కోడి నెగ్గుతుందని ఖచ్చితంగా చెప్తున్నా' అని నరసింహంగారు 'ఎక్స్‌పెర్ట్ కామెంట్స్' ఇచ్చారు.

'అలా అయితే శుబ్బారాయుడు పందెం పోయినట్టేనా' అన్నాడు మూర్తి నవ్వుతూ.

'ఆయనకి ఈ వివరాలు తెలియవుగదా! ఇప్పుడేనా ఆయన పందెం లేదంటే నాకు అభ్యంతరం లేదు' అన్నారు నరసింహంగారు ఉదాత్తంగా.

'నో! కామ్రేడ్ నరసింహంగారూ. మాటంటే మాటే పందెం ఉంది' అన్నాడు శుబ్బారాయుడు.

'సరే! మీ యిష్టం.'

'నరసింహంగారూ ఒక్క విషయం అడుగుతా. మొన్న మీరు బెంగుళూరు డార్బీ గురించి చెప్పారు గుర్తుందా'అన్నాడు శుబ్బారాయుడు.

'ప్రిన్స్ ఖార్టూమ్ నెగ్గిన డార్బీనా'.

'ఆ! అదే! ఆడ్స్ ఆన్ ఫేవరిట్ 'థండరింగ్' ఎందుకు బోర్డ్ మీదకి రాలేదు? బోర్డ్ మీదకి రావడమంటే కనీసం ఫోర్తయినా రావాలి' అని మూర్తికేసి చూసి విశదీకరించాడు శుబ్బారాయుడు.

'ఖార్టూమ్ మంచి గుర్రం కాబట్టి.'

'కాని 'థండరింగ్' అంత వరకూ నాలుగయిదు రేస్‌లు నెగ్గిందికదా.'

'అయినా' డార్బీలాంటి క్లాసిక్ రేస్‌లో నిలబడలేదు' అన్నారు నరసింహం.

'లేక బుక్కీస్ ఆడిన నాటకమా' అన్నాడు శుబ్బారాయుడు.

నరసింహంగారు ఒక నిమషం మాట్లాడలేదు.

'అలా జరగొచ్చు. కాదనను బాగా పోయే గుర్రాన్ని


# ఇది మీకోసం!

## మూఢ ఆచారాల అజ్ఞానపు చీకట్లను పారద్రోలే డా॥ సమరం రచన

వేసవి, వర్షాకాలాల్లో వచ్చే జబ్బులు, రకరకాల విరోచనాలు, వాటి లక్షణాలు.
పిల్లలు నోట్లో వేలువేసుకొనే అలవాటు, ఉచ్చారణ దోషం, గజ్జి, తామర లాంటి చర్మ వ్యాధులు, పోలియో, మెదడువాపు, కళ్ళకలక, మెల్లకన్ను, కంటిలో శుక్లాలను పోగొట్టటం.
అలసిపోటం, నిద్రమత్తు, నిద్రపట్టక పోవటం, శక్తి కోల్పోవటం, కీళ్ళ నొప్పులు, మస్క్యులర్ పెయిన్స్, పక్షవాతం, బ్లడ్ కాన్సర్, హుషారు లేకుండా చేసే మిక్సిడిమా వ్యాధులు - వాటివివరం.
మూత్ర కోశాల్లో రాళ్ళు, మొలలు ముదిరి రక్తం పోవటం, పొట్టలోపాములు పడటం, మలబద్ధకం, కడుపులో నొప్పి, గ్యాస్‌చేరడం, ఉబ్బరం, త్రేపులు రావడం, ప్రయాణాల్లో వాంతులు, ఎలుక కరిస్తే వచ్చే జ్వరం, దోమలు కుట్టితే వచ్చే జబ్బులు- వాటినివారణ.
ప్రమాదంలో ఎముక విరిగిందో, బెణికిందో తెలుసుకొనే విధం.
నోటిపూత, నోట్లో పుళ్ళు, గొంతుమింగుడు పడకపోవటం, అరికాళ్ళల్లో ఆనలు, ఉలిపిరికాయలు చర్మంమీద వచ్చే పొలుసులు, ముఖం మీద వచ్చే మచ్చలు, జిడ్డుపట్టడం, హఠాత్తుగా స్పృహకోల్పోవటం-పై సలహాలు.
లివరు, మెదడు, ఊపిరితిత్తులనుచెడగొట్టే వ్యాధులనివారణ. లావుగావున్నా, బరువుతగ్గినా, రక్తపోటు వచ్చినా, ఉక్కుమనిషి డొక్కుగా అయినా తీసుకోవలసిన జాగ్రత్తలు. కలరా, ఆటలమ్మ, నవీన వైద్య పద్ధతులు.
ఆంధ్ర ప్రాంతంలోవచ్చే బోదకాలు, రాయలసీమలో వచ్చే నారుకురుపు, తెలంగాణాలో వచ్చే చర్మం విడిపోయి పెచ్చులుకట్టే విరోచనాలయ్యే వ్యాధులకు గల కారణాలు.
సొంతవైద్యం - మంచీ చెడులు. ప్రథమ చికిత్స - ప్రాథమిక సూత్రాలు.

ఇలాంటి ఎన్నెన్నో సమస్యలకు మీ డా॥ సమరం గారి సలహాలు

## హెల్త్-సైన్స్

వెల.15 రూ॥లు

మీ దగ్గరి బుక్‌స్టాల్స్‌లో అడగండి. లేకపోతే అడ్వాన్సు పంపిన V.P.P. లో పంపగలము.

## నవభారత్ బుక్‌హౌస్

ఏలూరురోడ్. విజయవాడ.2

జాకీ కావాలని 'స్లో' చెయ్యడానికి అవకాశం వుంది. కాని థార్టూమ్ తర్వాత 'టర్ఫ్ ఇన్విటేషన్' నెగ్గింది' అన్నారు నర సింహం.

'అదిన నాటకం నిజం అన్పించేందుకు అలాగ చెయ్య వచ్చుగా. అందులో 'థండరింగ్' మీద లక్షల కొద్దీ డబ్బు పందాలున్నపుడు '

'అలా అనుకొంటే గుర్రాలమీద పందాలు కట్టడం కష్టం' అన్నారు నరసింహంగారు నవ్వుతూ.

'అలాగే ఈ కోడి పందెం మీద కూడా. నా మనస్సు చెప్తోంది ఆ మునసబుగారి కోడి నెగ్గుతుందని' అన్నాడు సుబ్బారాయుడు కూడా నవ్వుతూ.

'సరే! చూద్దాం. ఎవ్వరు నెగ్గుతారో' అన్నాడు నర సింహం.

'అన్నట్లు మీరు నాతో పందెం కాశారు కదా. మీరు రిఫరీగా........' అన్నాడు సుబ్బారాయుడు.

'అది పేరందోయ్. నరసింహం నిష్పక్షపాత మనిషి' అన్నారు ఆయన గర్వంగా.

'పందాల్లో పోరాడాలని కోళ్ళకి ఎలా తెలుస్తుంది? ట్రెయినింగ్ ఇస్తారా' అన్నాడు వెంకట్రావ్.

వెంకట్రావ్‌కి ఈ మధ్య 'జనరల్ నాలెడ్జి'లో ఆసక్తి ఎక్కువయింది.

'కోళ్ళకి పెద్ద ట్రెయినింగ్ ఇవ్వక్కర్లేదు. పందెం జాతి కోళ్ళు సహజంగానే దెబ్బలాడుకొంటాయి. ఎటూ కాళ్ళకు కత్తులు కట్టడం వల్ల అందులో ఒకటి చచ్చిపోతుంది పందెంలో సాధారణంగా. కాని పొట్టేళ్ళకైతే బాగా ట్రెయినింగ్ ఇస్తారు. పందెంలో అవతలి పొట్టేలు చచ్చిపోయేదాకా అలా ఢీ కొట్టేటట్టు ట్రెయినింగ్ ఇస్తారు' అన్నారు నరసింహం.

అలా కబుర్లు చెప్పుకొంటుంటే రాత్రి ఎనిమిది గంట లయింది.

సరిగ్గా అదే సమయానికి శివాలయం ఆవరణలో మెల్లగా మాటలు వినబడుతున్నాయి.

"ఏమిటి కోడిని స్నానం చేయించడమా" అన్నాడు కరణం నమ్మలేనట్లు.

'అవునండి బాబయ్యా' అన్నాడు ఎల్లయ్య.

'నువ్వు సరిగ్గా విన్నావా' అని మళ్ళీ అడిగారు కరణం.

'మా అమ్మతోడు అండీ. దాలాసేపు తిథి. నక్షత్రాలు లెక్కలు వేసి చెప్పారండీ ఆ పట్నం బాబుగోరు. అర్ధరేతిరి పన్నెండు ఒంటిగంట మద్దె చెరువులో తానం చేయించాలంట. అలాచేత్తే అమ్మవారు కోడి జోలికి రారంట' అన్నాడు ఎల్లయ్య.

'నాకేం నమ్మకం కుదరటం లేదు. నా జీవితంలో కోడిని పందెం ముందర స్నానం చేయించడం చూడలేదు' అన్నాడు కరణం.

'మునసబుగారు కూడా అదే మాట అన్నారండీ.అప్పుడా బాబుగారు అన్నాడు మొన్న కోడికి కొత్త తిండి తెప్పించారు కప్యూర్. అది తింటే తానం చేయించినా జలుబు చెయ్యదు అని చెప్పారండీ. మీకు తెలియకూడదని కూడా అన్నారండీ. మీ కోడి కూడా ఆ టయిముకో తానం చేత్తే మునసబుగారి కోడికి నాబం నేదు అని చెప్పారండీ' అన్నాడు ఎల్లయ్య.

'కాక్‌ఫ్యూర్' కాకినాడ నుంచి తెప్పించి విన్నటి నుంచి చక్రవర్తికి వేస్తున్నారు. చక్రవర్తి బాగా తింటోంది దాన్ని. పన్నెండు గంటలకి వచ్చి చూస్తాను. నిజంగా రాజాని స్నానం చేయిస్తే చక్రవర్తిని కూడా చేయిస్తాను. ఒకవేళ ఏదయినా నష్టం కలిగితే రెండింటికీ సమానంగానే కలగాలి కదా! అని అనుకున్నారు కరణం.

కరణంగారిది మునసబుగారి బుర్రలాగే రాజకీయపు బుర్రకదా.

రాత్రి పన్నెండు గంటలకి మునసబుగారి రాజాతోటి, సుబ్బారాయుడు ఒక్కడూ చెరువు వైపుకి దారి తీశారు.

అంతకు ముందే అరగంట నుంచి కరణంగారు చక్రవర్తితో పాటు చెరువుకి అవతలి గట్టునవున్న పొద చాటున దాక్కొని ఉన్నారు.

## 11

ఉదయం తొమ్మిది గంటలకి మునసబుగారింటి దగ్గర్నుంచి ఊరేగింపు బయలుదేరింది.

చక్కగా అలంకరించబడిన టాపులేని సైకిల్ రిక్షాలో మునసబుగారు, ఆయన ఒడిలో రాజా కూర్చొన్నారు. మునసబు గారి భార్య, దమయంతి రాజాకి హారతి యిచ్చారు అంతకు ముందు.

ముందర బేండ్‌వాళ్ళు 'ప్రోచేవారెవరురా' ట్యూన్ వాయిస్తున్నారు.

ఈ మధ్యన ఏ బేండ్‌వాళ్ళయినా సందర్భం ఏదయిన 'శంకరాభరణం' ట్యూన్స్‌తోటే మొదలుపెడ్తున్నారు.

'ప్రోచేవారు ఇంకెవరూ రాజాయే' అని ఓ కుర్రాడు చమత్కరించాడు.

బేండ్ మేళానికి కాస్త ముందుగా నలుగురయిదుగురు కుర్రాళ్ళు పైకి వెళ్ళే పేలే తారా జువ్వలు, అవుట్లు కాలుస్తున్నారు.

అదే టయిముకి కరణంగారింటి దగ్గర్నుంచి ఇంకో ఊరేగింపు బయలుదేరింది. అలంకరించిన ఎడ్లబండిమీద కరణంగారు. ఒడిలో చక్రవర్తి ఆశీనులయ్యారు.

అంతకు ముందర కరణంగారి భార్య మంగళ హారతి పాడి చక్రవర్తికి హారతి యిచ్చింది.

కరణంగారికి బేండ్ మేళం అంటే యిష్టంలేదు.సన్నాయి మేళం పెట్టించారు.

వాళ్ళు కూడా యథాశక్తి 'దొరుకునా ఇటువంటిసేవ' పాట వాయిస్తున్నారు.

కోడికి ఆటువంటి సేవ దొరకడం కష్టం కాబట్టి ఆ పాట సమంజసమే ఆ సందర్భానికి అనుకోవచ్చు. కరణంగారి సిబ్బంది కూడా బాణసంచా కాలుస్తున్నారు.

ఊరంతా తిరిగి పదిగంటలకు రెండు ఊరేగింపులూ పందెం స్థలానికి చేరాయి.

హాస్పిటల్‌కి కాస్త అవతలగావున్న పెద్ద ఖాళీ స్థలంలో పందెం ఏర్పాటు చేశారు.

ఎనిమిది అడుగుల వ్యాసంతో ముగ్గుతో చక్రం వేశారు.

ఒక వైపు మడత కుర్చీలో మునసబుగారు రాజాతోటి, రెండోవైపు మడత కుర్చీలో కరణంగారు చక్రవర్తి తోటి

కూర్చొన్నారు.

రాజా మునసబుగారి ఒడిలో స్థిమితంగా లేదు.

చక్రవర్తి మాత్రం కరణంగారి బొజ్జను ఆనుకొని కూర్చొంది.

చక్రం చుట్టూ కుర్చీలువేశారు ఊరి పెద్దలకు.

మూర్తి, శాస్త్రిలు, మునసబు, కరణాలకి సమ దూరంగా ఉన్న కుర్చీలలో కూర్చొన్నారు.

సుబ్బారాయుడు మునసబుగారు కూర్చొన్న కుర్చీకి ప్రక్క కుర్చీలో కూర్చొన్నాడు.

వెంకట్రావ్ మాత్రం కరణంగారికి కొద్దిగా దగ్గరగా కూర్చొన్నాడు.

మునసబు, కరణం పార్టీల జనం కుర్చీల వెనకాల నిలబడ్డారు.

నరసింహంగారు రిఫరీ.

'ఇంకో పదిహేను నిమిషాలలో పందెం మొదలవుతుంది' అని ప్రకటించారు.

ఈ పదిహేను నిమిషాలలోనూ కోళ్ళ కాళ్ళకి కత్తులు కట్టడంలాటి తతంగం జరుగుతుంది.

సినిమాల్లో అయితే యుద్ధాలు రెండురకాలుగా చూపిస్తారు.

సినిమా సాంఘికం అయితే 'డిష్యూ' 'డిష్యూ' లలో నేరుగా మొదలుపెడ్తారు సాధారణంగా. కాని సినిమా జానపదం కాని, పౌరాణికంగాని అయితే వాళ్ళు అసలు యుద్ధానికి దిగే ముందర పద్యాలతో దెబ్బలాడుకుంటారు.

ఒకడు కంద పద్యం చదివితే, రెండవవాడు ఉత్పల మాల చదువుతాడు.

దానికి జవాబుగా మొదటివాడు శార్దూలం ఎత్తుకొంటాడు. దానికి ప్రతిగా రెండవవాడు సీసం మొదలుపెడ్తాడు. ఇలా కాసేపు కాలక్షేపం చేసి గొంతులు తడారిన తర్వాత మొదటివాడు విల్లు అందుకొని 'ఇదే నా మూషిక అస్త్రము. కాచుకొమ్ము' అని బాణం ఆకాశంలోకి వేస్తాడు.

'అటులనా! ఈ బిడాల అస్త్రమే దానికి చెల్లు' అంటూ రెండోవాడు వేరే బాణం వేస్తాడు గగనంలోకి. విల్లు, బాణాలు వుండీ ఎదురుగా వున్నవాళ్ళు ఒకరి మీద ఇంకొకరు బాణాలు నేరుగా ఎందుకు వెయ్యరో ప్రేక్షకులకు అర్థం అవ్వదు.

సరే! ఈ రెండు బాణాలూ ఆకాశంలో కొట్టుకొంటాయి కాసేపు. ఎలక, పిల్లి అరుపులు బేక్‌గ్రౌండ్ మ్యూజిక్‌గా.

'బిడాల అస్త్రం' నెగ్గుతుంది అని అనుమానం వచ్చినపుడు మొదటివాడు మొహంలో క్రోధ భావం అభినయించి కాలభైరవ అస్త్రంతో దాన్ని ఛేదించి మందహాసం చేస్తాడు

కాని కోడి పందెంలో 'డిష్యూ' 'డిష్యూ' చేసేది కోళ్ళే కాబట్టి, మునసబు, కరణాలు శ్రావ్యమైన కంఠాలు లేకపోవడం వల్ల వ్యంగ్య సంభాషణలతో ఆ పదిహేను నిమిషాలూ గడిపారు.

'ఏం! బావా! సామ్రాజ్యం నుంచి అడవులకు తోలేసిన చక్రవర్తిలా వున్నాడు మీ చక్రవర్తి' అన్నాడు మునసబు.

'బురదగొడ్డు రాజు కన్న నయమేలే మునసబు' అని జవాబిచ్చాడు కరణంగారు.

'అయినా! యజ్ఞానికి బలియిచ్చే మేక రంగులా నీ పుంజుకి ఆ నలుపు రంగు ఏమిటోయ్' అన్నాడు మునసబు. 'బలి' అన్నమాట నొక్కి పలుకుతూ.

పందెంలో దెబ్బ తగిలి రక్తం కారితే ఒంటి రంగులో కలిసిపోయి కనపడకుండా ఉండటానికి ఆ ఎరుపు రంగు' అని మందహాసం చేశాడు కరణం.

వాళ్ళిద్దరి కుశలప్రశ్నలు అలా అవుతుండగా రెండు కోళ్ళ కాళ్ళకు కత్తులు కట్టారు.

రాజా కత్తులు బాగానే కట్టించుకుంది.

కాని చక్రవర్తి ఆ తతంగంలో ఏమీ ఆసక్తి చూపలేదు.

మూర్తీ చక్రవర్తి చాలా గుంభనగా వున్నట్టు కనిపిస్తోంది అన్నాడు శాస్త్రి మెల్లగా'.

'రాజాకన్న లావుగానే కన్పిస్తుంది' అన్నాడు మూర్తి.

'కాని యాక్టివ్‌గా లేదు' అన్నాడు శాస్త్రి మళ్ళీ.

'వెంకట్రావుగారిలా జిన్ ఖాళీ చేసిందేమో పందానికి ముందు' అన్నాడు మూర్తి నవ్వుతూ.

'రెడీ' అని అరిచారు నరసింహం.

కరణం, మునసబులు బరిమధ్యకి వచ్చారు. ఎదురెదురుగా వించుని కోళ్ళని కూడా ఎదురెదురుగా ఉండేటట్లు పట్టుకున్నారు.

ఒక దాని ముక్కు ఇంకొక దానికి రాపాడించి ఎగరవేసి వెనక్కి వచ్చి వాళ్ళ కుర్చీలలో కూర్చున్నారు.


రాజా క్రిందకు వచ్చి మళ్ళా ఎగిరింది.

చక్రవర్తి మాత్రం ముడుచుకుని నేలమీద కూర్చొంది. కరణంగారి మొహంలో రంగులు మారాయి.

'లే! చక్రవర్తీ లే' అని అరిచాడు కరణం.

చక్రవర్తి తెలుగు భాషను మరచిపోయినట్లుంది. అర్థం అవలేదు అన్నట్లు ఆయన కేసి ఒకసారి చూసి మళ్ళా తల వంచింది భూమికేసి పెళ్ళికూతురులా.

రాజా 'కొక్కొరొకో' అంది.



రెండు సార్లు కాదు మూడు సార్లు.

ఇటువంటి సందర్భంలో ఎదుటకోడి కూడా ఎగరాలి. కత్తులతో పోట్లాడాలి అనే అభిప్రాయం రాజా మనస్సులో నాటుకుని వుంది.

కాని అలాటిదేమీ జరగడం లేదు.

'గుప్తుల కాలం స్వర్ణయుగం అనుటకు కరణాలు ఏవి?'

'భారతదేశం ఉపఖండమనుటకు కారణాలు ఏవి ?'

'మొగలాయి సామ్రాజ్య పతనానికి ముఖ్య కారకులు ఎవరు?'

ఇలాటి ప్రశ్నలు సోషల్ స్టడీస్ ప్రశ్నా పత్రంలో లేక పోతే విద్యార్థికి కలిగే విసుగులాటిది రాజాకి కలిగింది.

ఇంకో రెండుసార్లు ఎగిరి చూపింది.

అబ్బే! లాభం లేదు. కాళ్ళు నెప్పులు తప్ప.

ఈసారి చక్రవర్తికి ఎదురుగా నిలబడి ఒక్కసారి మాత్రం 'కొక్కొరొకో' అంది.

చక్రవర్తి 'కొక్కొరొకో' అని జవాబిచ్చింది కూర్చునే.

కోడి భాష తెలిస్తే అవి రెండూ మాట్లాడుకున్న దానికి తెలుగు తర్జుమా యిలా చెయ్యవచ్చు.

'లే! లే! బాగుండదు. అందరూ చూస్తున్నారు' హిత బోధ చేస్తోంది రాజా.

'సదేలే! దల, ఒళ్ళు అంతా దిమ్మెక్కింది లేచేటట్టుంటే బాటలా' అంది చక్రవర్తి విసుక్కుంటూ.

'ఏం! ఒంట్లో బాగోలేదా' పరామర్శ చేసింది రాజా.

'నా ఆరోగ్యం గురించి నీ ఆందోళనకు నా కృతజ్ఞతలు. ఏమయిందంటే....' అని ఆగింది చక్రవర్తి.

రాజా ఇంకాస్త దగ్గరకి వచ్చింది.

చక్రవర్తి ముద్ద మాటలు సరిగ్గా వినపడడం లేదు.

'ఊ....' అంది రాజా.

'నిన్న. రాత్రి అయిదు నిమిషాలసేపు చెరువులో ముంచాడు నన్ను ఈ కరణం. ఏదో శవాన్ని స్నానం చేయించి నట్లు. అందులో నడిరాత్రి. చలికాలం. రెక్కలు కొంకర్లు పోయాయి' అంది చక్రవర్తి.

'నన్ను ముంచారుకాని నీళ్ళు నన్ను తాకలేదు. ఓ క్షణం ఊపిరి ఆడలేదు అంతే' అంది రాజా చక్రవర్తికేసి జాలిగా చూస్తూ.

'నీళ్ళలో మునిగిన తర్వాత నీళ్ళు తాకకపోవడమేమిటి. అంతా మాయగా వుంది. అయినా కోళ్ళకి స్నానం ఏమిటి. కరణంగారికి పిచ్చెక్కింది. నిన్నటి వరకు బాగానే చూసుకొన్నాడు. ఏ క్షణాన్ని ఎలా మారతారో కదా ఈ మనుష్యులు అంది చక్రవర్తి వేదాంత ధోరణిలో.

'ఒక్కసారి ఎగరలేవా' అంది రాజా మొహమాటపెడ్తూ.

'సరేలే! ఏదో ఓపిక చేసుకుని ఎగిరితే నువ్వు ఊరుకొంటా వేమిటి ఆ కత్తులతో' అంది చక్రవర్తి తెలివిగా.

'మరి! ఎలా? చూడు అందరూ మన యుద్ధం చూద్దామనే వచ్చారు' అంది రాజా ప్రేక్షకులమీద సానుభూతి చూపిస్తూ.

'వాళ్ళదేం పోయింది! చచ్చేది మనమేగదా' అంది చక్రవర్తి సూక్ష్మం బోధిస్తూ.

'నువ్వు! చెప్పేది నిజమేలే' అంటూ రాజా చక్రవర్తి చుట్టూ తిరగడం మొదలుపెట్టింది.

ఇంకో రెండు నిమిషాలు నిరీక్షించారు రిఫరీ. పరిస్థితిలో ఏమీ మార్పులేదు.

రాజా చక్రవర్తి చుట్టూ కుడివైపుకు బదులు ఎడమ వైపుగా తిరగడం తప్పిస్తే.

కరణంగారి మొహం కోపంతో ఎరుపెక్కింది.

'ఏం బావా! చక్రవర్తికి కొత్తరకం ట్రెయినింగ్ ఇప్పించావేమిటి. కూర్చుని లేవడం లేదు' అన్నారు మునసబు మందహాసం చేస్తూ.

మునసబు పార్టీ వాళ్ళంతా ఘొల్లుమని నవ్వారు.

కరణంగారు కోపంతో చేతికర్రతో చక్రవర్తిని తట్టడానికి లేచారు.

కాని రిఫరీ ఒప్పుకోలేదు.

'బరిలోకి వదిలిన తర్వాత ఏమీ చెయ్యడానికి వీలులేదు' అని రూలింగ్ ఇచ్చారు ఆయన.

రిఫరీగారి నిష్పక్షపాత వైఖరికి అందరూ మెచ్చుకున్నారు.


శుభ్భారాయుడు పందెం గురించి ఊళ్ళో అందరికీ తెలుసు.

ఇంకో నిమిషం ఆగి రిఫరీ నరసింహంగారు బరిలోకి వెళ్ళి రాజాని చేతుల్తో ఎత్తారు.

అందరూ నిశ్శబ్దంగా వున్నారు.

'ఇటువంటి కోడి పందెం నా జీవితంలో చూడలేదు. కరణంగారి కోడి పందెంలో పాల్గొనే స్థితిలో లేదు. కాని బరిలోకి వదిలిన తర్వాత పోట్లాడకపోతే అది ఓటమికిందే లెక్క. ఈ ఏడాది పందెంలో గెలుపు మునసబుగారి కోడిదే' అన్నారు ఆయన. మునసబుగారి జనాభా అంతా హర్షధ్వానాలు చేశారు.

మునసబుగారు ఆప్యాయంగా రాజాని చేతిల్లోకి తీసి



కొన్నారు.

కరణంగారు లాల్చీ జేబులోంచి వెయ్యి రూపాయలకట్ట రిఫరీగారి చేతిలో పెట్టారు.

మునసబుగారు ఆ కట్టని కూడా ఆప్యాయంగా అందుకొన్నారు.

కరణంగారు చక్రవర్తికేసి చూడకుండా ధుమధుమలాడుతూ అక్కడి నుంచి కదిలారు.

'ఇలా ఎందుకు జరిగిందో నాకింకా అర్థం కాలేదు' అన్నారు నరసింహంగారు శుబ్బారాయుడికి నాలుగు వందలూ ఇస్తూ.

'మీరు చెప్పిన డర్బీలో ప్రిన్స్ ఖర్జూమ్ నెగ్గినపుడు కూడా అందరూ ఇలాగే అనుకొని వుంటారు' అన్నాడు శుబ్బారాయుడు నవ్వుతూ.

ఓ గంటపోయిన తర్వాత మునసబుగారు ఒక్కరూ మూర్తి ఇంటికి వచ్చారు.

శుబ్బారాయుడిని పిలిచి రహస్యంగా అన్నారు 'రాజకీయాల్లో ఎత్తుకు పై ఎత్తులు నాకు అలవాటే. కాని మీరు ఏం చేశారో అవగాహన కాలేదు. ఇందులో ఏదో మతలబు వుందని మాత్రం తెలుస్తోంది'.

'కైకేయి వరం అడిగినట్లు నాకు ఓ వరం ఇస్తానంటే చెప్తా' అన్నాడు శుబ్బారాయుడు.

'సరే' అన్నారు మునసబు మందహాసం చేస్తూ.

'నిన్న రాజాని చెరువులో ముంచినపుడు ప్లాస్టిక్ బేగ్‌లో రాజాని కవర్ చేసి మరీ ముంచా. గట్టుమీదున్న మీకు అది కనపడలేదు'.

'మరి కరణం కోడి అలా స్థబ్దులో తూర్పోవడానికి....'



'కారణం. కరణంగారు తన కోడిని నేరుగా చెరువులో ముంచడం' అన్నాడు శుబ్బారాయుడు నవ్వుతూ.

'కరణంకి ఎలా తెలుసు ఈ చెరువులో ముంచడం తతంగం గురించి' అన్నారు మునసబు.

'ఎవ్విరి థింగ్ ఈజ్ ఫెయిర్ ఇన్ లవ్ అండ్ వార్' అన్నారు. ప్రేమలోనూ, యుద్ధంలోనూ ఏం చేసినా తప్పు లేదు అని దానికి అర్థం. మీ పాలేరు ఎల్లయ్య కరణంగారి వేగు. అందుకే అతడికి వినపడేటట్టుగా మీకు ఈ చెరువు మంత్రం చెప్పాను' అన్నాడు శుబ్బారాయుడు.

మునసబుగారి రాజకీయపు బుర్రకు మొత్తం అంతా ఒక్క క్షణంలో అర్థమయింది.

'అసాధ్యులండీ మీరు' అన్నారు మునసబు శుబ్బారాయుడిని అభిమానంగా తట్టూ.

'కాని ఇంకో సందేహం. ఎల్లయ్య కరణంగారి వేగని ఎలా తెలుసుకున్నారు' అన్నారు మునసబు.

'కొన్ని రహస్యాలు మాతోపాటే వుండడం మంచిది' అన్నాడు శుబ్బారాయుడు నవ్వుతూ.

'సాయంత్రం ఆరుగంటలకి మా తోటలోకి రండి. మీకు స్పెషల్ పార్టీ యిస్తా' అన్నారు మునసబు కన్ను కొడ్తూ.

'ఏమిటీ'

'డింపుల్ స్కాచ్ కొబ్బరికాయ నీళ్ళలో తాగితే మజా వుంటుంది మీ రొక్కరే రండి' అన్నారు మునసబు.

'సరే'.

'మరి మీ వరం సంగతి....'

'కైకేయిలాగే అవసరం కలిగినపుడు అడుగుతాలెండి' అన్నాడు శుబ్బారాయుడు.

మునసబుగారు నవ్వుతూ వెళ్ళారు.

'ఏమిటోయ్ మునసబుగారికి నువ్వంటే అంత అభిమానం ఏర్పడింది' అన్నాడు మూర్తి తర్వాత.

'కామ్రేడ్ వెంకట్రావ్ మొన్న ఇచ్చిన స్పీచ్‌కి ముగ్ధుడయి ఆ అభిమానం అంతా వెంకట్రావ్ ప్రాణ స్నేహితుడిని కాబట్టి నా మీద చూపిస్తున్నారు-అంతే' అన్నాడు శుబ్బారాయుడు.

'మొత్తంమీద పందెం నెగ్గావన్నమాట' అంది కమల నవ్వుతూ శుబ్బారాయుడితో-అందరికీ భోజనం వడ్డిస్తూ.

'అదృష్టవంతుల్ని చెరిపేవారు లేరు-దురదృష్టవంతుల్ని బాగుచేసేవారు లేరు. నేను ఆ రోజునే చిలక్కి చెప్పినట్లు చెప్పాను. మిమ్మల్ని పందెం కాయమని. విన్నారు కాదు' అన్నాడు శుబ్బారాయుడు.

'ఇక మేం తిరిగివెళ్ళిపోవాలండీ' అన్నాడు వెంకట్రావు మూర్తితో.

'ఇప్పుడేం వెళ్తారు ఇంకా మూడు, నాలుగు రోజులుండండి. మాకు అతిథులు వచ్చేదే ఎప్పుడో ఓ సారి' అన్నాడు మూర్తి.

వెంకట్రావ్ మొహమాటపడ్తున్నాడని శుబ్బారాయుడు

అర్థం చేసుకొన్నాడు.

భోజనం తొందరగా ముగించి చేతులు కడుక్కోవటానికి బాత్ రూమ్‌లోకి వెళ్ళాడు.

రంగి చెంబుతో నీళ్ళు అందిస్తూ అంది మెల్లగా 'సాయంత్రం చీకటి పడ్డాక గుడి వెనక్కి రండి'.

'కామ్రేడ్ రంగీ నీకూ దేముడికీ....' అనబోయి వెంకట్రావు అప్పుడే అన్న మాటలు గుర్తుకు వచ్చి.

'సాయంత్రం ఆరు గంటలకి మునసబుగారి తోటలో పాకలో ఉండు' అన్నాడు సుబ్బారాయుడు. రంగి నవ్వుతూ తల ఊపింది.

'తువ్వాలు దండెం మీద ఉంది' అంటున్న కమల కంఠం విని తొందరగా బాత్‌రూమ్‌లో నుంచి వచ్చాడు సుబ్బారాయుడు.

అందరూ తాంబూలాలు వేసికొంటుంటే సుబ్బారాయుడు అన్నాడు 'ఇందాక వెంకట్రావ్ అన్నట్లు వచ్చి అప్పుడే వారం అయింది-ఇక వెళ్ళిపోవాలి. రేపు సర్కారుకే ప్రయాణం'.

సాయంత్రం అయిదున్నర గంటలకి సుబ్బారాయుడు, వెంకట్రావ్ మునసబుగారి తోటవైపుకి బయలుదేరారు.

చెరువుదాటి పొలం గట్టుమీదుగా వెళ్తున్నారు.

మునసబు గారి తోట సుమారు ఒక మైలు వుంటుంది అక్కడినుంచి.

సుబ్బారాయుడు రవితో నాలుగురోజుల క్రితం ఆ తోటకి వెళ్ళాడు-అందుచేత దారి బాగా తెలుసు.

'చూడు కామ్రేడ్-దూరంగా వున్న ఆ కొబ్బరి తోట మధ్యలో మామిడిచెట్లలో అస్తమిస్తున్న సూర్యుడు-వాటివెనుక ఎంత అందంగా వుంది సీన్' అన్నాడు సుబ్బారాయుడు.

వెంకట్రావ్ ప్రకృతిని ఆరాధించే మూడ్‌లో లేడు.

'రేపే మన ప్రయాణం కదా' అన్నాడు వెంకట్రావ్.

'నువ్వే భోజనాల దగ్గర వెళ్ళిపోతాం అన్నావు కదా' అన్నాడు సుబ్బారాయుడు.

'అవున్రా ఎంతకాలము ఉంటాము-మూర్తి గారు నీకు కజిన్ కావి. నాకు కాదుగా. ఇంతకీ మనం వచ్చిన పని సంగతి ఏమిటి-నీ ప్లాన్ ఏమయింది. అసలు ఏదయినా ప్లాన్ ఉందా ఊరికినే కాలక్షేపం చేశామా' అన్నాడు వెంకట్రావ్ నిష్ఠూరంగా.

'కామ్రేడ్ హేవ్ పేషన్స్'.

'ఏం పేషన్సో నీకు నాలుగు వందల రూపాయలు వచ్చాయి. అదొక్కటే లాభం కనిపిస్తోంది రేపు మునసబుగారు మా నాన్నకి ఉత్తరం రాస్తే ఇక్కడ నే జరిపిన భాగోతం గురించి బందరులో మా నాన్న గారి పేషన్స్ పోతుంది' అన్నాడు వెంకట్రావ్ దిగులుగా.

'కామ్రేడ్ చిన్న విషయం-ఎప్పుడేనా ఏ అమ్మాయి నయినా కిస్ చేశావా' అని ప్రశ్నించాడు సుబ్బారాయుడు.

వెంకట్రావ్ సిగ్గుపడిపోయాడు ఆ ప్రశ్న విని.

'కామ్రేడ్! అలా ఆడపిల్లలా సిగ్గుపడతావేమిటి? పదువయింది. ఉద్యోగం చేస్తున్నావు. పెళ్ళిచేసుకోబోతున్నావు. ఈ పాటికి సగటు తెలుగువాడి అనుభవంలో రెండు, మూడు కేసులైనా అయి వుండాలి. 'కన్‌ఫెషన్స్ ఆఫ్ వెంకట్రావ్' అనే పుస్తకం రాయడానికి కాదు నిన్ను ప్రశ్న అడుగుతా. అసలు నీ కెంత అనుభవం ఉందని' అన్నాడు సుబ్బారాయుడు.

'బెజవాడలో చదివేటప్పుడు భోజనం కేరియర్ తెచ్చే పిల్లని ఒకసారి బుగ్గమీద....' అన్నాడు వెంకట్రావ్.

'ఆ అనుభవం చాలు నేనివ్వబోయే ఉద్యోగానికి' అన్నాడు సుబ్బారాయుడు నవ్వుతూ.

'ఉద్యోగమేమిటి' అన్నాడు వెంకట్రావ్.

'ఉద్యోగం అంటే ఉద్యోగం అని కాదు. ఒక చిన్న 'ఎసైన్‌మెంట్'. ఓ బుల్లి పని. అదీ నీ క్షేమం కోసమే అన్నట్లు ఆ భోజనం కారియర్ పిల్ల రియాక్షన్ ఏం చూపింది' అన్నాడు సుబ్బారాయుడు.

'నేను అలాటి దాన్ని కాదు బాబూ. కావలిస్తే నా మెడలో తాళి కట్టండి మీదాన్నవుతాను' అంది ఆ అమ్మాయి' అన్నాడు వెంకట్రావు గతాన్ని నెమరువేసుకొంటూ.

'చాలా ప్రాక్టికల్ గర్ల్‌లా వుంది.' అన్నాడు సుబ్బారాయుడు మెచ్చుకొంటూ.

'ఇంతకీ ఆ బుల్లి పని ఏమిటి' అన్నాడు వెంకట్రావ్. మునసబుగారి తోట దగ్గరవుతోంది.

దూరంగా పాకముందు ఒక చీర వీళ్ళని చూసి పాక వెనక్కి తప్పుకొంది.


సుబ్బారాయుడి మొహంలో మందహాసం వెలిగింది.

వెనకవైపు చూశాడు.

దూరంలో మునసబుగారు నెమ్మదిగా నడిచివస్తున్నారు.

చేతి వాచి చూసుకొన్నాడు సుబ్బారాయుడు.... ఆరు గంటలవుతోంది.

'కామ్రేడ్! ఇదే పతాక సన్నివేశం.'





వెంకట్రావ్ అర్థంకానట్లు చూశాడు.

'మునసబుగారు ఇటువైపే వస్తున్నారు చూశావా' అని సుబ్బారాయుడు చూపించాడు.

వెంకట్రావ్ చూశాడు.

'ఇంకో పది నిమిషాలలో ఆయన ఇక్కడికి వస్తారు. నేను ఇప్పుడు ఎదురు వెళ్ళి ఆయన్ని కలుసుకొంటాను. అంటే మేం యిద్దరం కలిసి ఇక్కడకు వస్తామన్న మాట.'

వెంకట్రావ్ వింటున్నాడు.

'ఆ పాక చూశావా'

'ఊ' అన్నాడు వెంకట్రావ్.

'ఆ పాక వెనక్కాల రంగి ఉంది. చుట్టుప్రక్కల ఎవరూ లేరు. మేం పాకముందుకి వచ్చేటయిముకి నువ్వు పాక వెనక్కి వెళ్ళి రంగిని దగ్గరకి తీసుకో' అన్నాడు మెల్లగా సుబ్బారాయుడు.

వెంకట్రావ్ మొహం తెల్లబడింది.

'కామ్రేడ్! ఏం భయం లేదు. ఒక్కసారి దగ్గరకు తీసుకో. ఆ భోజనం కారియర్ అమ్మాయికి చేసినదానికన్నా తక్కువే.' అన్నాడు సుబ్బారాయుడు ధైర్యం చెప్తూ.

'లాభం లేదురా. నా వల్లకాదు' అన్నాడు వెంకట్రావ్ తడబడ్తూ.

ఆ భోజనం కారియర్ పిల్ల సంఘటన వెంకట్రావ్ హృదయం మీద మాయని మచ్చ వేసింది కామోసు.

'నీ వల్లకాకపోతే దమయంతి నీది అవుతుంది' అన్నాడు సుబ్బారాయుడు.

'సరే! నువ్వు చెప్పింది చేస్తాను' అన్నాడు వెంకట్రావ్ గుండె దిటవు చేసికొని.

'కాని 'టైమింగ్' చాలా ముఖ్యం. మేం వచ్చే ముందే అది జరగాలి. అంటే నేను మునసబుగారిని అలా పాక వెనక్కి తీసికొని వస్తాను. ఏదో మిష పెట్టి మీరిద్దరూ గాఢాలింగనములో వుండాలి. రైట్. బెస్ట్ ఆఫ్ లక్' అంటూ సుబ్బారాయుడు మునసబుగారిని కలవడానికి వెళ్ళాడు.

ఎదురుగా వస్తున్న సుబ్బారాయుడిని చూసి మునసబు గారన్నారు 'అరె! నా కన్నా ముందరే వచ్చేశారే' అని.

'సూర్యాస్తమయాన్ని చూద్దామని ముందర వచ్చాను.'

'ఆకాశం మా రాజా రంగులో వుంది కదూ' అన్నారు మునసబు కూడా ఆకాశంకేసి చూస్తూ.

'సరంజామా ఎప్పుడు వస్తుంది' అన్నాడు సుబ్బారాయుడు నవ్వుతూ.

'కొబ్బరి బొండాలు రెడీ చేయించి ఆ పాకలో పెడుతానన్నాడు రవి. సీసాకూడా అందులోనే వుంటుంది లెండి. నాకూ, రవిలకే తెలుసు అది ఎక్కడ దాచబడిందీ' అన్నారు మునసబు నవ్వుతూ.

సుబ్బారాయుడు, మునసబు పాక ముందరకు వచ్చారు. 'ఛీ! నన్ను వదులు' అన్న కేక వినిపించింది పాక వెనక్కాల నుంచి.

మరుక్షణంలో చేతిలో గడ్డి కోసుకొనే కత్తితో రంగి పరిగెత్తుకొంటూ పాక ముందరకి వచ్చి మునసబుగారిని చూసి ఆయన వచ్చిన దోవనే పరిగెత్తింది.

మరో క్షణంలో వెంకట్రావు చెంప తడుముకుంటూ వచ్చాడు.

మునసబుగారి కళ్ళూ, వెంకట్రావు కళ్ళూ కలుసుకొన్నాయి.

వెంకట్రావు చంపమీద అయిదు వేళ్ళూ తేలాయి.

మునసబుగారు వెంకట్రావు కేసి కోపంగా చూశారు.

వెంకట్రావు సుబ్బారాయుడి కేసి కోపంగా చూశాడు.

'ఛీ' అన్నారు మునసబు వెంకట్రావు కేసి చూస్తూ.

'హూ' అని ఉరిమాడు వెంకట్రావు సుబ్బారాయుడి కేసి చూస్తూ.

మరో నిమిషంలో చెంపను చేతితోరాసుకుంటూ చెరువు వైపు వెళ్ళాడు వెంకట్రావు ఎవరితోటీ మాట్లాడకుండా.

'ఛీ! చివరకి పనిమనిషి చేతిలో....' అనబోయాడు మునసబుగారు.

'ఏదో చిన్నతనం....' అని సర్దబోయాడు సుబ్బారాయుడు.

ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక

'చిన్నతనమే. వయస్సులో కాదు. మనిషిలో' అన్నారు. మునసబు 'మనిషిలో' అన్నమాట నొక్కి పలుకుతూ.

వెంకట్రావు మొదటినుంచీ మునసబుగార్ని అంత 'ఇంప్రెస్' చెయ్యలేదు.

కాని వెంకట్రావు తండ్రితో స్నేహం వెంకట్రావుని అల్లుడిగా స్వీకరించడానికి మునసబుగారిని ఒప్పించింది. ముంగిలా మాట్లాడకుండా కూర్చునే 'మితభాషు' అంటే మునసబుగారికి సదభిప్రాయం ఎప్పుడూలేదు. మునసబుగారి ఉద్దేశంలో 'కుర్రాడు' అంటే ఎప్పుడూ చలాకీగా మాట్లాడే సుబ్బారాయుడి లాంటి 'వ్యక్తి'.

వెంకట్రావు ఉపన్యాసం విన్న తర్వాత తన నిర్ణయం తప్పేమో.ఆ వెంకట్రావు దమయంతికి జోడీకాదేమో అన్పించింది మునసబుగారికి.

కాని స్నేహితుడికి ఇచ్చిన మాట తీసుకోడానికి కుటుంబ గౌరవం, ఆత్మ గౌరవం అడ్డు వచ్చింది.

'తాగడంలో తప్పులేదు. కాని అలా పబ్లిక్ మీటింగ్ ముందర పుచ్చుకోకూడదు' అనేది మునసబుగారి సిద్ధాంతం.


'మీటింగ్ ముందరే కాదు అసలు పబ్లిక్ ముందర తీసుకోకూడదు' అనేది కూడా ఆయన సిద్ధాంతం.

'అదంతా ఒక ఎత్తు. పని మనిషిని వాంఛించే వెంకట్రావ్ దమయంతిని ఏం చూసుకొంటాడు' అనుకొన్నారు మునసబు.

ఎంత తండ్రి అయినా తన కూతురు 'జయప్రద'లా ఉండదని ఆయనకీ తెలుసు.

'పైగా కుటుంబ గౌరవం. ఈ రంగి వెళ్ళి జరిగినదాన్ని ఊళ్ళో టముకు వేయించింది అంటే పనిమనిషి చేతిలో చెంపదెబ్బ తిన్నవాడిని తన అల్లుడిగా చేసుకొంటున్న తన కుటుంబ గౌరవం ఏమవ్వాలి. కరణం తనకి మనశ్శాంతి ఉండనిస్తాడా ఇంకా' అని కూడా అనుకున్నారు మునసబు.

నిర్ణయాలు తీసికొనడంలో మునసబుగారిది అందెవేసిన




చెయ్యి.

'రేపే వాడికి రాస్తాను. ఈ సంబంధం అక్కర్లేదని' అన్నారు మునసబు జనాంతికంగా.

పాక ప్రక్కన మామిడిచెట్టు వెనక్కాల ఉన్న గడ్డిమేటు వెనక అలికిడి అయితే సుబ్బారాయుడు అటు కేసిచూశాడు. కాని తర్వాత గడ్డిమేటు నిశ్చలంగానే వుంది.

'సరేలెండి ఆ విషయం తర్వాత. ముందర మనం వచ్చిన పని కానిద్దాం' అన్నారు మునసబు నవ్వుతూ.

మునసబుగారి రాజకీయ జీవితంలో ఇలాటి క్లిష్ట పరిస్థితులు అప్పుడప్పుడూ వస్తూనే వుంటాయి. కాని అవి తన సుఖానికి అడ్డుగా ఎప్పుడు ఆయన రానీయలేదు.

పాకలోకి వెళ్ళి బొండాలు, కత్తీ, స్కాచ్ సీసా, రెండు పెద్ద గ్లాసులు తెచ్చి, మామిడిచెట్టు క్రిందవున్న కొబ్బరి చాప మీద పెట్టి. తను కూర్చొని 'రండి! రాయుడుగారు' అని సుబ్బారాయుడిని ఆహ్వానించారు మునసబుగారు.

రెండు పెగ్‌లు దిగేటప్పటికి మునసబుగారి మొహంలో ఆహ్లాదత వచ్చింది.

'రాయుడుగారు మీ అంత తెలివైన కుర్రాడిని నేను జీవితంలో చూడలేదు' అన్నారు మునసబు.

'కేవలం మీ అభిమానం' అన్నాడు సుబ్బారాయుడు వినయంగా.

'మీకు రూపం ఉంది, చదువు వుంది, చక్కగా మాట్లాడే నైపుణ్యం ఉంది, ఎత్తుకు పైఎత్తు వేసే ప్రజ్ఞ ఉంది. ఇంతకన్నా ఏ కుర్రాడిలోనయినా ఏం వుంటుంది- ఉండగలదు' అన్నారు నొక్కిపలుకుతూ మునసబు.

సుబ్బారాయుడు ఇంకో పెగ్ కలిపి మునసబుగారికిచ్చి తనూ ఇంకోటి కలుపుకొన్నాడు.

'ఈ కులం, మతం అర్థంలేని విషయాలు' అన్నారు మునసబు మూడో పెగ్ సగం ఖాళీచేస్తూ.

'ఆ విషయంలో నేను మీతో పూర్తిగా ఏకీభవిస్తా. నేను సిద్ధాంతరీత్యా సోషలిస్ట్' అన్నాడు సుబ్బారాయుడు గ్లాస్ 'సిప్' చేస్తూ.

'మన దేశం ముందుకు పోవాలంటే ఈ భావాలు పోవాలి. గాంధిగారు చెప్పింది నిజం' అన్నారు మునసబు మూడో పెగ్ మిగతా సగం ఖాళీచేస్తూ.

సుబ్బారాయుడు మునసబుగారికి నాలుగో పెగ్ కలిపే ప్రయత్నంలో ఉన్నాడు.

'మా దమయంతిని నీ కిచ్చి పెళ్ళిచేస్తా' అన్నారు మునసబు. చెక్కిన కొబ్బరిబొండాన్ని కత్తితో బ్రద్దలుకొడ్తున్న సుబ్బారాయుడిని చూస్తూ.

ఆ మాట వింటూ సుబ్బారాయుడు బొండాంలో నీళ్ళని గ్లాస్‌లో బదులు ప్రక్కన పోశాడు.

'దమయంతిని ఊరికేనే యిస్తానని అనుకోకండి రాయుడుగారూ! నా ఆస్తిలో సగం దానికి రాస్తాను. రెండు తరాల వరకు సంపాదించవ-సిన అవసరం లేకుండా, కాలు

మీద కాలువేసుకొని కూర్చోవచ్చును' అన్నాడు మునసబు గర్వంగా.

'మీకు నాయందున్న సద్భావానికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు. నేను....'

అని శుబ్బారాయుడు ఏదో అనబోతూ వుండగా మునసబుగారు లేచి 'ఇప్పుడే వస్తా' అంటూ అరటితోట వైపుకి వెళ్ళారు.

ఆయన అరటి తోటలో మాయమవ్వగానే ఏదో ఆలోచిస్తూ శుబ్బారాయుడు గ్లాస్‌ని నోటి దగ్గరకి తీసుకున్నాడు.

'మాదచోద్' అన్న మాటకి ఈ లోకంలోకి తిరిగి వచ్చాడు శుబ్బారాయుడు.

ఎదురుగ్గా ఎర్రటి మొహంతో, చేతిలో కొబ్బరి బొండాలు చెక్కే కత్తితో రవి వున్నాడు.

'కామ్రేడ్ రవీ! ఎప్పుడు వచ్చారు కూర్చోండి. ఎవర్ని అలా కేకలు వేస్తున్నారు' అన్నాడు శుబ్బారాయుడు మర్యాద చేస్తూ.

'మాదచోద్' అన్నాడు మళ్ళీ రవి వింయునే.

'నాతోనేనా మాట్లాడుతున్నారు' అన్నాడు శుబ్బారాయుడు సంశయంగా.

'ఆ నీతోనే' అన్నాడు రవి ఉరుముతూ.

'కామ్రేడ్ రవీ! ఆ మాటకి హిందీలో అర్థం మాకు తెలియక 'హలో' కి నానా అర్థంగా అనుకొని ఉంటారు. స్నేహితుల మధ్య....' అని ఆగాడు శుబ్బారాయుడు.

'నీ నక్క వినయాలు చాలించు. కృతజ్ఞతలట కృతజ్ఞతలు. అందులో హృదయ పూర్వక కృతజ్ఞతలు. నేను అన్నీ వింటూనే వున్నాను గడ్డిమేటు వెనక్కాల నుంచి. అంతకు ముందు వెంకట్రావ్‌గారితో చెప్పినదీ విన్నాను. దమయంతినీ వెంకట్రావ్‌ని వేరుచేశావ్. మునసబుగారిని బుట్టలో వేసికొన్నావ్. ఇదంతా నీ కుట్ర. దమయంతినీ, ముఖ్యంగా మామయ్య ఆస్తిలో సగ భాగాన్నీ కాజేయడానికి నువ్వు పన్నిన పన్నాగం యిది ఎవరి కన్ను కప్పినా నా కన్ను కప్పలేవు' అన్నాడు కోపంగా రవి.

'కామ్రేడ్! మీరు పూర్తిగా....'

'మాటలు చాలించు. రేపీపాటికి నీ పెట్టే బేడా సర్దుకొని ఈ ఊరు వదలకపోతే జాగ్రత్త. ఈ కత్తికి పని తగులుతుంది. ఒక మోసగాడి పరం నా దమయంతిని చెయ్యను. నా ప్రాణం పోయినా సరే' అంటూ గడ్డిమేటు వెనక్కి వెళ్ళిపోయాడు దూరాన్న మునసబుగారు తిరిగి రావడం చూస్తూ.

'మీ అంగీకారం ఉన్నాట్లైనా నేను చెప్పినదానికి' అన్నారు మునసబుగారు తిరిగి వచ్చి కూర్చొని గ్లాస్ అందుకుంటూ.

శుబ్బారాయుడు మొహం గంభీరమయింది.

ఇంకో పెగ్ కలుపుకొని కాస్త త్రాగి అన్నాడు.

'మీరు నా తండ్రిలాంటివారు.'

'ఊ....' అన్నాడు మునసబు తనుకూడా ఒక గుటక వేసి.

'మా తండ్రిగారు చిన్నప్పుడే పోయారు.'

'అయ్యో పాపం. నాకు తెలీదు ఈ విషయం' అన్నాడు మునసబు సానుభూతిగా.

'మీతో ఓ విషయం చెప్పాలి.'

ఏమిటి' అన్నాడు మునసబు.

'ఈ విషయం చాల గుప్తంగా వుంచాలి.'

'సరే'

'ఆఖరికి డాక్టర్ మూర్తికి కూడా తెలియకూడదు.'

'సరే' అని అభయ హస్తం యిచ్చాడు మునసబు.

'నాకిదివరకే పెళ్ళి అయింది.'

మునసబుగారి మొహంలో 'దానికేంలే' అన్న భావన ఉంది.

'ఈ విషయం తెలిస్తే మా బాబాయి నాకుఆస్తియివ్వడు.'

'ఎందుకు' అన్నారు మునసబు.

'నేను కులాంతర వివాహం చేసికొన్నాను. మా బాబాయి యిలాటి వాటికి వ్యతిరేకి.'

'ఆయన ఆస్తి ఇవ్వకపోతే నేనిస్తాగా' అన్నట్లుచూశారు మునసబు.

'నా కిద్దరు పిల్లలు కూడాను.'

మునసబుగారి మొహంలో ఇంకా ఆశపోలేదు.

'ఇప్పుడు అది కడుపుతో వుంది.'

'అలా అయితే కొద్దిగా కష్టమే' అన్న భావం మునసబుగారి మొహంలోకి వచ్చింది.

'డాక్టర్ కవలలు అని చెప్తోంది.'

'ఇక లాభంలేదు' అనుకున్నారు మునసబు.

'సరే! మాకు అదృష్టంలేదు-ఏం చేస్తాం' అన్నారు మునసబు వేదాంత ధోరణిలో.

'నాదింకో మాట' అన్నారు శుబ్బారాయుడు.

'చెప్పండి' అన్నారు మునసబు అయిదోపెగ్ కలుపుతూ.

'మీ అంతటివారు దమయంతి పెళ్ళికి పరాయివాడి కాళ్ళు కడగడం ఎందుకు. రవికే యిచ్చేయండి' అన్నాడు



శుబ్బారాయుడు మెల్లగా.

'నాకూ మొన్న అలాగే అన్పించింది. అంటే రవి పాముని చంపి దమయంతిని రక్షించినపుడు. మీరు చెప్పింది సబబుగానే వుంది. రవికే దమయంతిని ఇస్తాను' అన్నారు మునసబుగారు గ్లాస్ ఒక్క గుక్కలో ఖాళీచేస్తూ.

'చాల సంతోషం అండీః రవి దమయంతికి సరయిన జోడీ' అన్నాడు శుబ్బారాయుడు.

'పెళ్ళికి మీరు తప్పకుండా రావాలి' అన్నారు మునసబు.

'తప్పకుండా. ఇంకో స్కాచ్ బాటిల్ ఇస్తానంటే' అన్నాడు శుబ్బారాయుడు నవ్వుతూ.

'ఒకటేమిటి. మీకు కావలిస్తే అన్నీ తెప్పిస్తా. సరేనా' అన్నారు మునసబు నవ్వుతూ.

'కాని ఒక్క షరతు' అన్నాడు శుబ్బారాయుడు.

'ఏమిటిః'

'ఈసారి అయిస్ సోడాలు కావాలి' అన్నాడు శుబ్బారాయుడు.

'జిహ్వాకొక రుచి' అన్నారు మునసబు నవ్వుతూ.

కాసేపటిలో సీసా ఖాళీ అయింది.

'సరేః నే వస్తానండీ' అని లేచాడు శుబ్బారాయుడు.

'ఒక్కరే వెళ్తారా. నేనూ వద్దనుగాని ఓ గంటయితేనే కాని మామూలు మనిషిని కాను' అన్నారు మునసబు చాపమీద పడుక్కొంటూ.

'రేపొద్దున్న కలుస్తాలెండి' అంటూ కదిలాడు శుబ్బారాయుడు.

ఏదో గుర్తుకు వచ్చి మళ్ళీ వెనక్కి వచ్చాడు.

'మునసబుగారూ' అన్నాడు శుబ్బారాయుడు.

'ఏంః భయం వేసిందా.ఓ గంట యిక్కడే కూర్చోండి. ఇద్దరం కలిసి వెళ్దాం' అన్నారు మునసబు నవ్వుతూ.

'భయం కాదండీ. వరం' అన్నాడు శుబ్బారాయుడు.

'ఏమిటి' అన్నట్లు చూశాడు.

'మీరు నా కిచ్చిన వరం ఇప్పుడు కోరతా' అన్నాడు శుబ్బారాయుడు.

'అడగండి' అన్నారు మునసబు.

'ఆ తోట అంతా రాసి ఇచ్చేయమన్నా రాయడానికిసిద్ధం' అనే భావన స్ఫురించింది ఆయన గొంతులో.

'వెంకట్రావ్ నాన్నగారికి వాడి గురించి ఏమీ వ్రాయకండి. దమయంతి రవి అంటే యిష్టపడుతోంది. పిల్ల సుఖం కోసం ఈ మార్పు చెయ్యవలసివస్తోంది అని రాయండి. ఇది నా రిక్వెస్ట్. అదే వరం' అన్నాడు శుబ్బారాయుడు.

'సరేః అలాగే చేస్తాను. కాని వెంకట్రావ్....'

'వెంకట్రావ్ తండ్రి మీకు ఎలా ప్రాణ స్నేహితుడో వెంకట్రావ్ కూడా నా ప్రాణ స్నేహితుడు' అన్నాడు శుబ్బారాయుడు.

'మాట యిచ్చిన తర్వాత రామలింగయ్య ఆ మాట మీదే నిలబడి వుంటాడు. మీరు చెప్పినట్లే రేపే బందరు ఉత్తరం రాస్తా' అన్నారు మునసబు.

చెరువుగట్టుమీద కూర్చొన్న వెంకట్రావ్ శుబ్బారాయుడిని చూస్తూనే మండిపడ్డాడు.

'ఏమిటిరా నీ ప్లాన్, నా బొంద ప్లాన్. తాగించి అందరి ఎదుటా వాగించావ్, చివరకి పనిమనిషిచేత చెంప దెబ్బలు కొట్టించావ్. ఛీ' అన్నాడు కోపంగా వెంకట్రావ్.

'నీ ముగ్ధ మోహనరూపం చూసి క్లాస్‌మేట్ రంగి పరవశిస్తుందనుకొన్నా కాని అలా చేస్తుందని అనుకోలేదు. ప్లీజ్ యాక్సెప్ట్ మై ఎపాలజీస్' అన్నాడు శుబ్బారాయుడు.

'బోడి ఎపాలజీస్ ఎందుకు. ఇప్పుడు నా మొహం మీ కజిన్ యింట్లో ఎలా చూపించడం' అన్నాడు వెంకట్రావ్ ఇంకా కోపంగా.

'ఏదో ముళ్ళపొద తగిలిందని చెప్పొచ్చులే. అయినా నీ జీవన్మరణ సమస్యా పరిష్కారణలో ఒక చిన్న చెంప దెబ్బ. అదీ నా మాటల్లో చెప్పాలంటే 'మంచి ఎట్రాక్షన్ వున్న పిల్ల చేతితో ఒక లెక్కా' అన్నాడు శుబ్బారాయుడు.

'సమస్య పరిష్కారం అవ్వాలి గదాః'

'ఓ.కె. నీ సమస్య పరిష్కారం అయిందని చెబితే ఆ దూర్వాస అవతారం చాలిస్తావా' అన్నాడు శుబ్బారాయుడు నవ్వుతూ.

'అంటే' అన్నాడు వెంకట్రావ్ ఆశతో.

'క్లాస్‌మేట్ వెంకట్రావు ఈ విశాల భారతంలో నీకు కావాల్సిన సన్నటి అమ్మాయిని వీలయితే రంగిలో ఉన్న 'ఎట్రాక్షన్' తో వున్న సన్నటి అమ్మాయిని నీ జీవిత భాగస్వామురాలుగా చేసికొందుకే సంపూర్ణ స్వాతంత్ర్యము ఈ



క్షణాన్నుంచీ నీకు ఉంది' అన్నాడు సుబ్బారాయుడు.

'థేంక్స్‌రా! మెనీ థేంక్స్!' అంటూ వెంకట్రావు సుబ్బారాయుడిని ఎత్తుకుని మూడుసార్లు తిప్పాడు.

'రేపే మీ నాన్నకి మునసబుగారు ఉత్తరం రాస్తాడు' అన్నాడు సుబ్బారాయుడు వెంకట్రావు కౌగిలి విడిపించుకొని.

'ఏమని' అన్నాడు వెంకట్రావు ఆదుర్దాగా.

'చి॥ సౌ॥ దమయంతిని చి॥ రవికి ఇచ్చి వివాహం చేయుటకు పెద్దలు నిశ్చయించిరిగాన తాము సకుటుంబ సమేతంగా బందరు నుంచి దగ్గుపల్లి రావాలనీ. ఈ వివాహం చేయుటకు ముఖ్య కారణము చి॥ సౌ॥ దమయంతి చి॥ రవి ని మాత్రమే పరిణయము ఆడుటకు పట్టుపట్టడమే కారణమనీ.'

'ఒరేయ్ నువ్వు దేముడివిరా' అన్నాడు వెంకట్రావు పొంగిపోతూ ఆనందంతో.

'కాని కామ్రేడ్ రవి అలా అనుకోవటం లేదు. నేను రేపిపాటికి దగ్గుపల్లి వదలకపోతే బొండాలు చెక్కే కత్తితో నన్ను బొండాంలా చెక్కేస్తానని నా ఎదుటే శపథం పట్టాడు' అన్నాడు సుబ్బారాయుడు.

'రవి ఎక్కడ వున్నాడు ఇప్పుడు' అన్నాడు వెంకట్రావు.

'నీకు సుపరిచితమైన పాక ప్రక్కన గడ్డిమేటి వెనకాల నేను పదిహేను నిమిషాల క్రితం చూశాను' అన్నాడు సుబ్బారాయుడు.

వెంకట్రావు మునసబుగారి తోటవయిపు పరిగెత్తాడు.

## 12

ఉదయం కాఫీలు అయ్యాయి.

వెంకట్రావు లోపల గదిలో సామాను సర్దుతున్నాడు.

కమల వంట గదిలో వుంది.

రఘు స్కూల్‌కి వెళ్ళిపోయాడు.

మూర్తి స్నానం చేస్తున్నాడు.

రంగి వీధి గది తుడుస్తోంది.

సుబ్బారాయుడు వీధిగదిలోకి వెళ్ళి కుర్చీలో కూర్చొన్నాడు.

రంగి సుబ్బారాయుడి కేసి చూసి నవ్వింది.

'కామ్రేడ్ రంగీ! నువ్వు చేసిన సహాయానికి వెరీ మెనీ థేంక్స్' అన్నాడు సుబ్బారాయుడు.

రంగికి ఆ మాటలు అర్థమవ్వకపోయినా నవ్వింది.

'పది గంటల బస్‌లో వెళ్ళిపోతున్నాం' అన్నాడు సుబ్బారాయుడు.

రంగి ఖలాకీ అయిన పిల్ల అని మూర్తి 'సర్టిఫికెట్' యిదివరకే యిచ్చాడు.

'సమయస్ఫూర్తి వున్న పిల్ల అని పచ్చగడ్డి కోసుకొనే కత్తితో నిన్న మునసబుగారి తోటకి వెళ్ళడంలో రుజువు అయింది.'

ఎవరయినా చూసినా 'గడ్డి కోసుకొందుకి వచ్చింది లే' అనుకుంటారు కదా.

కార్య తురత్వం ఉందని 'వెంకట్రావు ఎఫయిర్'లో నిరూపించుకుంది.

'పది గంటల బస్‌లో వెళ్ళిపోతున్నాం' అన్నమాట రంగి మనస్సులో సూటిగా నాటుకొంది.

చీపురు పడేసి తిన్నగా సుబ్బారాయుడి కుర్చీ దగ్గరకు వెళ్ళింది. 'ఎవరూ లేరు చుట్టు ప్రక్కల' అని నిర్ధారణ చేసుకొని.

సుబ్బారాయుడి పెదిమల మీద తన పెదిమలు ఒక్క క్షణం ఆన్చింది.

తర్వాత చీపురు తీసికొని లోపలకి వెళ్ళిపోయింది.

'దటీజ్ వెరీ స్మాల్ ప్రైస్ టు పే' అనుకున్నాడు సుబ్బారాయుడు మనసులో.

ఇంకో నిమిషంలో రవి గుమ్మం ముందు వున్నాడు.

సుబ్బారాయుడు రవి చేతులు చూశాడు ముందర. చేతిలో కత్తి లేదు.

'రండి కామ్రేడ్ రవీ' అని ఆహ్వానించాడు.

'సుబ్బారాయుడుగారూ నన్ను క్షమించండీ' అన్నాడు రవి చేతులు జోడిస్తూ.

'మనలో మనకి ఈ 'ఫార్మాలిటీస్' ఏమిటి' అన్నాడు సుబ్బారాయుడు నవ్వుతూ.

'వెంకట్రావుగారు నిన్న తోటలో చెప్పారు అంతా. మిమ్మల్ని అనవసరంగా అనుమానించాను. రబ్బరు త్రాచు పాము మీరే పెట్టమన్నారన్న విషయం కూడా ఆ క్షణంలో మరచిపోయా' అన్నాడు రవి బాధపడుతూ.

'ఆవేశం. ఆవేశం ఉందంటే దాని వెనకాల ప్రేమ ఉందనే అర్థం' అన్నాడు సుబ్బారాయుడు.

రవి సిగ్గుపడ్డాడు ఒక క్షణం.

'మా పెళ్ళికి మీరు రావాలి తప్పకుండా.'

'ష్యూర్ కామ్రేడ్! కాని బొండాం చెక్కే కత్తులు దగ్గరలో ఉండకూడదు' అన్నాడు సుబ్బారాయుడు నవ్వుతూ.

'మామయ్య ప్రొద్దున అందరితోనూ చెప్పాడు మా



పెళ్ళి విషయం. దమయంతి కూడా తన కిష్టమే అందిట' అన్నాడు రవి ఆనందంగా.

'వెరీ గుడ్! ఒక చిన్న సందేహం. చిన్న వెంకట్రావు తోటకి తిరిగి వచ్చినప్పుడు మీ మామయ్య చూడలేదా?'

'ఆయన అప్పటికే గుర్రుపెట్టి నిద్రపోయారు. రాత్రి పది గంటలకి నేను లేపి ఇంటికి తీసుకొని వచ్చాను' అన్నాడు రవి నవ్వుతూ.

రవితో పాటు సుబ్బారాయుడు కూడా మునసబుగారింటికి వచ్చాడు.

'పదిగంటల బస్‌లో వెళ్ళిపోతున్నామండీ మీ దగ్గర సెలవు పుచ్చుకొందికి వచ్చాను' అన్నాడు సుబ్బారాయుడు మునసబుగారితో.

దమయంతి పెళ్ళికి మాత్రం రావడం మరిచిపోకండి' అన్నారు మునసబు.

'ఆయన రాకపోతే నేనే విజయవాడ వెళ్ళి లాక్కొని వస్తా మామయ్యా' అన్నాడు రవి నవ్వుతూ.

'అన్నట్లు బందరు ఉత్తరం రాశారా' అన్నాడు సుబ్బారాయుడు యథాలాపంగా.

ఆయన ఒక వేళ మనసు మార్చుకొన్నాడేమో అన్న అనుమానం లేకపోలేదు సుబ్బారాయుడికి.

'ప్రొద్దున్నే రాసేయడం పోస్ట్ చేసేయడం కూడా అయింది. మీరు చెప్పినట్లే రాశాను' అన్నారు మునసబు.

ఏడుగంటలకి దగ్గుపల్లినుంచి బయలుదేరవలసిన బస్ పది గంటల బస్‌గా మార్చబడి కాకినాడ వెళ్ళడానికి సిద్ధంగా వుంది.

కమల, రఘులకు యింటి దగ్గర—మూర్తి, శాస్త్రిలకు హాస్పిటల్ దగ్గర వీడ్కోలుచెప్పి బస్ ఎక్కారు వెంకట్రావ్, సుబ్బారాయుడూ.

'ఎంత వద్దన్నా' వినిపించుకోకుండా రవికూడా కాకినాడ వరకు వస్తానని బస్ ఎక్కాడు.

బస్ కదలబోతుంటే రంగి వచ్చింది.

బస్‌కి కాస్త దూరంలో నిలబడి సుబ్బారాయుడికేసే చూస్తోంది.

'రంగి వచ్చిందిరా' అన్నాడు వెంకట్రావ్ మెల్లగా సుబ్బారాయుడి చెవిలో.

సుబ్బారాయుడు రంగికేసి చూశాడు.

బస్ కదిలింది.

రంగి కళ్ళలో నీరు మెరసింది.

'విష్‌యూ వెరీ హేపీ మేరీడ్ లైఫ్' అన్నాడు నెమ్మదిగా సుబ్బారాయుడు.

'ఏమిట్రా గొణుగుతున్నావ్' అన్నాడు వెంకట్రావ్.

'కామ్రేడ్ చిన్న నన్ను దేముడు అన్నావ్ కాని, నువ్వు నిజంగా కృతజ్ఞత చూపించాల్సింది ఆ అమ్మాయికి' అన్నాడు సుబ్బారాయుడు కనుమరుగవుతున్న రంగిని చూపిస్తూ.

'ఏం' అన్నాడు వెంకట్రావ్.

'మునసబుగారికి కోపం వచ్చింది. నువ్వు ఆ అమ్మాయిని తాకినందుకు కాదు అలాంటివి ఈ పల్లెటూరు మోతుబరులలో అసాధారణం కాదు. ఆయనకి కోపం వచ్చింది నువ్వు ఆ అమ్మాయి చేతి దెబ్బ తినినందుకు' అన్నాడు సుబ్బారాయుడు బయటికి చూస్తూ.

కాసేపయిన తర్వాత నవ్వుతూ సుబ్బారాయుడు అన్నాడు.

'నువ్వు కృతజ్ఞత చూపించవలసిన ఇంకో వ్యక్తి బెజవాడలో ఉన్నాడు. ఈ ప్లాన్ అంతా కామ్రేడ్ వెంకన్నగారి చలవే'.

మూడు నెలల తర్వాత రోజూలాగ్నే కోడి కూసింది. ఆ గదిలో రోజూలాగే సుబ్బారాయుడు లేచి బద్ధకంగా ఆవలించి హెచ్. ఎమ్. టి. చేతి గడియారం చూశాడు.

అది కూడా పదిగంటలే చూపిస్తోంది.

టీపాయ్ మీద పేపర్, దాని మీద రెండు టెలిగ్రాములు వున్నాయి. చింపి చదివాడు.

మొదటి టెలిగ్రాం వెంకట్రావ్ దగ్గర్నించి.

'మేరేజ్ ఈజ్ ఫిక్స్‌డ్- బ్రైడ్ నాట్ ఆల్‌రెడీ మేరీడ్- ఫంక్షన్ ఆన్ ఏప్రిల్ సెకండ్ ఇన్ కాకినాడ యు షుడ్ ఎటెండ్ విత్ వెంకన్న- ఏవిరావ్'.

'కామ్రేడ్ వెంకన్నా' అని పిలిచాడు సుబ్బారాయుడు.

'బాబుగారూ లేచారా' అంటూ వేడి కాఫీ కప్పుతో వచ్చాడు వెంకన్న గదిలోకి.

'వెంకట్రావ్‌కి పెళ్ళట మనిద్దర్నీ రమ్మన్నాడు' అన్నాడు సుబ్బారాయుడు వేడి కాఫీ త్రాగుతూ.

'మంచిది బాబుగారూ' అన్నాడు వెంకన్న సంతోషంగా.

రెండో టెలిగ్రాం రవి దగ్గర్నించి.

'మేరేజ్ ఆన్ ఏప్రిల్ సెకండ్ ఇన్ కాకినాడ-ఇన్విటేషన్ ఫాలోస్-రవి'.

'మూడో పెళ్ళికూడా ఏప్రిల్ సెకండ్‌నే కాకినాడలోనే జరుగుతుందేమో' అనుకొని నవ్వుకొన్నాడు సుబ్బారాయుడు మనస్సులో.

(సమాప్తం)

అంకితం : ______________________

మామూలు సంభాషణ కూడా ఒక కళే అనిపిస్తారు
కోనసీమవాసులు. కోనసీమ ఆడపడుచు మా అమ్మ

——————— శ్రీమతి నందుల సత్యవతికి.